

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త


హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-1-2026 గురువారం సంపుటి: 31 సంచిక: 358 పేజీలు: 10+4 వెల: 6.50


ఫిబ్రవరి 3 నుంచి సిఎం రేవంత్ ఎన్నికల ప్రచారం 2

మేడిపల్లిలో ఘోర ప్రమాదం ఇద్దరు విద్యార్థులు మృతి 3



బుధవారం బారామతి వద్ద దగ్ధమవుతున్న అజిత్ పవార్ ప్రయాణించిన విమానం

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం

# అజిత్ పవార్ దుర్మరణం

### బారామతిలో ల్యాండింగ్‌కు ముందు కుప్పకూలి భగ్గుమన్న విమానం

### అజిత్‌తో పాటు పిఎస్, ఇద్దరు పైలట్లు, అటెండెంట్ అక్కడికక్కడే మృతి

### రన్‌వేపై దిగడానికి ముందు విమానంలో సాంకేతిక వైఫల్యం

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ, మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్

### విద్యాప్రతిష్ఠాన్‌లో నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

**బారామతి, జనవరి 28:** మహారాష్ట్రలో జరిగిన విమాన ప్రమాదంలో ఉపముఖ్యమంత్రి, ఎన్సీపీ చీలికవర్గం అధ్యక్షుడు అజిత్ పవార్ మరణించారు. ఆయన ప్రయాణిస్తున్నవిమానం ల్యాండ్ అవుతుండగా ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో అజిత్ పవార్‌తో సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం పుణెలోని బారామతిలో జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారంలో అజిత్ పవార్ పాల్గొనాల్సి ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా నాలుగు కీలక ప్రజాసభలకు అజిత్ పవార్ హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ఆయన ముంబై నుంచి >>2



బుధవారం పార్లమెంటు వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ తదితరులు

# ఆర్థిక సమృద్ధితో వికసిత భారతం

### నిజాయితీతో పారదర్శక పాలన

### ఉనికి కోల్పోయిన ఉగ్రవాదం

### దేశాభివృద్ధిలో నారీశక్తి భాగస్వామ్యం

### పార్లమెంట్‌లో రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ, జనవరి 28:** దేశం వేగంగా అభివృద్ధి చెందుతూ వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. భారత దేశం ప్రతి రంగంలోనూ అభివృద్ధి చెందుతోందన్నారు. గత 11 సంవత్సరాలుగా దేశ ఆర్థిక పరిస్థితి గణనీయంగా బలపడిందన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలనుద్దేశించి ప్రసంగించారు. తమ ప్రభుత్వం నిజాయితీతో కూడిన పారదర్శక పాలన అందిస్తు స్తోందని, వెనకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అన్నారు. ఆపరేషన్ సింధూర్ గురించి రాష్ట్రపతి ప్రస్తావిస్తూ, "భారత సైన్యం ధైర్యం, పరాక్రమాన్ని మనం చూశాం. ఉగ్రవాద స్థావరం నాశనం చేశాం. భవిష్యత్తులో ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందన దృఢంగా, నిర్ణయాత్మకంగా ఉంటుంది. సింధు జల ఒప్పందం కూడా ఇందులో భాగమే" అని అన్నారు. మావోయిస్టుల గురించి మాట్లాడుతూ, మావోయిస్టు ఉగ్రవాదులపై నిర్ణయాత్మక చర్య తీసుకున్నామని రాష్ట్రపతి వివరించారు. నేడు, మావోయిస్టు ఉగ్రవాదుల సంఖ్య 126 నుండి 8 జిల్లాలకు తగ్గింది. కేవలం 3 జిల్లాలు మాత్రమే తీవ్రంగా ప్రభావితమయ్యాయి. 2,000 మందికి పైగా >>2



# మా కేబినెట్ ఉమ్మడి కుటుంబం

**మధిర జనవరి 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం క్యాబినెట్ మంత్రులు ఎమ్మెల్యేలు అందరం ఒక ఉమ్మడి కుటుంబంలా ఉన్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు బుధవారం మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొంతమంది వ్యక్తులు తమ వ్యక్తిగత అభిప్రాయాలను ఆలోచనలను పిచ్చిరాతలుగా రాస్తూ ప్రభుత్వంపై మంత్రులపై అపోహలను సృష్టిస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తాను మంత్రివర్గం అంతా సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగుతున్నామని అన్నారు సీఎం అందుబాటులో లేని సందర్భంలో రాష్ట్రంలో నెలకొన్న పాలన పరిస్థితులు ఇతర అంశాలు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నెలకొన్న సమస్యలపై డిప్యూటీ సీఎం గా తాను మంత్రులతో పిసిసి అధ్యక్షునితో కలిసి మాట్లాడటం జరిగిందని ఇది కూడా ప్రజాభవన్లోనే జరిగిందని దీనిపై రాజకీయ కుట్ర ఆరోపణలు చేస్తూ ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. మంత్రుల మధ్య అనేక పాలన సంబంధమైన అంశాలపై నిరంతరం చర్చ కొనసాగుతుందన్న కనీస జ్ఞానం లేని వ్యక్తులు ప్రభుత్వంపై నిందలు వేసే చర్యలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో గ్రామీణ పట్టణ పేద ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ ల అమలు విషయంలో 90!! వరకు అమలు చేశామని మిగిలిన కార్యక్రమాల విషయంలో త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మహాలక్ష్మి ్మ పథకాన్ని ఆరోగ్య శ్రీ పథకాన్ని గృహలక్షి ్మ పథకాన్ని గృహ జ్యోతి పథకాన్ని అమలు చేశామని పేద వర్గాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేశామని ఒకటి పాయింట్ 0 3 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఉపాధి అవకాశాలకు సంబంధించి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసామని గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించడం తోపాటు ఫలితాలను ప్రకటించామని, మరెన్నో వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు.

### డి.సిఎం, మంత్రులు కలిసి మాట్లాడుకుంటే తప్పా?: భట్టి

### ప్రజల మద్దతుతో మున్సిపోల్స్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం తథ్యం..



మీడియాతో ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి కనినిక ఘోష్. చిత్రంలో తదితర మహిళా నేతలు

### ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శిగా

# కనినిక ఘోష్

### జాతీయ అధ్యక్షురాలుగా మరోసారి పికె శ్రీమతి ఎన్నిక

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 28:** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శిగా పశ్చిమ బెంగాల్‌కి చెందిన కనినిక ఘోస్ బోస్ ఎన్నికయ్యారు. జాతీయ అధ్యక్షురాలుగా కేరళకి చెందిన పికె శ్రీమతి మూడోసారి ఎన్నికయ్యారు. జాతీయ కోశాధికారిగా ఒడిషాకి చెందిన తాపసి ప్రహరాజ్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 25 నుంచి హైదరాబాద్‌లో జరుగుతున్న ఐద్వా 14వ జాతీయ మహాసభలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజైన బుధవారం రాబోయే మూడు సంవత్సరాలకి కొనసాగే కేంద్ర కమిటీ, కార్యదర్శివర్గాన్ని >>2



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

### ప్రేమపెళ్లికి అడ్డు చెప్పారని

# తల్లిదండ్రులను కడతేర్చిన కూతురు

### విషం ఇంజెక్షన్ ఇచ్చి హత్య

**వికారాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** తల్లిదండ్రులను కొడుకులు కాదనుకున్న..కూతురు ఉందన్న నమ్మకంతో ఎంతో మంది తల్లిదండ్రులు కూతుళ్లపై భరోసా పెట్టుకుని జీవిస్తుంటారు. దానికి తగ్గట్లుగానే వృద్ధ తల్లిదండ్రులను కూతుళ్ళు చేరదీసిన సంఘటనలు కోకొళ్ళాలు ఉన్నాయి. ఇక్కడ మాత్రం కన్న కూతురే తల్లిదండ్రులను పొట్టనబెట్టుకుంది. ప్రేమ పెళ్లికి అడ్డు చెబుతున్నారని తల్లిదండ్రులకు విషం ఇంజెక్టు చేసి హతమార్చింది. ఈ సంఘటన బంట్వారం పోలీస్ స్టేషన్ పరిధిలోని యాచారం గ్రామంలో చోటు చేసుకుంది. ఈ విషయమై >>2

### గ్యాంగ్‌స్టర్ నయీం కేసు:

# 10 మందిపై ఛార్జిషీట్ దాఖలు చేసిన ఇడి

### కుటుంబీకుల వద్ద 91 అక్రమాస్తుల గుర్తింపు

### విచారణకు రాకపోతే నాన్ బెయిలబుల్ వారంట్లు



**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్‌లో అనేక నేరాలు, ఘోరాలకు పాల్పడి పదేళ్ల క్రితం షాద్ నగర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైన గ్యాంగ్‌స్టర్ నయీముద్దీన్ అలియాస్ నయీం అక్రమాస్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్ట రేట్ (ఈడీ) నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. నయీం బతికివున్న సమయంలో అతని కుటుంబీకుల సహకారంతో పలువురు సహచరులు రైతులతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి విలువైన భూములను, ఆస్తులను లాక్కొని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోవడం తెలిసిందే. దీనిపై ఎదురు తిరిగిన వారిని నయీం గ్యాంగ్ దారుణంగా చంపేయడం విదితమే. ఈ క్రమంలో అనేక మంది మహిళలపై నయీం గ్యాంగ్ అకృ త్యాలకు పాల్పడగా ఈ విషయాలన్నీ నయీం ఎన్‌కౌంటర్ తరువాత వెలుగు చూశాయి. ఉమ్మడి నల్లగొండకు చెందిన కొందరు రాజకీయ నాయకు ల సహకారంతో నయీం తన నేర సామ్రాజ్యాన్ని కొనసాగించడం అప్పట్లో సంచలనం రేపింది. బడా బిల్డర్లను కూడా బెదిరించడం, మైనర్ బాలికల ను కిడ్నాప్ చేసి కోట్లాది రూపాయలను వసూలు చేయడం కూడా జరిగేవి. 2016 ఆగస్టులో షాద్‌నగర్‌లో నయీం ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాక అతని అనుచరులు కొందరు కూడా పోలీసు కాల్పుల్లో హతమవడం, మరికొందరు అంతర్గత గొడవల్లో మరణించడం జరిగింది. నయీం ఎన్‌కౌంటర్ తరువాత భారీగా ఆయుధాలతో పాటు ఆస్తులు వెలుగు చూడగా వీటిని పోలీసు శాఖ జప్తు చేసింది. అతని నేర కలాపాలతో పాటు భూదందాలపై విచారణకు సర్కారు సిట్ నియమించింది. నయీం మొత్తం 27 హత్యలతో పాటు 250 కేసుల్లో నేరం చేసినట్లు పోలీసు శాఖ సిట్ తేల్చింది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సిట్ విచారణకు సంబంధించిన ఛార్జిషీట్లు కోర్టులో దాఖలు చేయగా ఇదే సమయంలో మనీలాండరింగ్ కోణం లో ఈడీ అధికారులు రంగంలో దిగారు. ఈడీ విచారణకు సంబంధించి తాజాగా నాంపల్లి ఈడీ కోర్టులో ఈ విభాగం అధికారులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఇందులో నయీం కుటుంబీకులు పది మంది పేర్లు వున్నాయి, వీరిలో నయీం భార్య హసీనా బేగంతో పాటు బావమరిది, ఇతర >>2



కెటిఆర్ సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరిన ఆరూరి రమేష్

# కాంగ్రెస్‌కు బుద్ధిచెబుదాం

### అప్పుల సంఖ్య పెంచి తప్పుడు లెక్కలు చూపుతోంది: కెటిఆర్

### బిఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి28:** ప్రజల గురించి పట్టించుకునే తీరిక, ఉద్దేశ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని.. అందుకే ఇచ్చిన అన్నీ హామీలను తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ కు ప్రజలు బుద్ది చెప్పి మున్సిపల్ ఏన్నికల్లో ప్రజకు బీఆర్ఎస్ వెంట నిలబడతారని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలని పార్టీశ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. రెండు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో విఫలం అయిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన విజయం సాధించాలన్నారు. ఈ ఎన్నికల్లో అందరు కలిసి సమిష్టిగా ఎన్నికల్లో పోరాడాలని కేటీఆర్ కోరారు. కేవలం మున్సిపల్ ఎన్నికలు మాత్రమే కాకుండా రానున్న ప్రతి ఎన్నికల్లోనూ గులాబీ జెండాకు, కారు గుర్తుకు మద్దతు ఇచ్చి కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2 సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్, 12 ఏండ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయకుండా టైంపాస్ చేస్తున్నాయని, అందుకే తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. తెలివిలేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, >>2




# పరుగులు పెడుతున్న వెండి, బంగారాలు

**ముంబయి, జనవరి 28:** బంగా రం, వెండిధరలు భారీగా పెరు గుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల వేళ పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం వైపు చూస్తున్నారు. ఇండో యూరోప్ >>2



# దారంతా వనం.. వనమంతా జనం

### గద్దెపై కొలువుదీరిన సారలమ్మ

**ములుగు జిల్లా బ్యూరో, ప్రభాత వార్త:** డోలు చప్పులతో, కొమ్ము వాయిద్యాలతో, ఆదివాసి సంస్కృతి సాంప్రదాయ నృత్యాలతో నయా మేడారం సమ్మక్క సారలమ్మ నామస్మరణతో మారుమోగుతోంది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు జంపనవాగులో జలకాలతో, వన దేవతల గద్దెల్లో పూనకాలతో మేడారం వనమంతా జనంతో కిక్కిరిసి పోయింది. కన్నెపల్లి నుంచి వచ్చిన సారలమ్మ రాకతో మేడారం జన సంద్రమైంది. పగిడిద్దరాజు,గోవిందరాజులను సారలమ్మతోనే వారి గద్దెలపై పూజారులు ప్రతిష్టించారు. దక్షిణాది కుంభమేళ మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ప్రపంచం తలతిప్పి చూసేలా రాష్ట్ర >>2





### కన్నెపల్లి వెన్నెలమ్మ రాకతో మురిసిన మేడారం

### పగిడిద్దరాజు, గోవిందరాజులు సైతం సారలమ్మతో గద్దెపైకి కొలువు దీరిన వేళ..

### ఘనంగా మేడారం జాతర ప్రారంభం

### నేటి సాయంత్రం సమ్మక్క తల్లి గద్దెపైకి ఆగమనం

# అబ్కారీలో భారీ స్కాం

## ఓ ముఖ్యనేత, మంత్రి అవినీతి పాత్ర

### హరీష్‌రావు మరోసారి సంచలన వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి28:** తెలంగాణలో మరో కొత్త స్కామ్ జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ సీనియర్ నేత,మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. మైక్రో బ్రెవరేజ్ దక్కించుకునేందుకు 110 అప్లికేషన్‌లు రాగా, అందులో 25 అప్లికేషన్‌ల టెండర్‌లు ముఖ్యనేతకు, మంత్రికి ఇచ్చేందుకు సిద్ధమయ్యారని, అందులో ముఖ్యనేత కోటా కింద 21 టెండర్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.మిగిలిన 4 మంత్రి కోటా కింద కేటాయించారని పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఒక్కొక్క బ్రెవరేజ్ దగ్గర అన్ అఫిషియల్‌గా రూ.1 కోటి 80 లక్షలు తీసుకునేలా ఒప్పందం.అందులో ఒక కోటి 50 లక్షలు ముఖ్య నేతకు వెళ్తాయి, మరో 30 లక్షలు తోడుగా ఉన్న వ్యక్తికి వెళ్తాయి వైన్స్ షాపుల లక్కీ డ్రా తియ్యకుండా, కొందరికి టెండర్‌లు వచ్చాయని పేరొనకన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేని విధంగా లిక్కర్ సరఫరా చేసే సంస్థలకు 4 వేల 500 కోట్లు బకాయిలు పెండింగ్ లో పెట్టారు.16 నెలల నుంచి సరఫరా చేసే కంపెనీలకు డబ్బులు చెల్లించడం లేదు.చరిత్రలో ఇది ఎప్పుడు జరగలేదు.దీని వల్ల బ్రీజర్ సరఫరా రాష్ట్రంలో ఆగిపోయింది.చాలా షాపుల్లో బ్రీజర్ సరఫరా ఆగిపోయింది.మిగిలిన కొన్ని కంపెనీలకు డబ్బులు చెల్లించడం లేదు.మల్టీ నేషనల్ కంపెనీలు సరఫరా నిలిపివేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సార్లు లేఖలు రాశారని పేర్కొన్నారు.

దీని వల్ల రాష్ట్ర ఆదాయం దెబ్బతినే అవకాశం ఉంటుంది ఆలో గ్రామ్ టెండర్ వ్యవహారంలో అల్లుడుకి కావాలని ముఖ్యనేత,మంత్రి కుమారుడుకి కావాలని మంత్రి పంచాయతీలో ఐఏఎస్ అధికారిస్వచ్ఛంద విరమణకు దారితీసింది. సంగారెడ్డి జిల్లాలో ఉండే బీరు కంపెనీలకు మాత్రం ఎటువంటి హాని లేకుండా బీరు కంపెనీలకు నీళ్ల సరఫరా చేస్తున్నారు.ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యదర్శి ప్రభుత్వ ఆదేశాలతో బీరు కంపెనీలకు నీళ్ల ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాడు.ఈ ప్రభుత్వం మద్యం తయారీ దారులకు కొమ్ము కాసే ప్రభుత్వంలా ఉందన్నారు.

# ఫిబ్రవరి 3 నుంచి సిఎం రేవంత్ ఎన్నికల ప్రచారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి28:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో రాష్ట్రంలో రాజకీయ సందడి నెలకొంది. బుధవారం నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ క్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్రంలో పర్యటించనున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఫిబ్రవరి 3న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, 4న కరీంనగర్ జిల్లా జగిత్యాల, 5న రంగారెడ్డి జిల్ల చేవెళ్ల, 6న భూపాలపల్లి,7న మెదక్, 8న నిజామాబాద్‌లో సిఎం రేవంత్ పర్యటిస్తారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా తొలిరోజు 890 మంది అభ్యర్థుల నుంచి 902 నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో 382 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, 258 మంది బిఆర్ఎస్‌అభ్యర్థులు, 169 మంది బిజెపి అభ్యర్థులు ఉన్నారు.

# వెండి, బంగారాలు

>> ట్రేడ్‌డీల్ ఖరారుకావడం, యూరోపియన్ దేశాలకు 11 బిలియన్ డాలర్లకుపైగా వజ్రాభరణాలు ఎగుమతులు పెరగవచ్చని పారిశ్రామిక రంగం అంచనాలువేయడం వంటివి బులియన్ మార్కెట్‌కు కలిసొచ్చాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,70,447కు చేరుకుంది. నిన్న రూ.1,62,380గా ఉన్న బంగారం ధర బుధవారం ఒక్కరోజే రూ.8,000కు పైగా పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,000 పలికింది. వెండి ధర రూ.4,00,000 దిశగా పరుగెడుతోంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.3.75 లక్షలుగా ఉంది. ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ.26,821 పెరిగి రూ.3.83 లక్షలకు పలికి రికార్డు స్థాయికి చేరుకుంది. 10 గ్రాముల బంగారం రూ.1.62 లక్షలకు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ బంగారం ధర ఔన్సు 5,296.79 డాలర్లకు, వెండి ఔన్సు 114 డాలర్లకు చేరుకుంది. మరోవైపు, డాలర్ విలువ నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. చెన్నై నగరంలో 24 క్యారెట్లు గ్రాముకు 16,734 పలుకుతుంటే 22 క్యారెట్లుధర రూ.15,330గా ఉంది. ముంబయి, కోల్‌కత్తాల్లో 24 క్యారెట్లు 16,517, 22 క్యారెట్లు 15,140 రూపాయలుగా ఉంది. ఢిల్లీలో 24క్యారెట్లు రూ.16,530, 22 క్యారెట్లు 15,155గా ఉంది.

# వికసిత భారతం

>> మావోయిస్టులు లొంగిపోయారు. దేశం నుండి ఉగ్రవాదం పూర్తిగా నిర్మూలించే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. "భారతదేశం సౌర విద్యుత్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. రెండు మిలియన్ల సౌర వ్యవస్థలను ఏర్పాటు చేశారు, లక్షలాది కుటుంబాల ఇళ్లలో విద్యుత్ ఉత్పత్తిని పెంచారు. గత 11 సంవత్సరాలలో ఈశాన్యంలో 7,200కు పైగా రహదారులు నిర్మించారు. రైల్వే అభివృద్ధిలో రూ.80,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టారు. ఈ దశాబ్దం ఈశాన్య భద్రతకు కీలకమైనది. గిరిజన ప్రాంతాల్లోని 20,000 కు పైగా గ్రామాలు అభివృద్ధికి అనుసంధానించాము. ప్రభుత్వం సంపన్న రైతును అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా భావిస్తున్నది" అని రాష్ట్రపతి పేర్కొన్నారు. "ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ప్రారంభించి, ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్లు అందించాం. దేశంలో నూనె గింజల పంటల ఉత్పత్తి కూడా పెరిగింది. పశుసంవర్ధకం, మత్స్య సంపద, తేనెటీగల పెంపకం కూడా సమగ్రంగా వృద్ధి చెందుతోంది. మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చేలా కొత్త విధానాన్ని రూపొందించారు. 2014తో పోలిస్తే, మత్స్య సంపద 105 శాతం పెరిగింది. దేశంలో ఆహార ప్రాసెసింగ్ సామర్థ్యం 20 శాతం పెరిగింది" అని రాష్ట్రపతి అన్నారు. "దేశంలోని పౌరులందరీ సమాన హక్కులు కల్పించడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక పథకాలను రూపొందించింది. 10 కోట్ల మంది మహిళలు స్వయం సహాయక సంఘాలతో అనుసంధానించడం జరిగింది. 3 కోట్ల మంది మహిళలను అనుసంధానించడమే లక్ష్యం, అందులో 6 మిలియన్లకు పైగా మహిళలు లఖ్‌పతి దీదీలుగా మారారు. డ్రోన్ దీదీ కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది" అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. భారతదేశ ప్రగతిలో "నారీ శక్తి (మహిళా సాధికారత)" మొదటి స్థానంలో ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. వివిధ రంగాలలో మహిళలు సాధించిన మైలురాళ్లను ఆమె ప్రస్తావించారు. భారత సైనిక చరిత్రలో ఒక ముందడుగుగా, నేషనల్ డిఫెన్స్ అకాడమీ నుండి మొదటి బ్యాచ్ మహిళా క్యాడెట్లు ఉత్తీర్ణులైన చారిత్రాత్మక క్షణాన్ని రాష్ట్రపతి గర్వంగా గుర్తు చేసుకున్నారు.

# కాంగ్రెస్‌కు బుద్ధిచెబుదాం

>> రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకావడం లేదని.. అందుకే గత ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేస్తూ పరిపాలనను వదిలిపెట్టారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి వాటి అమలును పూర్తిగా విస్మరించారని, హామీల అమలును ప్రశ్నిస్తే బెదిరింపులు, కేసులు, అబద్ధాలకు దిగుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పూర్తిగా అబద్ధాల మీద పరిపాలన చేయడం అలవాటు చేసుకున్నారని కేటీఆర్ విమర్శించారు.

# పవార్‌తో పాటు మృతి చెందిన పైలట్లు వీరే!

**ముంబయి,జనవరి 28:** ముంబై నుంచి బారామతికి బయలుదేరిన అజిత్ పవార్ విమానం ఉదయం 8:45 - 9:15 గంటల మధ్య ప్రమాదానికి గురైంది. బారామతి విమానాశ్రయ రన్‌వేపై దిగడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో విమానంలో తీవ్రమైన సాంకేతిక లోపం తలెత్తి విమానం రన్‌వేకు బదులుగా సమీపంలోని పొలాల్లోకి దూసుకెళ్లి భూమిని బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే విమానం ముక్కలుగా విరిగిపోవడంతో పాటు భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు ఆయన వ్యక్తిగత అధికారి విదిప్ జాదవ్, ఒక సెక్యూరిటీ ఆఫీసర్, విమానాన్ని నడిపిన ఇద్దరు పైలట్లు అక్కడికక్కడే మరణించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) వెల్లడించింది. ఈ విమానాన్ని అత్యంత అనుభవజ్ఞుడైన కెప్టెన్ సుమిత్ కపూర్ ప్రధాన పైలట్‌గా నడిపించగా, ఫస్ట్ ఆఫీసర్ శాంభవి పాఠక్ సహా పైలట్‌గా వ్యవహరించారు. ముంబై విశ్వవిద్యాలయంలో ఏవియేషన్ అభ్యసించిన శాంభవి, న్యూజిలాండ్‌లో అంతర్జాతీయ శిక్షణ పొంది 2022 నుండి ఈ సంస్థలో పనిచేస్తున్నారు. వీరితో పాటు పింకీ మాలి విమాన సహాయకురాలిగా విధులు నిర్వహించారు. ప్రమాదానికి గురైన ఈ లియర్‌జెట్ 45 విమానం విటిఎస్ఎస్‌కె ఢిల్లీకి చెందిన విఎస్ఆర్‌వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు చెందినది. 2011లో స్థాపించబడిన ఈ సంస్థ గతంలో కూడా 2023 సెప్టెంబర్ 14న ముంబైలో ఒక విమాన ప్రమాదాన్ని ఎదుర్కోవడం గమనార్హం. విమానం కూలిన సమాచారం అందిన వెంటనే స్థానిక అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అయితే మంటలు తీవ్రంగా ఉండటంతో విమానం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి డిజిసిఎ ఉన్నత స్థాయి విచారణకుఆదేశించింది. సాంకేతికలోపంవల్ల ప్రమాదం జరిగిందా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.

# దాఖలు చేసిన ఇడి

>> కుటుంబ సభ్యులున్నారు. వీరంతా కలిసి రైతులు, సామాన్యులు, రియల్టర్ల నుంచి కోట్లాది రూపాయల విలువచేసే 91 ఆస్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసు కున్నట్లు ఈడీ గుర్తించింది. వీటి వెనుక నయీం ప్రధాన అనుచరుడు శ్రీను వున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. మరోవైపు ఈడీ నమోదు చేసిన కేసులకు సంబంధించి నయీం కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు నోటీసులు పంపినా విచారణకు రాకపోవడంతో వారందరిపై నాన్ బెయిలబుల్ వారం ట్లు జారీ చేయాలని ఈడీ నిర్ణయించినట్లు తెలిసింది.

## వారం - వర్జ్యం

29-01-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
ఏకాదశి మ.1.55,
రోహిణి ఉ.7.30, మృగశిర తె.5.17
వర్జ్యం : రా.10.54-1.50
దు.ము.3.01-3.47
శుభసమయం : ఉ.5.00-5.45
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** శత్రువర్గం ఎంతగానో ఇబ్బంది పెడతారని మీరు భావిస్తారు. సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి.

**వృషభం:** దైవానుగ్రహం వలన మీ ఊహా వాస్తవికతకు దూరంగా అవుతుంది. వ్యాపారాలలో లాభాలు.

**మిథునం:** ముఖ్యమైన వస్త్రాలను జతచేయవలసిన వాటిని మర్చిపోయే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించండి.

**కర్కాటకం:** హితులు, శ్రేయోభిలాషులు, పెద్దలను కలుసుకొని చర్చలు సాగిస్తారు. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**సింహం:** ఉద్యోగయత్నాలు ముమ్మరం చేసి సానుకూల ఫలితాలు సాధిస్తారు. ఇతరుల విషయాలలో జోక్యం వద్దు.

**కన్య:** గృహ సంబంధమైన విషయలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్తలు వహించండి.

**తుల:** ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సహనాన్ని, ఓర్పును వహించడం చెప్పదగిన సూచన. కొన్ని అవ కాశాలు అప్రయత్నంగా కలిసివస్తాయి.

**వృశ్చికం:** సన్నిహిత వర్గం నుండి ఆర్థిక సహాయసహకారాలు నామమాత్రంగా అందుకుంటారు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** ఇంటి యందు శుభకార్యాల గురించి సన్నిహితులతో చర్చిస్తారు. ఆర్థికాభివృద్ధి కొరకు కృషిచేస్తారు.

**మకరం:** విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది. ధన లాభం.బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**కుంభం:** పురాతన వస్తు సేకరణ చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి.

**మీనం:** స్త్రీ మూలంగా ధనలాభం పొందుతారు. ఆస్తి వివాదాలు తీరతాయి. పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం బారామతిలో అజిత్ పవార్ భార్య సునేత్రపవార్‌ను పరామర్శిస్తున్న గవర్నర్ ఆచార్య దేవవ్రత్, సిఎం దేవేంద్ర ఫడ్నవిస్, డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే




సచివాలయం వద్ద జాతీయ పతాకాన్ని అవనతం చేసిన దృశ్యం

# అజిత్ పవార్ దుర్మరణం

>> బారామతికి విమానంలో బయలుదేరారు. బుధవారం ఉదయం ముంబయి నుంచి బారామతికి వీఎస్ఆర్ సంస్థకు చెందిన లీర్‌జెట్45 విమానంలో బయలుదేరారు. బారామతిలో ల్యాండ్ అవుతుండగా 8:45 గంటల సమయంలో ఆయన విమానం అకస్మాత్తుగా కుప్పకూలింది. దీంతో భారీగా మంటలు చెలరేగాయి. విమానం పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత వర్గాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన జరిగినట్లుగా తెలుస్తోంది. విమానంలో అజిత్‌పవార్‌తో పాటు మరో ఇద్దరు భద్రతా సిబ్బంది, ఇద్దరు క్రూ సభ్యులు ఉన్నారు. మరోవైపు బారామతి విమాన ప్రమాదాన్ని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ధ్రువీకరించింది. విమానం ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని పేర్కొంది. బుధవారం ఉదయం 8:45 గంటలకు బారామతిలోని రన్‌వే థ్రెషోల్డ్ వద్ద క్రాష్ ల్యాండింగ్ జరిగిందని తెలిపింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో సహా ఐదుగురు మృతి చెందినట్లు తెలిపింది. ఘటనాస్థలి నుంచి ఇప్పటికే మూడు మృతదేహాలను వెలికితీసినట్లు పుణె ఎస్పీ సందీప్ సింగ్ గిల్ తెలిపారు. వాటిని గుర్తిం చేందుకు ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. పైలట్ శాంభవి పాథక్‌తోపాటు ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలీ కూడా ఉంది. చివరిసారిగా నాన్నా అజిత్‌పవర్‌తోపాటుగా పూణెకు వెళుతున్నా అంటూ మెసేజ్‌కూడాచేసింది. తన తండ్రి శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడింది. మళ్లీ ఫోన్‌చేస్తానానాన్నా అని కూడా చెప్పిందన్నారు.మృతుల్లో అజిత్ పవార్ పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ విదీప్ జాదవ్, పైలట్ ఇన్ కమాండ్‌షుమిత్‌కపూర్, ఫస్ట్ ఆఫీసర్ శాంభవి పాథక్‌లు ప్రాణాలుక కోల్పోయారు. పూణె లాండింగ్‌సమయంలో వెలుతురు కనిపించడంలేదని, ఎటిసి కంట్రోల్ సిబ్బందికి పైలట్ చెప్పారని, రెండోసారి మళ్లీ కాల్‌చేస్తే వెలుతురు కనిపిస్తోందని రావడంతోనే గ్రౌండింగ్‌కు క్లియరెన్స్ ఇచ్చామని ఎటిసి వ్యవస్థ చెపుతోంది. వెలుతురు స్పష్టంగా వచ్చేంతవరకూ గాల్లోనే కొంతసేపు చక్కర్లు కొట్టిందన్నారు. అలాగే ల్యాండింగ్‌కోసం విమానంనుంచి రీడ్‌బ్యాక్‌రాలేదని, రన్‌వేకనిపిస్తుందా అన్న ప్రశ్నలకు రిప్లై రాలేదని ఎయిర్‌పోర్టు అధికారులు చెపుతున్నారు. రెండోసారి లాండింగ్‌కు ప్రయత్నించే సమయంలోనే రన్‌వే కనిపిస్తుందా అంటే సానుకూలంగా పైలట్లు స్పందించారని, ల్యాండింగ్‌కు క్లియరెన్స్ ఇచ్చిందని, రన్‌వే ప్రారంభంలోనే విమానంకూలిపోయిందని చెపుతున్నారు విమానప్రమాదంపై డైరెక్టరేట్ ఆఫ్ సివిలేవియేషన్, విమాన ప్రమాదాల దర్యాప్తుసంస్థ ఎఐఐబి అదికారులు పుణె విమానాశ్రయానికి చేరుకని ప్రమాద స్థలిని సందర్శించారు. కాగా ఈప్రమాదంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించామని సత్వర నివేదికతోనే కారణం వెలుగుచూస్తుందని, సాంకేతిక లోపంతోపాటు వెలుతురు సమస్యతోనే విమాన ప్రమాదంజరిగినట్లుగా ప్రాథమికంగా తేలిందని కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

**అంచలంచెలుగా రాజకీయ ప్రస్తానం**

అజిత్ పవార్ 1959 జులై 22న అహ్మదాబాద్ జిల్లా డియోలాలీ ప్రవరాలో జన్మించారు. ఆయన మాజీ సీఎం శరద్ పవార్ సోదరుడి కుమారుడు. డియోలాలీ ప్రవరాలోనే పాఠశాల విద్యాభ్యాసం జరిగింది. తండ్రి మరణంతో కాలేజీ విద్యను మధ్యలోనే వదిలేశారు. 1982లో అజిత్ పవార్ రాజకీయ ప్రస్థానం మొదలైంది. చక్కెర ఫ్యాక్టరీ సహకార బోర్డు ఎన్నికల్లో తొలిసారి గెలుపొందారు. ఆ తర్వాత పుణె జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా విజయం సాధించారు. ఆ పదవిలో ఆయన సుదీర్ఘకాలంపాటు కొనసాగారు. మొదటిసారి బారామతి ఎంపీగా గెలుపొందిన అజిత్ పవార్ 1991లో తన చిన్నాన్న శరద్ పవార్ కోసం ఎంపీ పదవికి రాజీనామా చేశారు. అప్పుడు జరిగిన ఉపఎన్నికలో శరద్ పవార్ బారామతి ఎంపీగా గెలుపొంది పీవీ నర్సింహారావు కేబినెట్‌లో రక్షణ మంత్రిగా సేవలందించారు. అజిత్ పవార్ బారామతి నుంచి ఒకసారి ఎంపీగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆరుసార్లు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సేవలందించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఎక్కువకాలం సేవలందించిన వ్యక్తిగా ఆయన ఘనత సాధించారు. 2022-23 మధ్యకాలంలో మహారాష్ట్ర ప్రతిపక్ష నేతగా అజిత్ పవార్ కొనసాగారు. అజిత్ పవార్ 2019 నవంబర్ 23న తిరుగుబాటు చేశారు. శరద్ పవార్ సారథ్యంలోని నేష్నలిస్ట్ కాంగ్రెస్ పార్టీని చీల్చి కొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీ ,శివసేన సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వంలో చేరారు. దేవేంద్ర ఫడణవీస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. అజిత్ పవార్, ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ సోదరుడి కుమారుడు. 2023లో ఎన్సీపీ రెండుగా చీలింది. అందులో ఒక వర్గానికి అజిత్ పవార్ ఆధ్వర్యంలో, మరో వర్గం శరద్ పవార్ నాయకత్వంలో కొనసాగుతోంది. ఆ తర్వాత అజిత్ పవార్ ఎన్డీఏ ప్రభుత్వంలో చేరి మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పింప్రిచించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ రెండు వర్గాలు కలిసి పోటీ చేసి అందరినీ ఆశ్చర్యపర్చాయి. అజిత్ పవార్ శరద్ పవార్ మళ్లీ కలిసిపోవడంపై ఎన్సీపీ వర్గాలు ఆనందం వ్యక్తం చేశారు. ఆనందం ఎంతో కాలం నిలవకుండానే అజిత్ చనిపోవడంతో పార్టీ వర్గాలను కలిచివేస్తోంది.

**విద్యాప్రతిష్టాన్‌లో నేడు అజిత్‌పవార్ అంత్యక్రియలు**

అజిత్‌పవార్ అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నారు. పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు చేపట్టనున్నారు. ముంబైలోని విద్యా ప్రతిష్టాన్‌లో 29వ తేదీన ఉ.11గంటలకు అంత్యక్రియలు జరగనున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆ అంత్యక్రియల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు కూడా కడసారి వీడ్కోలు పలికేందుకు వస్తున్నారని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. మహారాష్ట్ర సర్కారు బుధవారం పబ్లిక్ హాలీడే ప్రకటించింది. మూడు రోజుల పాటు సంతాప దినాలు పాటిస్తున్నట్లు సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ప్రకటించారు. అంత్య క్రియలకు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్,పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు ఇతర కేంద్ర మంత్రులు, అజిత్ సన్నిహిత నేతలు, ఎంపిలు, ఎమ్మెల్యేలు రాష్ట్రమంత్రులు మొత్తం హాజరవుతున్నారు. సోదరి సుప్రియా సూలే అయితే అజిత్ మరణవార్తతో కన్నీరు మున్నీరయ్యారు.



బుధవారం మేడారంలో సారలమ్మను గద్దెలపైకి తరలిస్తున్న పూజారులు

# దారంతా వనం.. వనమంతా జనం

>> ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న నాలుగు రోజుల పండుగలో తొలిరోజైనా బుధవారం కన్నెపల్లి నుంచి వచ్చిన సారలమ్మ మేడారంలోని గద్దెపై కొలువుదీరింది.పగిడిద్దరాజు, గోవిందరాజులు సారలమ్మతోనే గద్దెల మూలవాసుల సంస్కృతి సంప్రదాయాలకి ప్రతీకగా మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని 101 కోట్లతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం వడ్డెలు(పూజారులు) ప్రత్యేక పూజలు చేశారు.కన్నెపల్లిలోని గుడి నుంచి వెదురుబుట్టలో అమ్మవారి ప్రతిరూపమైన పసుపు,కుంకుమలు తీసుకుని మేడారానికి బయలుదేరారు. జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు చేరుకున్నారు. అప్పటికే అకడికి చేరుకున్న పగిడిద్దరాజు, గోవిందరాజులుతో కలిసి వడ్డెలు ముగ్గురి రూపాలను రాత్రి మేడారం గద్దెలపై చేర్చారు. కన్నెపల్లి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని మేడారం గద్దెల వద్దకు సారలమ్మ వస్తున్న వేడుకను చూసేందుకు లక్షలాది మంది భక్తులు రహదారులకు ఇరువైపుల బారులు తీరారు.సారలమ్మను తీసుకువస్తున్న పూజారులు వీరిపై నుంచి దాటుకుంటూ వెళ్లారు. సారలమ్మ రాకను సూచిస్తూ ఆదివాసీ పూజారులు కొమ్ముబూరలు ఊదారు. ప్రత్యేక డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయం మార్మోగింది. కన్నెపల్లి నుంచి బయలుదేరిన సారలమ్మ నేరుగా గద్దెలపైకి వెళ్లకుండా మేడారంలోని సమ్మక్క పూజా మందిరానికి చేరుకున్నది. అప్పటికే గోవిందరాజు, పగిడిద్దరాజు అక్కడికి చేరుకొన్నారు. పూజారులందరూ సంయుక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి కట్టువేసిన అనంతరం అందరూ కలిసి సారలమ్మ గద్దెపైకి చేరుకొని తల్లిని గద్దెపై ప్రతిష్ఠించారు.కాక సారయ్య ఆధ్వర్యంలోని పూజారుల బృందం సారలమ్మను కన్నెపల్లి నుంచి గద్దెలపైకి తీసుకువచ్చారు.హనుమాన్ జెండా నీడలో కన్నెపల్లి వెన్నెలమ్మగా పేరున్న సారలమ్మ గద్దెలపైకి చేరింది. సారలమ్మ, ఆమె భర్త గోవిందరాజులు, తండ్రి పగిడిద్దరాజు ప్రతిమలను గద్దెలపైకి తీసుకురావడంతో మేడారం, కన్నెపల్లి, రెడ్డిగూడెం, జంపన్నవాగు, నార్లాపూర్ పరిసర ప్రాంతాలు లక్షలాదిమంది భక్తులతో కిటకిటలాడాయి. ప్రభుత్వం తరఫున జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం అంతకుముందు కన్నెపల్లికి చేరుకుని అకడ వడ్డెలు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ పర్యవేక్షణలో రోప్‌పార్టీ సిబ్బంది,సీఆర్‌పీఎఫ్ బృందం తాడు వలయంగా ఏర్పడి వీరికి భద్రత కల్పించారు.సారలమ్మ గద్దెపైకి రాగానే భక్తులు పరవశంతో ఊగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో మేడారం జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ తెలిపారు.మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.మొత్తం 13 వేల మందికి పైగా పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించామని, భక్తుల రద్దీని అంచనావేసి తగినచర్యలు తీసుకునేలా మేడారంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో అధునాతన సాంకేతికత ఏఐ టెక్నాలజీ, డిజిక్వెస్ట్ డ్రోన్ వంటివి ఏర్పాటు చేశామని ఎస్పీ పేర్కొన్నారు.

సమ్మక్క తల్లి మేడారం గద్దెలపైకి చేరడం జాతరలో అత్యంత ప్రధాన ఘట్టం.చిలుకలగుట్ట నుంచి మేడారానికి సమ్మక్క ప్రతిమను తీసుకొచ్చే ప్రక్రియ నేడు జరుగుతుంది. సాయంత్రం గిరిజన సంప్రదాయం ప్రకారం ప్రధాన పూజారి చిలుకలగుట్టపై నుంచి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మకను వెదురు కంకబొంగులో భద్రపర్చుకుని తీసుకొస్తారు. ప్రభుత్వ లాంఛనాల ప్రకారం తుపాకులతో కాల్పులు జరిపిన తర్వాత సమ్మక ప్రతిమతో వడ్డెలు బయల్దేరుతారు. ఆ సమయంలో భక్తులు.. సమ్మకకు ఎదురేగి కోళ్లను, మేకలను బలి ఇస్తారు. రాత్రి సమ్మకను గద్దెపై ప్రతిష్ఠించాక భక్తులు మొకులు చెల్లించుకుంటారు. వనదేవతలందరూ కొలువై ఉండడంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు పెద్దసంఖ్యలో భక్తులు చెల్లించుకుంటారు చెల్లించుకుంటారు.

# తల్లిదండ్రులను కడతేర్చిన కూతురు

>> వికారాబాద్ డీఎస్పీ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బంట్వారం మండలం యాచారం గ్రామానికి చెందిన నక్కలి దశరథం(58), నక్కలి లక్ష్మీ(54) లకు ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కొడుకు, ఇద్దరు కూతుళ్ళకు వివాహం కాగా, చిన్న కూతురు సురేఖను అల్లారు ముద్దుగా పెంచుకుని, బీఎస్సీ నర్సింగ్ వరకు చదివించారు. సురేఖ గత రెండు సంవత్సరాల క్రితం సంగారెడ్డి లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా ఉద్యోగం చేస్తుంది. కొడుకు అశోక్ బంట్వారం మండల కేంద్రంలో బట్టల దుకాణం పెట్టుకుని అక్కడే నివాసం ఉంటున్నాడు. అప్పుడప్పుడు గ్రామంలో ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు సురేఖ వచ్చి వెళ్తుండేది. సురేఖ కు గత కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టా గ్రామ్‌లో ఓ యువకుడితో పరిచడం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఈ విషయం గ్రామంలోని తన తల్లిదండ్రులైన దశరథం, లక్ష్మీలకు సురేఖ తెలియజేసింది. ప్రేమించిన అబ్బాయి వేరే కులానికి చెందినవాడు కావడంతో కూలాంతర వివాహాన్ని తల్లిదండ్రులు ఒప్పుకోలేరు. దీంతో తల్లిదండ్రులు తన ప్రేవ వివాహానికి అడ్డు పడుతున్నారని మనసులో కక్ష పెంచుకుని వారిని కడతేర్చాలని భావించింది. ఇందులో భాగంగానే సురేఖ విధులు నిర్వహిస్తున్న ఆసుపత్రిలో ఈ నెల 24న సెలవు తీసుకుని, ఆసుపత్రి నుంచి అట్రాసిల్ అనే మత్తు ఇంజక్షన్లను తస్కరించి స్వగ్రామానికి వచ్చింది. చివరిసారిగా తన ప్రేమ పెళ్లి గురించి తల్లిదండ్రులతో చర్చింది. అప్పటికీ వారు ససేమిరా అనడంతో వారిని కడతేర్చాలని సురేఖ పన్నాగం పన్నింది. అదే రోజు రాత్రి సుమారు 10 గంటల సమయంలో తల్లి లక్ష్మీ కి ఒళ్ళు నొప్పుల నివారణ కోసం ఆసుపత్రి నుంచి మంచి మందు తీసుకువచ్చానని, ఇంజక్షన్ చేస్తానని చెప్పి, వెంట తీసుకువచ్చిన అట్రాసిల్ మత్తు ఇంజక్షన్‌ను మోతాదుకు మించి ఇంజక్షన్ చేసింది. దీంతో తల్లి లక్ష్మీ నిమిషాల వ్యవధిలోనే కుప్పకూలిపోయింది. బయట నుంచి వచ్చిన తండ్రి దశరథం కి అమ్మ నిద్రపోయిందని చెప్పి, తండ్రికి సైతం ఒళ్ళు నొప్పుల కోసం అట్రాసిల్ ఇంజెక్ట్ చేసింది. దీంతో తండ్రి దశరతం, తల్లి లక్ష్మీలు కుప్పకూలీ పోయారు. తల్లిదండ్రులకు గుండెపోటు వచ్చిందని, పల్స్ రేట్ పడిపోయిందని నాటకం ఆడుతూ, అన్న అశోక్ కు సురేఖ ఫోన్ చేసి చెప్పింది. దీంతో హుటాహుటిన వచ్చిన అశోక్ అపస్మారక స్థితిలో ఉన్న తల్లిదండ్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే వారు మృతి చెందారని వైద్యులు తెలిపారు. తల్లిదండ్రుల మరణంపై అనుమానం వచ్చిన మృతుల కొడుకు అశోక్ బంట్వారం పోలీసులకు ఈ నెల 25న ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో, మృతుల చిన్న కూతురు సురేఖ పై అనుమానం రావడంతో, సురేఖను అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసు విచారణలో నింధితురాలు సురేఖ అసలు విషయం బయటపెట్టింది. ప్రేమ పెళ్లి కి అడ్డు చెప్పారని, తల్లి లక్ష్మీ, తండ్రి దశరథం లకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి హత్య చేసినట్లు నింధితురాలు సురేఖ ఒప్పుకొన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసు ఛేదించిన ధారూరు సీఐ సీహెచ్.రఘురామ్, బంట్వారం ఎస్ఐ విమలను డీఎస్పీ అభినంధించారు. నింధితురాలు సురేఖను రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

# ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శిగా కనినిక ఘోష్

>> ఎన్నుకున్నారు. 26 రాష్ట్రాల నుంచి 850 మంది ప్రతినిధులు 14వ జాతీయ మహాసభలకు హాజరయ్యారు. వారు 109 మందిని సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ(సీఈసీ) సభ్యులుగా ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఈసీకి ఎన్నికైన 109 మందితో మహాసభలు జరుగుతున్న ఆర్‌టిసి కళ్యాణ మండపంలో మొదటి సీఈసీ సమావేశం జరిగింది. సమావేశంలో 36 మంది కేంద్ర కార్యదర్శివర్గాన్ని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షురాలుగా పికె శ్రీమతి తిరిగి ఎన్నికయ్యారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా కనినిక ఘోష్ బోస్, కోశాధికారిగా తాపసి ప్రహరాజ్ ఎన్నికయ్యారు. వారితోపాటు మరో 18 మందిని ఉపాధ్యక్షులుగా, 10 మందిని సెక్రటరీలుగా ఐదు మందిని అసిస్టెంట్ సెక్రటరీలుగా ఎన్నుకున్నారు. తెలంగాణ నుంచి సీఈసీలో ఐదుగురికి చోటు లభించింది. అందులో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న మల్లు లక్ష్మీని జాతీయ కార్యదర్శిగా ఎన్నుకోగా.. రాష్ట్ర అధ్యక్షురాలు ఆరుణజ్యోతితోపాటు పాలడుగు ప్రభావతి, కెఎన్ ఆశాలత, బండి పద్మ సీఈసీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సీఈసీలోకి ఐదుగురిని తీసుకోగా వారిలో వి సావిత్రిని జాతీయ అసిస్టెంట్ సెక్రటరీగా ఎన్నుకోగా.. కె శ్రీదేవి, వై సత్యవతి, షేక్ మస్తాన్‌బీ, శ్యామల సీఈసీ సభ్యులుగా ఎన్నికయ్యారు. గత 10 సంవత్సరాలుగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన మరియం ధావలే జాతీయ ఉపాధ్యక్షురాలుగా కొనసాగనున్నారు. మాజీ ఎంపి బృందా కరత్ ప్యాట్రన్‌గా కొనసాగనున్నారు.

# మేడారం జాతరకు హాజరుకానున్న కేంద్రమంత్రి జోయల్ ఓరం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 28:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి గాంచిన సమ్మక్క సారలక్క జాతరకు నేడు (గురువారం) కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జోయల్ ఓరం పాల్గొని పూజలు నిర్వహించనున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనంలో (జనవరి 16,17 తేదీల్లో ) జరిగిన గిరిజన గ్రామీణ వైద్య సహకారుల సదస్సులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కేంద్ర మంత్రిని కలిసి సమ్మక్క సారలక్క జాతర ఆహ్వాన పత్రికను రాష్ట్ర ప్రభుత్వం తరపున అందించారు. అలాగే, ఈ జాతర ప్రత్యేకతను వివరించడంతో పాటు జాతర ప్రాశస్త్యతను చెప్పడంతో కేంద్ర మంత్రి తప్పకుండ జాతరలో పాల్గొంటానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రి ఈ జాతరకు హాజరవుతున్నారు. హెలికాప్టర్ ద్వారా ఉదయం మేడారంకు కేంద్ర మంత్రి చేరుకుంటారు. అక్కడ మంత్రి అడ్లూరి, కేంద్ర మంత్రిని ఆహ్వానం పలికి కేంద్రమంత్రిని వెంటబెట్టుకొని సమ్మక్క సారలక్క దేవస్థానాన్ని చేరుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

**ఇ-టెండర్ నం. E29CTrDSC_12-2025-26, తేది : 27.01.2026 ఆహ్వానిస్తూ ప్రకటన**

PUB/1519/26

భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, నిర్మాణం, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు టెండరింగ్ యొక్క టు ప్యాకెట్ పద్ధతిలో క్రింది పనులకు ఇ-టెండర్ కోరుతున్నారు.

క్ర.సం.: 1, NIT No.: E29CTrDSC_12-2025-26 తేది: 22.01.2026. పని పేరు: టెండర్ నెం. E29CTrDSC_12-2025-26 తేది: 22.01.2026 'సౌత్ సెంట్రల్ రైల్వేలోని నాందేడ్ డివిజన్‌లో 1. పర్భణి-పార్లి వైజనాథ్ సెక్షన్ మధ్య డబ్లింగ్ పనుల సందర్భంగా గంగాఖేర్ యార్డ్‌లో ప్రతిపాదిత యార్డ్ ఏర్పాట్లు మరియు 2) ముద్ఖేడ్ జంక్షన్ వద్ద ముద్ఖేడ్-ఆదిలాబాద్ మరియు ముద్ఖేడ్ – సికింద్రాబాద్ లైన్లను కలిపే ముద్ఖేడ్ బైపాస్ లైన్, ఇందులో ముద్ఖేడ్ యార్డ్ నుండి సికింద్రాబాద్ వైపు బై-పాస్ టేక్-ఆఫ్ వరకు డబ్లింగ్ లైన్ కూడా ఉంది" దృష్ట్యా, ఇప్పటికే ఉన్న OHEకి మార్పులతో సహా 2x25kV, 50Hz సింగిల్ ఫేజ్ ఎ.సి. ట్రాక్షన్ టవర్ హెడ్ పరికరాల 65చ.మి.మీ. కేటెనరీ మరియు 107/150 చ.మి.మీ హెచ్‌డి కాపర్ కాంటాక్ట్ వైర్‌తో డిజైన్, సరఫరా, ఏర్పాటు, పరీక్ష మరియు ప్రారంభోత్సవం, LT సరఫరా ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్లు. వివరాల అంచనా వ్యయం: రూ.15,12,09,525.76/-. బయానా/బిడ్ సెక్యూరిటీ: రూ.9,06,100.00/-. డాక్యుమెంట్ ధర: ఆన్‌లైన్ టెండర్ డాక్యుమెంట్లను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేయు కాలపరిమితి : 09 నెలలు. ముగింపు తేది: 19.02.2026 మ.3.00 గంటలకు.

1. బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కోసం, దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వండి.
2. బిడ్డర్ IREPS.gov.in ద్వారా బిడ్ సెక్యూరిటీని అందించాలి లేదా బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని షెడ్యూల్ వాణిజ్య బ్యాంకు నుండి బ్యాంక్ గ్యారెంటీ బాండ్‌గా సమర్పించాలి. బ్యాంక్ గ్యారెంటీ బాండ్ అనుబంధం-VII ప్రకారం ఉంటుంది మరియు బిడ్ చెల్లుబాటు వ్యవధి తర్వాత 90 రోజుల వరకు చెల్లుబాటు అవుతుంది. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్కు, డిపాజిట్ రసీదులు, FDR మొదలైన వాటి ద్వారా మాన్యువల్ చెల్లింపు అనుమతించబడదు.
3. టెండర్ సమర్పణ వ్యవధిలో అంటే టెండర్ ముగింపుకు పదిహేను రోజుల వ్యవధిలో టెండరర్ తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.
4. టెండర్ సమర్పణ వ్యవధి ప్రారంభమయ్యే తేదీ వరకు ఏదైనా కొరిజెండా (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కోసం టెండరర్ గమనించాలి.

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్మాణం/ సికింద్రాబాద్.

**ఓపెన్ ఇ-టెండర్ ప్రకటన నం.లు:C/E.29/ Elec/M/SC/35 & 36/OEW/OT/2025-26 తేది: 24.01.2026**

PUB/1520/26

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశానుసారం, దిగువ సంతకం చేసిన వారు 16.02.2026వ తేదీన మ.3.00 గంటల వరకు దిగువ ఇవ్వబడిన పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.:1. ఇ-టెండర్ నెం.: ఇ-టెండర్ నెం: C/E.29/ Elec/M/SC/35/OEW/OT/2025-26 ఇ-టెండర్ నెం. E-M-SC-35-OT-2025-26, పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్, విద్యుత్ సరఫరా ఏర్పాట్ల విశ్వసనీయతను మెరుగుపరచడానికి MLY-KZJ సెక్షన్, SNF-VKB సెక్షన్ మరియు BIDR-PARLI సెక్షన్లలోని సర్వీస్ భవనాలు/కాలనీలు మొదలైన వాటిని కవర్ చేసే ఓవర్‌హెడ్ లైన్లను అండర్‌గ్రౌండ్ కేబుల్స్‌గా మార్చడం. టెండర్ విలువ (రూ.): 7,07,17,503.20. బయానా (రూ.): 5,03,600.00. CTF (రూ.): 0.00. పూర్తి చేయు కాలం : 6 నెలలు.

క్ర.సం.:2. ఇ-టెండర్ నెం.: ఇ-టెండర్ నెం: C/E.29/ Elec/M/SC/36/OEW/OT/2025-26 ఇ-టెండర్ నెం. E-M-SC-36-OT-2025-26, పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్: షెడ్యూల్ A-SNF & HYB డిపోల అధికార పరిధిలోని సిబ్బంది క్వార్టర్లు & సర్వీస్ భవనాలలో పాతబడిన RCCBs/MCBs/MCCBs/LT ప్యానెళ్ల మెరుగుదలలు. షెడ్యూల్ B-SC డివిజన్ వ్యాప్తంగా సాంప్రదాయ సీలింగ్/వాల్ మౌంటెడ్/పెడెస్టల్ ఫ్యాన్ల స్థానంలో శక్తి సామర్థ్యం గల ఫ్యాన్ల (BLDC) ఏర్పాటు-విద్యుత్ ఏర్పాట్లు. టెండర్ విలువ (రూ.): 3,58,51,761.80. బయానా (రూ.): 3,29,300.00. CTF (రూ.): 0.00. పూర్తి చేయు కాలం : 6 నెలలు.

1. టెండర్ షరతులు/ఇతర వివరాలు "www.ireps.gov.in" లోని టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి. వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెండర్‌లో పాల్గొనవచ్చు మరియు IREPS వెబ్‌సైట్‌లోని ఏవైనా మార్పులు ఉంటే వాటిని చూడవచ్చు.
2. ఈ టెండర్ నోటీసును సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లోని సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) వారి కార్యాలయంలోని నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడింది. దీనిని అన్ని పని దినాలలో చూడవచ్చు.
3. ఎటువంటి కారణం చూపకుండానే టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వేకు రిజర్వ్ చేయబడింది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (మెయింటెనెన్స్)/సికింద్రాబాద్.

**ఓపెన్ టెండర్ నోటీసు నెం: B-E29-TRD-TNDR-37-2025-26 తేది: 22.01.2026**

PUB/1521/26

టెండర్ నం: B-E29-TRD-TNDR-37-2025-26. పనిపేరు: విజయవాడ డివిజన్-తుని, AKP మరియు YLM స్టేషన్లలో ప్లాట్‌ఫారమ్ యొక్క మిగిలిన పొడవు వద్ద COP షెల్టర్ల ఏర్పాటుతో పాటు, తుని & AKP స్టేషన్లలో ప్లాట్‌ఫారమ్ మరియు ఇతర ప్రయాణీకుల సంబంధిత సౌకర్యాల మెరుగుదలకు సంబంధించి OHEలో అదనపు పనులు చేర్పులు మరియు మార్పులు. సుమారు విలువ రూ: 3,36,76,389.28. పని పూర్తి చేయు కాలం: 12 నెలలు. బిడ్ సెక్యూరిటీ (బయానా) : రూ. 3,18,400/-. ముగింపు తేది: 13.02.2026. టెండర్ ఫారం ధర: నిల్.

పూర్తి వివరాలు మరియు షరతుల కోసం మా వెబ్‌సైట్ www.ireps.gov.in ను వీక్షించండి.

గమనిక: టెండర్లు తెరిచే తేదీన సెలవుదినం అయితే, టెండర్లు తదుపరి పని దినాన తెరవబడతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/TrD/ విజయవాడ.

**ఓపెన్ టెండర్ నోటీసు నెం:B-E29-TRD-TNDR-38-2025-26 తేది: 22.01.2026**

PUB/1522/26

టెండర్ నం: B-E29-TRD-TNDR-38-2025-26 పనిపేరు: విజయవాడ డివిజన్-GDV-MTM సెక్షన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో NH(O) క్రింద EPC పద్ధతిలో గుడివాడ మరియు మచిలీపట్నం రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే కి.మీ. 2/8-10 వద్ద NH 165లోని కి.మీ. 231+700 వద్ద ఉన్న LC నెం. 3E/SPL 3 స్థానంలో ప్రతిపాదిత రెండు లేన్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి, గుడివాడ బైపాస్ పట్టణ ప్రాంతంలో 9+660 నుండి రోడ్డు మెరుగుదల పనులతో సహా OHE లో చేర్పులు మరియు మార్పులు. సుమారు విలువ రూ: 66,21,525.48. పూర్తి చేయు కాలం: 12 నెలలు. బిడ్ సెక్యూరిటీ (బయానా) : రూ. 1,32,400/-. ముగింపు తేది: 19.02.2026. టెండర్ ఫారం ధర: నిల్.

పూర్తి వివరాలు మరియు షరతుల కోసం మా వెబ్‌సైట్ www.ireps.gov.in ను వీక్షించండి.

గమనిక: టెండర్లు తెరిచే తేదీన సెలవుదినం అయితే, టెండర్లు తదుపరి పని దినాన తెరవబడతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/TrD/ విజయవాడ.
A2303

తదుపరి టెండరు నిబంధనలు /వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.


## 12 నుంచి ఐ సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

### 6న నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాత వార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఐ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 12 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 6న జారీ చేయనున్నట్టు ఐ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ ఆలువాల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐ సెట్-2026 కమిటీ మొదటి సమావేశం బుధవారం మాసబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. కమిటీ సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తో పాటు కన్వీనర్ ప్రొఫెసర్ ఆలువాల రవి పాల్గొన్నారు. ఐ సెట్-2026 పరీక్షను మహాత్మా గాంధీ యూనివర్సిటీ నిర్వహించనుంది. మొదటి కమిటీ సమావేశం అనంతరం ఐ సెట్-2026 షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 6న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మే 13, 14న ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉదయం సెషన్‌ను, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధ్యాహ్నం సెషన్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు.

## సినిమా టికెట్ ధరల పెంపుపై సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మన శంకర వరప్రసాద్ గారు సినిమా టికెట్ ధరల పెంపునకు సంబంధించిన వ్యవహారంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. దీనికి సంబంధించిన పిటిషన్ ఇంకా సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్నందున అకడే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. మన శంకర వరప్రసాద్ గారు, రాజాసాబ్ సినిమా టికెట్ ధరలను పెంచుతూ ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ న్యాయవాది డీ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సింగిల్ జడ్జి టికెట్ ధరల పెంపు మెమోను రద్దు చేయడంతోపాటు, ఒకవేళ పెంపు నిర్ణయం తీసుకుంటే సినిమా విడుదలకు 90 రోజుల ముందు వెల్లడించాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఫైన్ స్రీన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన అప్పీలుపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రస్తుతం టికెట్ ధరల పెంపునకు సంబంధించిన పిటిషన్లు సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. అందువల్ల దీనికి సంబంధించిన అభ్యంతరాలుంటే అక్కడే తేల్చుకోవాలని చెప్పింది.

# విమాన ప్రయాణికులకు ముప్పుగా మారిన టేబుల్‌టాప్ రన్‌వేలు

**మొన్న మంగళూరు, నిన్న కొజికోడ్, నేడు బారామతి.. మూడుచోట్ల ఒకేతరహా ప్రమాదాలు**

**నిపుణులు హెచ్చరిస్తున్నా టేబుల్‌టాప్ రన్‌వేల రూపురేఖలు మార్చని డిజిసిఎ**

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని బారమతిలో బుధ వారం ఉదయం జరిగిన చార్టెడ్‌ఫ్లైట్ దుర్ఘటనలో ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ సహా ఐదుగురు మరణించడం దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటన జరిగిన విమానాశ్రయంలో టేబుల్ టాప్ రన్‌వే ఉండడం ప్రమాదం జరగడానికి ప్రధాన కారణంగా నిపుణులు చెబుతున్నారు. 16 క్రితం కర్ణాటకలోని మంగళూరు వద్ద, 2020 ఆగస్టులో కేరళలోని కొజికోడ్ వద్ద జరిగిన ప్రమాదాలకు టేబుల్ టాప్ రన్‌వేలు కారణం. కాగా బారామతి ప్రమాదానికి ఇలాంటి రన్‌వే కారణమవడం గమనార్హం. టేబుల్ టాప్‌రన్ వేల విషయంలో డిజిసిఎ తన విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని, ఈ తరహా రన్ వేలను సమూలంగా మార్చాలని, లేకుంటే భవిష్యత్తులో ఇటువంటి రన్ వేలు ఉన్న మరికొన్ని నగరాల్లో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశా లున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నాలుగు అంతర్జాతీయ విమానాశ్రయాలతోపాటు పదికిపైగా డొమెస్టిక్ ఎయిర్‌పోర్టులున్న ఏకైక రాష్ట్రం మహారాష్ట్రలోని బారామతిలో బుధవారం చోటుచేసుకున్న విమానప్రమాదం దేశ వ్యాప్తంగా సంచలనం రేపగా ఈ దుర్ఘటనకు కారణమైన టేబుల్‌టాప్ రన్‌వే అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. బారామతిలో వున్న విమానాశ్రయం దేశీయ విమానాల రాకపోకలు, విఐపిల పర్యటనలకు వాడుతుంటారు. ఈ ప్రాంతం కొండలు, గుట్టల మధ్య వుండగా క్లిష్టమైన చోటుగా పేరుగాంచిన ఇక్కడ టేబుల్ టాప్ రన్ వేను నిర్మించారు. టేబుల్ టాప్ రన్ వే వుండడం అనే ది ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో వున్నాయి. ఇందులో కొన్నిచోట్ల అంతర్జాతీయ విమానాశ్రయాలు కూడా వున్నాయి. కే రళలోని కోజికోడ్‌లో టేబుల్ టాప్ రన్ వే వున్న ఎయిర్ పోర్టు అంతర్జాతీయ విమానాశ్రయం కావడం విశేషం. ఈ తరహా రన్ వేలు వున్న విమానా శ్రయాలు కోజికోడ్‌తో పాటు బారమతి, కర్నాటలోని మంగళూరు, ఈశాన్య రాష్ట్రం మిజోరంలోని లెంగ్‌వ్యూలో వున్నాయి. ఇందులో ఒక్క కోజీకోడ్ విమానాశ్రయంలో మాత్రమే అంతర్జాతీయ విమానాల రాకపోకలు ఎక్కువగా సాగుతుండడం గమనార్హం. మిగత వాటిలో మంగళూరు ఓ మోస్తరుగా వుండగా మిజోరం, బారామతి విమానాశ్రయాలలో దేశీయ సేవలకే పరిమితమయ్యింది. టేబుల్ రన్‌వేలు వున్న విమానాశ్రయాలు పూర్తిగా కొండలు, లోయల మధ్య ఏర్పాటు చేసినవి. ఈ తరహా విమానాశ్రయాల ఏర్పాటును విమానాయాన నిపుణులు మొదటి నుంచి తీవ్రంగా అభ్యంతరం చెబు తున్నారు. ఒక విమానం టేకాఫ్ లేదా లాండింగ్ కావాలంటే తగినంత రన్ వే వుండడం ఎంత ముఖ్యమో, ఇదే సమయంలో పరిస్థితులు అనుకూలించని సమయంలో అదనపు రన్‌వే అందుబాటులో వుండాలి ్సన అవసరం కూడా అంతే ముఖ్యం. దీంతో పాటు విమానాశ్రయం చుట్టూ పటిష్టమై న ప్రహారి గోడలు వుండాలి ్సన అవసరం వుంది. ఇదే సమయంలో విమానాశ్రయ పరిసరాలలో కొండలు, లోయలు వుంటే విమానం టేకాఫ్, లాండింగ్ సమయంలో పైలట్లకు సమస్యలు ఎదురయ్యే వీలుంది. వర్షాకాలం, చలి కాలంలో వాతావరణ పరిస్థితులు అనుకూలించని సమయంలో పైలట్లు ఏ మాత్రం ఏమరపాటుకు గురైనా విమానం ప్రమాదానికి గురై అందులోని ప్రమాణీకులంతా మృత్యువాత పడాల్సిందేనని నిపుణులు అంటునా ్నరు. 2010 మే 22వ తేదీన మంగళూరు విమానాశ్రయంలో ఉదయం ఆరు గంటల సమయంలో దుబాయ్ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా వి మానం సరిగాగ ఇలాంటి



గందరగోళం మధ్య లాండింగ్ అయి వెంట నే రన్‌వే నుంచి ఒకవైపుకు జారిపోయి లోయలో పడిపోయింది. దీని తరువా త విమానంలో మంటలు చెలరేగడంతో అందులోని 158 మంది దుర్మరణం చెందారు. ఈ ఘటనలో కేవలం ఎనిమిది మంది మాత్రమే ప్రాణాల తో బయటపడ్డారు. నాటి ఘటనలో విమానం దించేందుకు సరిగ్గా లేనందున దించవద్దని కో పైలట్, పైలట్‌కు చెప్పడం, ఇదే విషయమై వీరిమధ్య పది నిమిషాలు సంభాషణలు జరగడం, ఈలోపే విమానం లాండింగ్ అయి ప్రమాదానికి గురైందని విచారణ కమిటీ తేల్చింది. దీని తరువాత 20 20 ఆగస్టు ఎనిమిదవ తేదీన గల్ఫ్ నుంచి వచ్చిన విమానం కోజీకోడ్‌లో ప్రతికూల వాతావరణంలో కూలిపోయి 20 మంది మరణించారు. దీనిపైన విచారించిన కమిటీ కూడా టేబుల్ టాప్ రన్ వేపై మార్పుల గురించి ప్రస్తావించారు. ఇక తాజాగా బారామతిలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అ జిత్ పవార్ ప్రయాణించిన చిన్నపాటి విమానం టేబుల్ టాప్ రన్ వేపై పొగమంచు కారణంగా రన్ వే సరిగ్గా కనిపించక పోవడంతో పది నిమిషా ల పాటు గాలిలో చక్కర్లు కొట్టి ఎటిసి అనుమతితో కిందకు దిగుతున్న సమయంలో బండరాయిని ఢీకొని రెండు ముక్కలయ్యింది. ఈ దుర్ఘటనలో అజిత్ పవార్ సహా ఐదుగురు మరణించారు.

### టేబుల్‌టాప్ రన్‌వేలు అంటే ఏమిటి, ఎలా ఉంటాయి?

బారామతి విమానాశ్రయంలో బుధవారం ఉదయం చార్టెడ్ విమానం ప్రమాదానికి గురైన తరువాత దేశ వ్యాప్తంగా మరోసారి టేబుల్ టాప్ రన్ వే గురించి చర్చ మొదలైంది. అసలు టేబుల్ టాప్ రన్ వే అంటే ఏమిటనేది పరిశీలిస్తే... పేరుకు తగినట్లుగానే టేబుల్ ఉపరితలం మాదిరిగానే ఇక్కడి రన్ వేలు ఏటవాలుగా వుంటాయి. ఈ తరహా రన్‌వేలు వున్న విమానాశ్రయాలు కేవలం ఎత్తయిన కొండలు, లోయల మధ్య మాత్రమే ఏర్పాటు చే స్తారు. ఈ రన్‌వేలకు రెండు వైపుల ఎత్తయిన కొండలు లేదా లోయలు వుంటాయి. సాధారణ విమానాశ్రయాలలో వున్నట్లుగా విశాలమైన రన్‌వేలు ఇక్కడ వుండవు. టేబుల్ టాప్ రన్ వేలు వున్న విమానాశ్రయాలలో రన్‌వేలు చాలా తక్కువ నిడిది కలిగి వుంటాయి. ఉదాహరణకు బారామతి టేబు ల్ టాప్ రన్ వే పొడవు 1770 మీటర్లే కావడం గమనార్హం. 2020 ఆగస్టులో బోయింగ్ విమానం కూలిపోయిన కోజీకోడ్ విమానాశ్రయ రన్ వే పొడవు రెండున్నర కిలో మీటర్లే. ఇక మిజోరంలోని లెంగ్‌వ్యూ విమానాశ్రయ రన్ వే పొడవు రెండున్నర కిలోమీటరే. మంగళూరు విమానాశ్రయ టే బుల్ టాప్ రన్ వే ఒకటి 1615 మీటర్లు, రెండవది 2450 మీటర్లు.కలిగి వుంది. టేబుల్ టాప్ రన్ వేలు కలిగివున్న విమానాశ్రయాలలో షార్ట్ ఫీ ల్డ్ ఫెర్మార్మెన్ ్స సాంకేతిక పరిజ్ఞా నం వున్న విమానాలు మాత్రమే దిగేందుకు అనువుగా వుంటాయి. సాధారణ రన్‌వేల మాదిరిగా టేబుల్ టాప్ రన్‌వేలపై విమానాలను దించేందుకు యత్నిస్తే ప్రమాదం తప్పదని వైమానిక రంగ నిపుణులు చెబుతున్నారు.

# అట్టడుగు నుంచి అంచెలంచెలుగా ఎదిగిన అజిత్

**ప్రధాని మోడీ, మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్ సహా పలువురి ప్రముఖుల ప్రగాఢసంతాపం**



అజిత్‌పవార్‌తో ప్రధాని మోడీ (ఫైల్)

**న్యూఢిల్లీ, జనవరి 28:** విమానప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటి సిఎం అజిత్‌పవార్ అకాలమరణం పాలవడంపై ప్రధాని మోడీ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అట్టడుగు స్థాయినుంచి అంచలంచెలుగా ఎదిగిన రాజకీయ నేతగా ప్రజానాయకుడిగాప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతారని, ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నట్లు ప్రకటిం చారు. ఈ విపత్తుసమయంలో ఆయన కుటుంబసభ్యులు మనోధైర్యంతో ఉండాలని, ఆభగవంతుడు వారికి ధైర్యం ప్రసాదించాలని ఆకాక్షించారు. రాష్ట్రపతిద్రౌపది ముర్ము తన సోషల్‌మీడియా పోస్టులో మహారాష్ట్రకు ఇది కోలుకోలేని నష్టం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అజిత్‌పవార్ ఎంతో కృషిచేసారని పేర్కొన్నారు. ఆయన మృతి ఎంతోబాధాకరమని, ప వార్ కుటుంబానికి, ఆయన మద్దతుదారులకు తాను ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తున్నట్లు పోస్టులో వివరించారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అకాలమరణం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయినట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ వెల్లడించారు. తన సుదీర్ఘ ప్రజాజీవితంలో మహారాష్ట్ర అభివృద్ధి శ్రేయస్సుకు ఎంతో కృషిచేసారని ఆయన కుటుంబానికి శ్రేయోభిలాషులకు అభిమానులకు తన సానుభూతిని తెలియజేస్తున్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. అజిత్‌పవార్‌తో ఎప్పుడు కలిసినా మహారాష్ట్ర ప్రజల సంక్షేమానికి సంబంధించిన అంశాలపైనే చర్చించేవారని, ఆయన అకాలమరణం తనను ఎంతగానో కలిచివేసిందని హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఈ విపత్కర సమయంలో పవార్‌కుటుంబానికి మేమంతా అండగా ఉంటామని అమిత్‌షా అన్నారు. ఆయనమరణం ఎన్డీయే కుటుంబానికి తీవ్రనష్టం కలిగించిందని ఆవేదన వ్యక్తంచేసారు.

**మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్ విచారం**

అజిత్‌పవార్ అకాల మరణంపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ స్పం దించారు. తన మిత్రుడు, సహచరుడు అజిత్‌పవార్ ప్రాణాలు కోల్పోవడం తీవ్ర వేదనకు గురిచేసిందని, రాష్ట్రం మొత్తం విషాదంలో మునిగి పోయిందన్నారు. వ్యక్తిగతంగా అజిత్ తనకు మంచి స్నేహితుడని, పరిపాలనలో ఎదురైన ఎన్నో సవాళ్లను మేం ఇద్దరం కలిసి ఎదుర్కొనట్లు వివరించారు. మహారాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఆయన అకాలమరణం తీరని లోటు అని రాష్ట్రంలోమూడు రోజులు సంతాప దినాలుప్రకటిస్తున్నట్లు ఫడ్నవిస్ వెల్లడించారు.

**శివసేన చీఫ్ ఏక్‌నాథ్‌షిండే**

అజిత్‌పవార్ మృతిపట్ల మహారాష్ట్ర డిప్యూటిసిఎం ఏక్‌నాథ్‌షిండే తీవ్ర విచారం వ్యక్తంచేసారు. తనతో ఎంతో సాన్నిహిత్యం కలిగిన అజిత్‌ఇక లేరన్న బాధ తనను కలిచివేసిందని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు షిండే అన్నారు. అలాగే థాకరే వర్గం శివసేన నేత ఎంపి సంజయ్‌రౌత్ మాట్లాడుతూ మహారాష్ట్రలో ఇది చీకటిరోజు అని ప్రమాదం తెలియగానే ఆయన సురక్షితంగా ఉండాలని ఆదేవుడిని ప్రార్థించినట్లు రౌత్ పేర్కొన్నారు. అజిత్‌పవార్‌కు బారామతితో ఎంతో అనుబంధం ఉందని, అక్కడే ఆయన మరణించడం విషాదకరమని పేర్కొన్నారు.

# అజిత్‌పవార్ మృతిపై తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ విచారం

**మాజీ సిఎంలు కెసిఆర్, జగన్, డిప్యూటీ సిఎం పవన్, కెటిఆర్ సంతాపం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి28:**మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందడం పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. ఏపీ సీఎం చంద్రబాబు అజిత్ పవార్ మరణంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'విమాన ప్రమాదంలో అజిత్ పవార్ అకాల మరణం వార్త విని తీవ్రంగా కలత చెందాను. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అనుచరులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అని చంద్రబాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా, అజిత్ పవార్ ఆకస్మిక మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పవార్ మరణం ప్రజా జీవితానికి తీరని లోటని ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ సీఎం వైఎస్ జగన్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తమ సంతాపాన్ని ప్రకటించారు. అనుభవజ్ఞుడైన నేతను కోల్పోయామని, మహారాష్ట్ర రాజకీయాలకు ఇది తీరని లోటని కేటీఆర్ అన్నారు.

**అజిత్‌పవార్ మృతికి మంత్రులు పొన్నం, దామోదర సంతాపం**

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ విమానప్రమాదంలో ఆకస్మిక మృతి పట్ల రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు. మహారాష్ట్ర రాజకీయాలకు తీరనిలోటని పవార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్న ట్టు ప్రకటన లో తెలిపారు. అజిత్‌పవార్ మృతికి వైద్యమంత్రి దామోదర రాజ నర్సింహ సంతాపం తెలిపారు. అజిత్‌పవార్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఎసిబికి చిక్కిన నార్నూర్ ఎఇ శ్రీకాంత్ డిస్మిస్

**అవినీతికి పాల్పడితే కటకటాలే..**

**బ్లాక్ లిస్టులో వివరాలు**

**హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి.పి.గౌతం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 28:**విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడి, లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల అవుట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గం శ్రీకాంత్ ను ఉద్యోగంలో నుంచి తొలగించామని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం తెలిపారు. ఇతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు, భవిష్యత్తులో ఎక్కడా ఉద్యోగం రాకుండా వివరాలను బ్లాక్ లిస్టులో పెడుతున్నట్లు ప్రకటించారు. శ్రీకాంత్ గత ఏడాది మే నెల నుంచి విధులను నిర్వహిస్తూ మంగళవారం నాడు నార్నూర్‌లో ఇందిరమ్మ లబ్ధిదారుల నుంచి లంచం డిమాండ్ చేసి, రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. బిల్లుల విడుదల నిమిత్తం ఇండ్ల ఫోటోలు అప్ లోడ్ చేయడానికి అధికారులెవరైనా నిరాకరిస్తే, ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా లబ్ధిదారులే స్వయంగా పోటోలను అప్ లోడ్ చేసుకోవచ్చని ఎండి సూచించారు.

**లబ్ధిదారులే ఫొటోలు ఎలా అప్‌లోడ్ చేసుకోవచ్చంటే..**

లబ్ధిదారులు తమ మొబైల్ ఫోన్ లో ఇందిరమ్మ ఇండ్ల యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలి. అందులో తమ ఫోన్ నెంబరుతో (ఒటిపి ద్వారా) లబ్ధిదారుగా లాగిన్ అయిన తరువాత డ్యాష్ బోర్డులో వారికి సంబంధించిన వివరాలన్నీ కనిపిస్తాయి. ఇంటికి సంబంధించి క్యాప్చర్ స్టేజ్ వైజ్ ఫోటో గ్రాఫ్స్ అని ఇంటి నిర్మాణపు దశలు ఉంటాయి. అందులో గ్రౌండింగ్, బేస్ మెంట్, వాలింగ్, శ్లాబ్ లెయిడ్, కంప్లీషన్ అని ఉంటాయి. వాటిలో ఏ దశ ఫోటోలు అప్ లోడ్ చేయాల్సి ఉంటుందో దానిపై క్లిక్ చేసి, ఆ దశకు తగినట్లుగా నిర్దేశించిన వివరాలను పొందుపరుస్తూ, ఇంటి ఫోటోలను తీసి లబ్ధిదారులే స్వయంగా అప్‌లోడ్ చేయవచ్చు.

**అవినీతిని ఉపేక్షించేది లేదు..**

పేదలకు శాశ్వతమైన లబ్ధి చేకూర్చే బృహత్తరమైన సంక్షేమ కార్యక్రమంలో అవినీతికి పాల్పడుతూ, లంచాలను డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షి ంచేది లేదని ఎండి గౌతం స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో ఇరుక్కున్న వారు జైలుకు వెళ్లడమే కాకుండా, తదుపరి వారికి ఎక్కడా ఉద్యోగాలు లభించవని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో వివిధ రకాల విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ సిబ్బంది అయినా, డిప్యూటేషన్ పై వచ్చిన వారైనా, అవుట్ సోర్సి ంగ్ సిబ్బంది అయినా, అవినీతికి పాల్పడితే కేసులు ఎదుర్కోవాల్సి ందే అని హెచ్చరించారు.

# మేడిపల్లిలో ఘోర ప్రమాదం.. ఇద్దరు విద్యార్థులు మృతి

**హైదరాబాద్ (మేడిపల్లి), జనవరి 28, ప్రభాత వార్త :** స్నేహితుడి ఇంటికి శుభకార్యానికి వెళ్లి కారులో వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు.మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి.ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి వరంగల్ హైవేపై బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాకు చెందిన 8 మంది విద్యార్థులు హైదరాబాద్ లో గీతం కాలేజ్, ఓయూ డిగ్రీ కాలేజ్, సిఎంఆర్ కాలేజ్, సిద్ధార్థ కాలేజ్ లలో బీటెక్ చదువుతున్నారు.మోలాలీ లోని స్నేహితుడి ఇంటి వద్ద జరిగిన శుభకార్యానికి నిఖిల్ (22) కారులో బయలుదేరారు.ఫంక్షన్ పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలో పోచారం సద్భవన టౌన్షిప్ లో ఉంటున్న స్నేహితులను దింపుటకు వెళ్తుండగా మేడిపల్లిలోని ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ ఫ్లైఓవర్ పిల్లర్ నెంబర్ 97 వద్ద కారు అదుపుతప్పి వేగంగా పిల్లర్ను ఢీకొంది.ఈ ప్రమాదంలో గీతం కాలేజ్ విద్యార్థి నిఖిల్ (22), ఓయూ డిగ్రీ కాలేజ్ విద్యార్థి సాయివరుణ్ (23)లు అక్కడికక్కడే మృతి చెందగా,వెంకట్ (23), రాకేష్(22)లకు తీవ్ర గాయాలయ్యాయి. మరో నలు గురు విద్యార్థులు అభినవ్ (22), యశ్వంత్ రెడ్డి (22), సాత్విక్(23), హర్ష వర్ధన్ (22)లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడ్డ వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.




ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, ఇన్‌సెట్- నిఖిల్, సాయివరుణ్

## నేడు ఇంటర్ ప్రాక్టికల్ హాల్ టికెట్స్ విడుదల

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను నేటి(గురువారం) విడుదల చేయనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. గురువారం నుంచి కాలేజీల లాగిన్స్ లో ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రాక్టికల్ హాల్ టికెట్లను అందుబాటులో ఉంచనుననట్టు బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు జరగనున్నాయి. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2026కు సంబంధించి సైన్స్, ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్లు నేటి(గురువారం) నుంచి సంబంధిత కళాశాలల లాగిన్లలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీ డియట్ ఎడ్యుకేషన్ ప్రకటించింది. విద్యార్థులు తమ సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్లు పొందాలని బోర్డు సూచించింది. విద్యార్థులు హాల్ టికెట్లలో పేర్కొనబడిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, బోర్డ్, కళాశాల, అధికారుల సూచనలను పాటించాలని కృష్ణ ఆదిత్య తెలిపారు.


DEBTS RECOVERY TRIBUNAL
HYDERABAD (DRT-II )
1ST FLOOR, TRIVENI COMPLEX
ABIDS, HYDERABAD- 500001
O.A. No. 125 of 2025
ICICI BANK LIMITED
Vs.
ATHARVA HARDWARE AND SANITARY AND OTHERS
SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. Atharva Hardware and Sanitary, Represented by its Proprietor Renuka Samudre, 5-1-459, Shop No. 3, Jambagh, Hyderabad- 500012, Telangana State. ...Defendant No.1

Please take the summons in the above O.A. No. 125 of 2025 filed by the Applicant for Recovery of money Rs. 82,78,372.94 Ps. against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Vaartha Telugu Daily Newspaper circulated in the place of Address of the Defendant and posted the matter to 10.03.2026.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 10.03.2026 at 10.30 a.m. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad- 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 22nd day of January, 2025.
(By order of the Court)
Asst. Registrar
Debts Recovery Tribunal- II
Hyderabad

వార్త

నువ్వీ కార్యం సాధించలేవు అని అందరూ అన్న పనిని నిర్వహించడమే మనిషి జీవితంలో గొప్ప ఆనందం.

-వార్డ్ బగెహాట్

# పాల కల్తీని అడ్డుకోలేమా?


మానవుడికే కాదు పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సంకటంగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలుఏమాత్రం ఫలించడం లేదు. దేశంలో రానురాను కల్తీ పెరిగిపోతున్నది. తాగేనీటిలో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ, చివరకు పౌష్టికాహారంగా వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధుల వరకు సేవించే పాలల్లో కల్తీ, అదీఇది అని తేడా లేకుండా మొత్తం కల్తీమయంగా మారుతున్నది. అన్నింటి కంటే ముఖ్యంగా పాలల్లో కల్తీ రానురాను ప్రమాదకరంగా మారుతున్నది. మనిషి మనుగడనే ప్రశ్నార్థకంగా చేసే సూచనలు కన్పిస్తున్నాయి. ఇంత ప్రమాదకరంగా మారుతున్నా, పొగమంచులా విస్తరిస్తున్నా, అడిగేవారు, అడ్డగించేవారు కరవైపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అవినీతికి, కల్తీకి అవినాభావ సంబంధం ఉంది. పెరుగుతున్న అవినీతికి రెట్టింపుస్థాయిలో కల్తీ జరుగుతున్నది. దీన్ని అరికట్టేందుకు చట్టాలున్నాయి. ఆ చట్టాలు అమలు చేసి కల్తీ జరగకుండా నిరోధించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. కానీ కల్తీని ఏమాత్రం అరికట్టలేకపోతున్నారు. భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కల్తీ మానవ జీవనానికి సవాలుగా మారుతున్నా,అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నదనే సంకేతాలు స్పష్టంగా వెలువడుతున్నా నిర్దిష్టమైన చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఇదేదో మూడోకంటికి తెలియకుండా జరగడం లేదు. బహిరంగ వ్యాపారమే. యూరియా లాంటి రసాయనిక ఎరువులు కలిపి పాలను అమ్ముతున్నారు. స్వచ్ఛమైన పాల లభ్యత అనేది సమస్యగా మారిపోయింది. భారతదేశానికి సంబంధించి ఎన్నో సందర్భాల్లో సర్వోన్నత న్యాయస్థానం కల్పించుకున్న సందర్భాలున్నాయి. దేశ ప్రజలకు విక్రయించే పాలల్లో అధిక శాతం కల్తీయేనన్న వాస్తవాన్ని స్వాక్షాత్తు జాతీయ ఆహారభద్రత ప్రమాణాల మండలి ఏనాడో వెల్లడించింది. అప్పట్లో దేశంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తే అధిక శాతం శాంపిల్స్‌లో కల్తీ బయటపడింది. సర్వోన్నత న్యాయస్థానం కల్పించుకొని ఇంతపెద్ద సమస్యపై పాలకులు ఏం చేస్తున్నారని నిలదీసింది. ఈ దురాగతాలను నివారించడంలో విఫలమవుతున్న అధికార గణంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను సుప్రీం కోర్టు ప్రశ్నించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. యేడాది యేడాదికి పాల వినియోగం పెరుగుతుంటే ఉత్పత్తులు ఆ స్థాయిలో జరగడం లేదు. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా దాదాపు ముప్పైశాతం లోటు ఉన్నట్లు అధికార గణాంకాలే చెబుతున్నాయి. ఈ లోటు రాబోయే వేసవిలో మరింత పెరిగే అవకాశం ఉంది. హోటళ్లల్లో విక్రయించే పన్నీర్ బటర్ మసాలా వంటి వాటిల్లో సింథటిక్ పాలను అత్యధికంగా వాడుతు న్నట్లు బయటపడింది. బీహార్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో భారీ ఎత్తున కల్తీలు జరుగుతున్నట్లు తనిఖీల్లో వెలుగుచూసింది. తెలుగు రాష్ట్రాల్లో కూడా కల్తీ చేస్తున్న వ్యాపారులు ఎన్నోసార్లు పట్టుబడ్డారు. ఒక పాల వ్యాపారి ఇంటిపైదాడి చేసి యూరియా, డిటర్జెంట్ వంటి రసాయనికాలతో తయారు చేసినపాలను స్వాధీనం చేశారు. ఇకపోతే గ్రామాల నుంచి వచ్చే పాలు అమ్మకందారు లు ఎక్కడపడితే అక్కడ, ఏ నీళ్లను అంటే ఆ నీళ్లను పాలల్లో కలుపుతున్నారు. ఫ్లోరైడ్, తదితర రసాయనాలు ఉన్న నీళ్లను కలపడంతో ప్రజారోగ్యంపై ఎంతటిప్రభావం పడుతున్నదో గుర్తించడం లేదు. పాల ఉత్పత్తులను పెం చేందుకు ప్రవేశపెడుతున్న పథకాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. భారీ ఎత్తున చిన్న కారు, సన్నకారు రైతులకు సమృద్ధిగా పాలు ఇచ్చే సంకరజాతి ఆవులను, గేదెలను కోట్లాది రూపాయలతో సరఫరా చేశారు.కానీ అందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో గిట్టుబాటుకాక దేశంలో అధికశాతం మంది అన్నదాతలు పాడిపశువులను అమ్ముకున్నారు.గ్రామాల నుంచికాకుండా పట్టణాలు, నగరాల నుంచి గ్రామాలకు పాలపాకెట్లు సరఫరా అయ్యేదురదృష్టపు రోజులు దాపురించాయి. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న డయిరీలు నష్టాలబాటలో మూసివే తకు దగ్గరలో ఉన్నాయి. ప్రభుత్వం వద్ద ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకపోవడం, పాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితులను ఎదుర్కోవల్సి వస్తోంది. మహాత్ముడు కూడా వ్యవసాయ అనుబంధాల రాబడి పెంచితే తప్ప కోట్లాది గ్రామీణుల పేదల పరిస్థితి మెరుగుపడదని ఎన్నోసార్లు వక్కాణించారు. పాల ఉత్పత్తి అందుకు ఒక మార్గం.కానీ ఆ దారిలో పాలకులు అడుగులు వేయలేకపోతున్నారు. ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతున్నారు. మరెన్నో సబ్సిడీలు ఇస్తున్నా అవి ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. అన్నింటి కంటే భూముల విలువలు విపరీతంగా పెరిగిపోవడంతో పశువులను మేపుకునేందుకు బీడుభూములు కరవైపోయాయి. గడ్డికొని వేయాల్సి వస్తున్నది.అది రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ఫలితంగా సన్నకారు, చిన్నకారు రైతుల్లో ఎక్కువ మంది పాడిపరిశ్రమకు మంగళం పాడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని అందుకు అనుగుణంగా పాల ఉత్పత్తులను పెంచేందుకు రైతులకు చేయూతనిస్తే తప్ప సమస్య తీరే అవకాశం లేదు.అలాగే కల్తీకి పాల్పడే వారిని చట్టంముందు నిలబెట్టి తిరుగులేని సాక్షాల తో రుజువుచేసి మళ్లీమళ్లీ కల్తీకి పాల్పడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి.ఇందులో నిర్లక్ష్యం చేస్తే పాల ఉత్పత్తికి, వినియోగానికి వ్యత్యాసం పెరిగి అది పూడ్చేందుకు కల్తీ పాలు విస్తరించి ప్రజారోగ్యాన్ని కాటువేయక తప్పదు.

తోటి వారితో మంచిగా జీవించు. నీ మంచితనాన్ని తోటి వారికి పంచు. మంచితనం నిన్ను ఎల్లప్పుడూ కాపాడుతుంది.



టాల్‌స్టాయ్

ప్రపంచంలో అన్నింటికన్నా కష్టమైన విషయం ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకోవడమే



నలివర్ గోల్డ్‌స్మిత్

# ప్రజావాక్కు



## నీటి వివాదాలు ముదరకూడదు

గురుశిష్యులైన ఆంధ్రప్రదేశ్ తెలంగాణా ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి గారు తమ రాష్ట్రాల మధ్య నెలకొన్న అనేక సమస్యలను తమ అర్థవంతమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవడం, రాష్ట్రాల అభివృద్ధికి సమన్వయ కృషి జరుపుకోవడం మిక్కిలి ముదావహం. ముఖ్యంగా నదులనీటి వివాదాలు ముదరకుండా చూసుకోవాలి. ఇద్దరు ఈమధ్య ఒకే సమయంలో స్విట్జర్లాండ్ లోని దావోస్ పర్యటించి అక్కడ నిర్వహించిన ప్రపంచ ఆర్థిక సమావేశంలో విదేశాలకుచెందిన ప్రఖ్యాత వ్యాపారవేత్తలను కలిసి తమరాష్ట్రాలలో లక్షలకోట్ల పెట్టుబడులను పెట్టడానికి హామీలు పొందారు. ఆంధ్రప్రదేశ్ అనేక రంగాలలో వెనుకబడి ఉన్నందున వాగ్దానం చేసిన వారు త్వరలో వారి పరిశ్రమలను స్థాపించేందుకు తొందర పెట్టాలి. అలాగే తెలంగాణ రాష్ట్రంకూడా.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## వైద్య కళాశాలల విస్తరణ అవసరం

వైద్యవిద్యను, ఆరోగ్యసేవలనుసామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వ వైద్యకళాశాలల విస్తరణ అవసరంగా మారింది. ప్రస్తుతం లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం రెండు తెలుగురాష్ట్రాలలో ప్రైవేటు వైద్యకళాశాలల సంఖ్య ప్రభుత్వ కళాశాలలకంటే ఎక్కువగాఉంది. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 18 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే, తెలంగాణలో ఇటీవల 8కొత్త కళాశాలలు మంజూరుకావడంతో ప్రభుత్వ కళాశాలలసంఖ్య 34కి పెరిగింది. అయినప్పటికీ విద్యార్థుల పెరుగుతున్న డిమాండ్‌కి, జనాభాకుతగిన వైద్యులనిష్పత్తి దృష్ట్యా ఈసంఖ్య పరిమితం.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

## ఆయుర్వేద వైద్యంపై దృష్టి

మనదేశంలో 95శాతం వ్యక్తులు అల్లోపతి వైద్యంపైనే ఆధారపడ్డారు. ఈ వైద్య విస్తృత పరిశోధన పరిస్థితులకు కారణంగా మారింది. ఇటీవల జాతీయస్థాయిలో సంప్రదాయ వైద్యం కూడా అందుబాటులోకి వచ్చి ప్రత్యామ్నాయ ఎంపికకు వైద్యశాలలు, మందులు వగైరా ఏర్పాటు నిమిత్తం దృష్టిసారించారు. ప్రజలు ప్రాచీన ఆయుర్వేద వైద్యం తక్కువ ఖర్చుతో ప్రజలు అలవాటు పడడం మంచిది.

- బి. మేఘనాథం, విశాఖపట్నం

## కుక్కలు లేని గ్రామాలు

తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇటీవల సుమారు 500 వీధి కుక్కలను సామూహికంగా హతమార్చడం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. పోలీసు రికార్డులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియోఆధారాల ప్రకారం, విషపు ఇంజక్షన్లు, ఆహారంలో విషంకలిపి ఈ మూగజీవాలను అత్యంత క్రూరంగా అంతం చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా ఎన్నికైన కొందరు సర్పంచులు తమగ్రామాలను కుక్కలు లేని గ్రామాలుగా మారుస్తామనిఎన్నికలసమయంలోఇచ్చిన హామీలను నెరవేర్చుకోవడంలో భాగంగానే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటనపై 15 మందిపై కేసులు నమోదైనప్పటికీ, నిందితులను వెంటనేఅరెస్టు చేయకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహంవ్యక్తమవుతోంది. చట్టపరంగా చూస్తే, ఈచర్య ఏమాత్రం సమర్థనీయం కాదు. యానిమల్ బర్త్‌కంట్రోల్ రూల్స్, 2023 'జంతు హింస నిరోధక చట్టం' ప్రకారం వీధి కుక్కలను చంపడం లేదా గాయపరచడం తీవ్రమైన నేరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రోడ్లను బాగు చేయాలి

గ్రామీణ ప్రాంత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో పొలాల పక్కన ఉన్న రోడ్లు మరీ ఘోరంగా ఉన్నాయి. గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదేవిధంగారోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలోప్రమాదకరంగా దెబ్బతిన్నరోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపి వాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలి.

- బి. యోగేందర్, నల్గొండ జిల్లా

## సక్రమంగా పనిచేయాలి

ఎస్సీ, ఎస్టీల భూకబ్జాలు, అక్రమనిర్మాణాలపై రెవెన్యూ, పోలీస్, అధికారులకు ఫిర్యాదులు చేసి, నెలలు, సంవత్సరాలు గడచినా కూడా భూసమస్యలు పరిష్కారం కావడంలేదు. భూ సమస్యలకు. భూకబ్జాలకు, అక్రమ నిర్మాణాలకు, రెవెన్యూ రికార్డులలో కొలతలు, మ్యాపులు, విస్తీర్ణం, సరిహద్దులు రెవెన్యూ రికార్డుల ప్రకారం ఒకేరోజు పరిష్కారంచేయవచ్చు. కానీ ఈరెండు శాఖల అధికారులు సమస్యలను సాగదీస్తూ రాజకీయ జోక్యంతో భూములుకోల్పోయిన వారికి ఏమాత్రం న్యాయం చేయడం లేదు.

- రాపాక రవీందర్, జనగాం

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ట్రంప్‌కు కీలెరిగి వాత పెట్టిన భారత్, ఇయు

**భారత్‌ను ఎంతగాకవ్వించినా, అగ్రరాజ్యమైన అమెరికా ను భారత్ ఎదురించే సాహసం చేయబోదన్నది వాస్తవం. అమెరికాతో గల వాణిజ్య సంబంధాల దృష్ట్యా భారత్ ఏరికోరి ఇబ్బందులు కొనితెచ్చుకోలేదు. ఈ కారణంగానే అమెరికా పట్ల భారత్‌గట్టిగా వ్యవహరించడంలేదన్నది వాస్తవం. అయితే మారుతున్న ప్రపంచ పరిణామాలు ఇతర దేశాలతో భారత్ వాణిజ్య సంబంధాలను మెరుగుపరచవచ్చు. అమెరికా డాలర్ ప్రపంచాన్ని శాసించే రోజులుపోవాలి. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా తమసొంత కరెన్సీలతో ఇండో ఈయూ దేశాలు వాణిజ్యం కొనసాగిస్తే, మిగిలిన దేశాలు కూడా ఇదేబాటలో పయ నించవచ్చు. తద్వారా డీడాలరైజేషన్ సుసాధ్యంకావచ్చు.**



సుంకవల్లి సత్తిరాజు

జర్మనీ నియంత హిట్లర్ ఆధ్వర్యంలోని నాజీ ప్రభుత్వం 1935–45 సంవత్సరాల మధ్య దాదాపు ఆరు లక్షలాది మంది ప్రజలను అతి కిరాతంగా హత్య చేసిన సంఘటన నేటికీ మరువలేం. ఇది చరిత్రలో జరిగిన దారుణ మారణకాండ. ఇంకా చరిత్రలో ఎంతోమంది క్రూరమైన నియంతలున్నారు. జాత్యంహంకారం, సామ్రాజ్యవాద ధోరణులే నాడు ప్రజల ఊపిరి తీసాయి. అయితే 21వ శతాబ్దంలో కూడా నియంతృత్వం వేరేరూపంలో కొనసాగుతున్నది. సామ్రాజ్యవాదం, ఆధిపత్యం, అహంభావం వంటి ఉన్మాద చర్యలు ప్రపంచ ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. అమెరికాను ప్రపంచంలో తిరుగులేని శక్తిగా తయారు చేయడానికి ట్రంప్ సరికొత్త పద్ధతులను అవలంబించి, అన్ని దేశాలను అష్టకష్టాలకు గురిచేయడం చూస్తున్నాం. డోనాల్డ్ ట్రంప్ ప్రపంచంపై ఆర్థిక యుద్ధం ప్రకటించి, తనకు అడ్డు చెప్పిన దేశాలపై వాణిజ్య సుంకాలను విధిస్తూ, ప్రపంచ దేశాల ఆర్థిక పతనానికి ప్రయత్నం చేయడం ఈ ఆధునిక యుగంలో జరుగుతున్న అరాచకంగా భావించాలి. వెనిజులాపై దాడి చేయడం, కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా పేర్కొనడం, గ్రీన్‌లాండ్ స్వాధీనం కోసం హుంకరించడం, పనామా కాలువ పై పెత్తనం సాగించడానికి పావులుకదపడం, తనను విమర్శించిన దేశాలను ఆర్థికంగా దివాళా తీయించడంవంటి చర్యలతో ట్రంప్ ఆధునిక నియంతగా రూపాంతరం చెందాడు. అయితే ట్రంప్ చర్యలకు విసిగెత్తిన దేశాలు ప్రత్యామ్నాయ చర్యలతో వాషింగ్టన్ అరాచకానికి అడ్డుకట్ట వేయడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. శతృదేశాలతోనే కాదు అత్యంత సన్నిహిత మిత్ర దేశాలతో కూడా కలహాలు పెంచుకుంటున్న ట్రంప్ చేష్టలకు, చర్యలకు సహనం కోల్పోయిన దేశాలు ఏకత్రాటిపై నిలబడి అమెరికా వ్యతిరేకగళం వినిపించిన నేపథ్యంలో ఇండియా ఈయూ దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం ఒక చారిత్రాత్మకమైన సంఘటనగానే భావించాలి. అందుకే ఈ ట్రేడ్ డీల్‌ను 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా పేర్కొంటున్నారు. ఇప్పటికే భారత్‌పై 50 శాతం సుంకాలు విధించిన అమెరికా, రానున్న రోజుల్లో సుంకాలను 500 శాతానికి పెంచుతానని హెచ్చరించడమే కాకుండా తాను సంతోషంగా లేనని, తనను సంతోష పెట్టాలని మోడీకి సూచన చేయడం మితిమీరిన ట్రంప్ అహంకారాన్ని చాటిచెబుతున్నది. వెనిజులా అధ్యక్షుడు మదురోను అపహరించి నిర్బంధించి న్యూయార్క్‌కు తీసుకుపోవడం పెద్ద పొరపాటైతే, గోల్డెన్ డోమ్‌కోసం గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి యత్నించడం, ఇందుకు ఎదురు తిరిగిన మిత్ర దేశాలను అవమానించి, సుంకాలు విధించిన ఫలితమే 'ఎఫ్‌టిఏ'. ఈ ఒప్పందం ద్వారా అమెరికా వాణిజ్య గుత్తాధిపత్యానికి గండిపడినట్టుగానే భావించాలి. 'ఫ్రీ ట్రేడ్ డీల్' వలన భారతీయ వస్తువుల్లో అత్యధిక శాతం ఎలాంటి పన్నులు లేకుండానే ఐరోపా సమాఖ్యదేశాలకు ఎగుమతి కాబడతాయి. భారతీయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తొలగించడం, ఐరోపా దేశాల ఉత్పత్తులపై దశల వారీగా సుంకాలు తొలగించడానికి ఇరుపక్షాలు అంగీకార ఒప్పందాన్ని కుదుర్చుకోవడం పట్ల ఈయూ కమీషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్, ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా హర్షంవ్యక్తం చేయడం జరిగింది. అమెరికా, చైనాల మీద ఆధారపడకూడదనే ఈయూ నిర్ణయం శుభసూచకం, ఆమోదయోగ్యం. ట్రంప్ బెదిరింపులకు లొంగేది లేదని ఇప్పటికే ఫ్రాన్స్, బ్రిటన్ లాంటి దేశాలు స్పష్టం చేసాయి. ట్రంప్ దుందుడుకు చర్యలతో ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోతున్న దశలో ఇక తాము అమెరికాకు ఊడిగం చేయబోమని, భారత్‌తో



ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవడమే ఉత్తమమని ఈయూ దేశాలు భావిస్తున్నాయి. మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌తర్వాత మరికొన్ని ప్రపంచ దేశాలు కూడా ఇదేబాటలో పయనించే అవకాశాలే మెండుగా ఉన్నాయి. అఫ్గాన్ యుద్ధంలో అమెరికా తప్ప నాటో దళాలు సరిగా పోరాడలేదని ట్రంప్ పేర్కొనడంపట్ల యు.కె తీవ్రంగా స్పందించింది. తర్వాత ట్రంప్ మాట మార్చి, యుకె సైనికులు యోధులని ప్రశంసించినా ఫలితం దక్కలేదు. తమ సహకారం లేకపోతే యూరప్‌లో అంతా జర్మన్ భాష మాట్లాడి ఉండేవారంటూ పాత సంఘటనలను గుర్తుచేస్తూ ములుకుల్లాంటి పలుకులతో యూరప్ దేశాల ఆత్మాభిమానాన్ని కించపరచడం పట్ల ఆయా దేశాలు ట్రంప్‌పై కోపంతో రగిలిపోతున్నాయి. రాగల ప్రమాదం గుర్తించిన ట్రంప్ తనస్వరం తగ్గించి, ఎనిమిది యూరప్ దేశాలపైవిధించిన సుంకాలను రద్దుచేస్తానని ప్రకటించాడు. గ్రీన్‌లాండ్ ఆక్రమణపై వెనక్కితగ్గి, బలవంతంగా స్వాధీనం చేసుకోబోమని, చర్చల ద్వారా ఈఅంశాన్ని పరిష్కరిస్తానని చెబుతూ, ఆర్కిటిక్ అంశంపై ఫ్రేమ్‌వర్క్ రూపకల్పన జరుగుతుందని పేర్కొనడం కొంతవరకు ఉపశమనం కలిగించే విషయమే. ఇదే సందర్భంలో తాము డెన్మార్క్ లో అంతర్భాగంగా కాకుండా స్వతంత్ర దేశంగా కొనసాగాలని గ్రీన్‌లాండ్ ఆశిస్తున్నది. ఇక సుంకాల విషయానికొస్తే, రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పైఅమెరికా విధించిన 25 శాతం సుంకాలను తొలగిస్తామని అమెరికా పేర్కొనడం హర్షదాయకం. రాబోయే రోజుల్లో భారత్‌పై అన్నిరకాల సుంకాలను తొలగించి, ట్రేడ్‌డీల్ కుదుర్చుకోవాలనుకున్నా అది అమెరికాకు అసాధ్యం కావచ్చు. ఇప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది. అమెరికా ప్రతిష్ఠ మంటగలిసింది. అంతర్జాతీయ చట్టాల విలువ మసకబారింది. ట్రంప్ స్థానంలో ఎవరు అధ్యక్ష స్థానంలో కూర్చున్నా అమెరికాను విశ్వసించే పరిస్థితులు ఇక మీదటఉండవు. దావోస్‌లో ట్రంప్ వాచాలత్వానికి ఖిన్నులై గతంలో అమెరికాతో కుదిరిన ఒప్పందాలను పునః సమీక్షించడానికి, అవసరమైతే రద్దుచేసుకోవడానికి యూరోపియన్ దేశాలపట్ల ప్రతీకారచర్యలకు పాల్పడుతున్న అమెరికా పై ఈయూ దేశాలు బజూకా చట్టాన్ని ప్రయోగించడానికి ప్రయత్నించడంతో ట్రంప్ ఆత్మరక్షణలో పడినట్టు తెలుస్తున్నది. భారత దేశ దిగుమతులపై అమెరికా విధించిన 50శాతం సుంకాల్లో25శాతం సుంకాలు రష్యా నుండి చమురు కొనుగోలు చేసినందుకుఉద్దేశించినవి. భారత్‌తో సహా రష్యా ఆయిల్ కొనుగోలు చేస్తున్న దేశాలపై 500శాతం పన్నువిధింపు అంశంపై చర్చలు కొనసాగుతుండగానే 27 దేశాల యూరోపియన్ యూనియన్ భారత్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్) కుదుర్చుకుంది. దీనిని మదర్ ఆఫ్‌ఆల్ డీల్స్‌గా అభివర్ణించడం విశేషం. రెండవ ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఈయూ, నాల్గవ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌లకు ఈ ఒప్పందం శుభసూచకం. సుమారు 200 కోట్ల జనాభా కలిగి ఉన్న యూరోపియన్ యూనియన్ ఇండియాలు ప్రపంచ జనాభాలో 25 శాతం ఆక్రమించాయి. రక్షణరంగానికి సంబంధించిన ఒప్పందాలు, భారతీయ నైపుణ్యతను ఈయూలో ఉపయోగించుకోవడం, వర్క్ వీసా సులభతరం, ఐరోపా మార్కెట్‌లో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యత, చిన్నతరహాపరిశ్రమలకు ప్రవేశం ఎఫ్.టి.ఏలో చెప్పుకోదగ్గ అంశాలు. భారతీయ ఎగుమతుల్లో 99 వస్తువులకు, యూరప్ ఎగుమతుల్లో 97 శాతం వస్తువులకు సుంకాలు తగ్గడం వలన ఇరు పక్షాలు లాభపడతాయి. ఈయూ దేశాలతో భారత్ ట్రేడ్‌డీల్ కుదుర్చుకున్న విషయం ట్రంప్‌ను కలవర పాటుకు గురిచేసింది. ఇప్పటికే ట్రంప్ చర్యల వలన అమెరికాలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ద్రవ్యోల్బణం పెరగడంతో అమెరికా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తనకు మిత్ర దేశాలైన ఈయూ, నాటో దేశాలతో వైరంకొని తెచ్చుకోవడమే కాకుండా గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకుని, ఆర్కిటిక్‌లో తన అధికారం చెలాయించాలనుకున్న ట్రంప్‌కు దావోస్ వేదికగా జరిగిన అవమానం, ఫ్రాన్స్, బెల్జియం, కెనడా లాంటి దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా గళం విప్పడం చూసాం. భారత్‌తో ఈయూ దేశాల ట్రేడ్‌డీల్ వలన ట్రంప్ దారికొచ్చి ఎనిమిది ఈయూదేశాలపై విధించిన సుంకాలను రద్దుచేయడం జరిగింది. భారత్‌ను ఎంతగాకవ్వించినా, అగ్రరాజ్యమైన అమెరికాను భారత్ ఎదురించే సాహసం చేయబోదన్నది వాస్తవం. అమెరికాతో గల వాణిజ్యసంబంధాల దృష్ట్యా భారత్‌ఏరికోరి ఇబ్బందులు కొని తెచ్చుకోలేదు. ఈ కారణం గానే అమెరికా పట్ల భారత్‌గట్టిగా వ్యవహరించడంలేదన్నది వాస్తవం. అయితే మారుతున్న ప్రపంచ పరిణామాలు ఇతరదేశాలతోభారత్ వాణిజ్యసంబంధాలను మెరుగుపరచవచ్చు. అమెరికా డాలర్ ప్రపంచాన్నిశాసించే రోజులుపోవాలి. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా తమసొంత కరెన్సీలతో ఇండోఈయూ దేశాలువాణిజ్యం కొనసాగిస్తే, మిగిలిన దేశాలు కూడా ఇదేబాటలో పయనించవచ్చు. తద్వారా డీడాలరైజేషన్ సుసాధ్యంకావచ్చు. ●

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించలేరా?

తరిగోపుల నారాయణస్వామి

ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలు, విద్యారంగానికి సంబంధించిన మౌలిక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రజాస్వామ్య వేదికలుగా ఉండాలి. కానీ వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక ఉపాధ్యాయ సంఘాల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఆశించిన స్థాయిలో లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల ప్రక్రియలు లేకుండా లేదా చాలా కాలం పాటు ఎన్నికలు జరగకుండా, సభ్యుల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా, కొద్దిమంది నాయకులే కీలక నిర్ణయాలు తీసుకునే పరిస్థితి కొనసాగడం వలన క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నిజమైన సమస్యలు సమగ్రంగా ప్రభుత్వానికి చేరడం లేదు. రాజకీయ పార్టీలు లేదా పరిపాలనా యంత్రాంగం సిఫారసులతో శాశ్వత గుర్తింపు పొందిన కొన్ని సంఘాలకు సభ్యుల మద్దతు నిరంతరం అవసరం లేకపోవడం వల్ల నాయకత్వంలో బాధ్యత భావన క్రమంగా తగ్గుతున్నది. ప్రభుత్వం కూడా ఏ అంశంపై చర్చ జరపాలన్నా, సంఘాల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందా లేదా అన్న అంశాన్ని పక్కనపెట్టి, గుర్తింపు పొందిన సంఘ నాయకులతోనే చర్చలు జరపడం పరిపాటిగా మారడంతో ఉపాధ్యాయ సమాజంలోని విభిన్న స్వరాలు ఆ చర్చల్లో ప్రతిఫలించడం లేదు. ఈ పరిస్థితి సహజంగానే అసంతృప్తికి దారితీస్తూ, వ్యక్తిగత జెండాలతో, కుల, మత, ప్రాంత భావాలతో అనేక గుర్తింపులేని సంఘాలు ఏర్పడేందుకు కారణమవుతోంది. దీని వల్ల ఒకే లక్ష్యంతో పోరాడాల్సిన ఉపాధ్యాయ సమాజం మరింత విభజనకు గురవుతోంది. ఒకవైపు ప్రభుత్వగుర్తింపు



ఉన్న సంఘాలు సభ్యుల పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించకపోవడం, మరోవైపు గుర్తింపు లేని సంఘాలు ప్రభుత్వంతో అధికారికంగా మాట్లాడే అవకాశాలు లేకపోవడం వలన పాఠశాలల వసతులు, పనిభారం, బదిలీలు, పదోన్నతులు, ఉపాధ్యాయుల వ్యక్తిగత సమస్యలు వంటి మౌలిక అంశాలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రజాస్వామ్యం ఉన్న చోటే బాధ్యత ఏర్పడుతుంది, బాధ్యత ఉన్న చోటే ఫలితాలు కనిపిస్తాయన్న సూత్రాన్ని ఈ సందర్భంలో విస్మరించలేం. ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో ప్రతి రెండు లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి, ఎన్నికైన సంఘాలకు మాత్రమే పరిమిత కాలానికి గుర్తింపు ఇచ్చే విధానం అమలులో ఉండటం వలన అక్కడి సంఘ నాయకత్వం సభ్యుల సమస్యల పట్ల మరింత బాధ్యతగా వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోంది. అదేతరహా విధానం ఉపాధ్యాయ సంఘాల్లో కూడా అమలైతే, నాయకత్వంక్షేత్రస్థాయి ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేసే పరిస్థితిఉండదు. సభ్యుల విశ్వాసం కోల్పోతే నాయకత్వం కూడా కోల్పోవాల్సి వస్తుందన్న అవగాహన సంఘాలను మరింత చురుకుగా, పారదర్శకంగా పనిచేయించే అవకాశముంది. ఈ విధానం ఉపాధ్యాయ సంఘాలను బలహీనపరచడం కాదు, ప్రజాస్వామ్య పునాదులపై మరింత బలోపేతం చేయడమే. ఇది ఎవరి మీద వ్యక్తిగత ఆరోపణ కాదు, ఎవరి మనోభావాలను దెబ్బతీయాలన్న ఉద్దేశం కూడా కాదు. వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దుకునే దిశగా ఒక నిర్మాణాత్మక ఆలోచనను సమాజం ముందుకు తీసుకురావడమే దీని లక్ష్యం. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులైనప్పుడు, వారి సంఘాలు కూడా ప్రజాస్వామ్య విలువలను ఆచరణలో చూపాల్సిన అవసరంఉంది. విద్యారంగ భవిష్యత్తుకు కూడా దీర్ఘకాలంలో మేలుచేసే అవకాశంఉంది. ●

# పంటలపై రసాయన మాఫియా పంజా!

జి. అజయ్ కుమార్

కొత్తగా రాబోతున్న 'పురుగుమందుల నిర్వహణ బిల్లు–2025' ఈ నకిలీ దందాకు చరమగీతం పాడుతుందా?. ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు, మార్కెట్ మాయాజాలం మరోవైపు, నకిలీ విత్తనాలు ఇంకో రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వీటికి తోడు, నకిలీ పురుగుమందుల విషం సాగును లోపలనుంచే మెల్లగా చంపేస్తోంది. పంటను కాపాడాలన్న రైతు ఆందోళననే పెట్టుబడిగా మార్చుకుని, రసాయన మాఫియా లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. ఈ ప్రమాదకర దందాకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కాలం చెల్లిన పాత చట్టాల స్థానంలో, పురుగుమందుల నిర్వహణ బిల్లు–2025ను ప్రతిపాదించి, నకిలీ తయారీదారుల ఆటకట్టించేందుకు రంగం సిద్ధం చేసింది. నేటి వ్యవసాయంలో పురుగుమందుల వినియోగం ఒక అవసరం కాదు – రైతుకు ఒక అత్యవసర పరిస్థితిగా మారిపోయింది. పంటలో చిన్న తెగులు, పురుగు కనిపించినా, మొత్తం పంట నాశనం అవుతుందేమో అన్న భయం రైతును వెంటాడుతుంది. అదే భయాన్ని అవకాశంగా మలుచుకుని, కొన్ని కంపెనీలు నాణ్యత లేని రసాయనాలను ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లతో మార్కెట్లోకి నెట్టేస్తున్నాయి. నిపుణుల అంచనాల ప్రకారం, దేశంలో ఏటా రూ.6,000–8,000 కోట్ల వరకు నకిలీ పురుగుమందుల వ్యాపారం సాగుతోంది. రైతు పెట్టే పెట్టుబడిలో దాదాపు 25 శాతం నేరుగా నష్టంగా మారుతోందన్నది చేదు నిజం. నకిలీ పురుగుమందుల ప్రభావం రైతు జేబుతోనే ఆగిపోవడం లేదు. వ్యవసాయ వ్యవస్థ మొత్తం దీనివల్ల దెబ్బతింటోంది. రోగాలు తగ్గకపోగా పంట ఎండిపోవడం, పెరుగుదల ఆగిపోవడం దిగుబడులు పడిపోవడంతో రైతు అప్పుల ఊబిలోకి జారుకోవడం. భూసారం క్రమంగా నాశనంకావడం, భూగర్భజలాలు, పర్యావరణం కలుషితం కావడం ఇవే కాకుండా, పిచికారీ సమయంలో సరైన రక్షణ లేకపోవడం వల్ల రైతుల్లో శ్వాసకోస వ్యాధులు, చర్మసమస్యలు పెరుగుతున్నాయి. చివరికి ఆ విషపదార్థాలే మన ఆహారంలోకి చేరి సామాన్యుడి ఆరోగ్యానికీ ముప్పుగా మారుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న 1968 నాటి కీటక నాశిని చట్టం నేటి పరిస్థితులకు సరిపోవడం లేదు. నామమాత్రపుజరిమానాలు, బలహీన శిక్షలు నకిలీ మాఫియాకు ఎలాంటి భయం కలిగించలేకపో



యాయి. ఈ లోపాలను సరిదిద్దేందుకే కేంద్ర ప్రభుత్వం పురుగుమందుల నిర్వహణబిల్లు–2025ను తీసుకొచ్చింది. ఈ బిల్లుపై ఫిబ్రవరి 4లోపు అభిప్రాయాలు, సూచనలు పంపాలని కేంద్రం కోరింది. వ్యవసాయ రంగంలో తిష్టవేసిన నకిలీ మాఫియా అంతానికి ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ నూతన నిబంధనలు అన్నదాతకు కొండంత అండగా నిలుస్తున్నాయి. నకిలీలేదా నిషేధిత పురుగు మందుల తయారీ, విక్రయాలే లక్ష్యంగా విధిస్తున్న రూ.50లక్షల గరిష్ఠ జరిమానా, ఐదేళ్ల జైలుశిక్షవంటి నిబంధనలు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఇదికేవలం శిక్షమాత్రమే కాదు, నకిలీల సామ్రాజ్యాన్ని వేళ్లతోసహా పెకిలించే గట్టి హెచ్చరిక. క్యూఆర్ కోడ్ ఆధారిత ట్రేసిబిలిటీ వ్యవస్థ ద్వారా ప్రతి బాటిల్ ప్రయాణాన్ని తయారీ కేంద్రం నుండి రైతు పొలం వరకు డిజిటల్ పద్ధతిలో ట్రాక్ చేయడం సాధ్యమవుతుంది. ఈసాంకేతిక అడ్డుకట్టతో సరఫరా గొలుసులో నకిలీలు ప్రవేశించే అవకాశమే లేకుండా పోతుంది. నాణ్యతలేని మందుల వల్ల పంట నష్టపోతే, రైతు కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా నేరుగా కంపెనీలనుంచే పరిహారం పొందే వెసులుబాటు కల్పించడం ఒక విప్లవాత్మక మార్పు. ఇది రైతుకు ఆర్థిక భరోసాతో పాటు చట్టబద్ధమైన రక్షణను నిర్ధారిస్తుంది. కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, నిబంధనలు ఉల్లంఘించే డీలర్లు, తయారీదారుల లైసెన్సులను శాశ్వతంగా రద్దుచేసే అధికారం అధికారులకు ఇవ్వడం అభినందనీయం. ఈచర్య వ్యవసాయ ఇన్‌పుట్ల రంగంలో జవాబుదారీతనాన్ని పెంచి, నైతిక విలువలతో కూడిన వ్యాపారానికి మార్గం సుగమం చేస్తుంది. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల నియంత్రణకు చట్టాలు ఎన్ని కఠినంగా రూపొందించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతు అప్రమత్తతే అన్నింటికన్నా బలమైన రక్షణ కవచం. ప్రతికొనుగోలులోనూ పారదర్శకత ఉండాలి. కంపెనీ పేరు, బ్యాచ్ సంఖ్యస్పష్టంగా నమోదైన 'పక్కా బిల్లు' తీసుకోవడం రైతుబాధ్యత మాత్రమే కాదు, మోసపోతే పోరాడేందుకు ఒక ఆయుధం కూడా. డీలర్ల వ్యాపార ప్రయోజనాలకు ప్రభావితం కాకుండా, వ్యవసాయాధికారుల శాస్త్రీయ సలహాలకు పెద్దపీట వేయాలి. అనవసర రసాయనప్రయోగాలతో సాగును సంక్షోభంలోకి నెట్టుకోకుండా విజ్ఞతతో వ్యవహరించాలి. ఎక్కడ నకిలీల ఆనవాళ్లు కనిపించినా, వాటిని అధికా రుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా తనతో పాటు తోటిరైతుల ప్రయోజనాలను కాపాడే సామాజిక బాధ్యతను ప్రతి కర్షకుడు స్వీకరించాలి. అన్నదాతను పట్టి పీడిస్తున్న నకిలీల బెడదను అరికట్టడం వ్యవస్థల కర్తవ్యమే కాదు, సామాజిక బాధ్యత కూడా. చట్టాల అమలులో కఠినత్వం, కార్పొరేట్ శక్తుల ప్రలోభాల నుంచి రైతుకు రక్షణ కల్పించినప్పుడే సాగు లాభసాటిగా మారుతుంది. అవగాహనతో కూడిన శాస్త్రీయ సాగు వైపు రైతు అడుగులు వేయడమే 'రైతే రాజు' నినాదానికి అసలైన సార్థకత. ●



# ట్రంప్‌కు అల్జీమర్స్?

## మతిమరుపు లేదంటూనే ఆ వ్యాధి పేరు మర్చిపోయారు!

**వాషింగ్టన్, జనవరి 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం గురించి కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఆయన మతిమరుపు (అల్జీమర్స్)తో బాధపడుతున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్న విషయం విదితమే. పలు సందర్భాల్లో అధికారులను పేర్లను ఆయన మరిచిపోయారు. ఈ క్రమంలో న్యూయార్క్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనకు మతిమరుపు ఉందని సాగుతోన్న ప్రచారంపై అగ్రరాజ్యం అధినేత డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. తాను 40 యేళ్ల కిందట ఎలా ఉన్నానో ఇప్పుడూ అంతే పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని ఆయన స్పష్టం చేశారు. కానీ, తన తండ్రి అల్జీమర్స్‌తో బాధపడిన విషయం నిజమేనని అన్నారు. అయితే, తన తండ్రి ఆరోగ్యం గురించి మాట్లాడుతున్నప్పుడు 'అల్జీమర్స్' అనే పదాన్ని ఆయన గుర్తు చేసుకోవడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో ట్రంప్ ఆరోగ్యం, మానసిక పరిస్థితిపై మరోసారి చర్చను రేకెత్తించింది. ట్రంప్ తన తండ్రికి 'గుండె దడ' ఉందని, పెద్దగా ఆరోగ్య సమస్యలు లేవని, కానీ ఒక వ్యాధి మాత్రం ఉందని చెప్పారు. ఆయనకు సుమారు 86, 87 యేళ్ల వయసులో 'ఏమంటారు దాన్ని?' అని అడిగి, తన నుదుటిపై వేలుపెట్టి వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కారోలిన్ లీవిట్‌ను చూశారు. లీవిట్ 'అల్జీమర్స్' అని చెప్పగా.. 'మతిమరుపు లాంటిది. సరే, నాకు అది లేదు' అని ట్రంప్ అన్నారు. వంశపారంపర్యంగా వచ్చే వ్యాధుల గురించి ఆందోళన చెందుతున్నారా? అని ప్రశ్నించగా.. ట్రంప్ అలాంటిదేమీ లేదని కొట్టిపారేశారు. తన తండ్రి ఫ్లయిడ్ ట్రంప్ 1990లో అల్జీమర్స్ వ్యాధికి గురయ్యారని, 1999లో 93 యేళ్ల వయసులో మరణించే వరకు ఆ వ్యాధితో బాధపడ్డారని ఆయన గతంలోనే చెప్పారు. గతంలో అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడనెన్‌కు ఇలాంటి సమస్యే ఎదురయ్యింది. కాగా, ఈ ఇంటర్వ్యూ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన మాటల తడబాటునా లేక మానసిక సమస్యలకు సంకేతమా అని అనుమానిస్తున్నారు. కొందరు మాత్రం దీనిని కొట్టిపారేశారు అమెరికాలో సీనియర్ రాజకీయ నేతల మానసిక స్థితిపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. 78 యేళ్ల ట్రంప్.. తన ఫిట్‌నెస్ గురించి ఆందోళనలను పదేపదే కొట్టిపారేస్తూనే.. అద్భుతమైన శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉన్నానని, తాను 'ఎసిఇడి' చేసిన కాగ్నిటివ్ పరీక్షల గురించి తరచుగా చెప్పుకుంటారు.

## యుజిసి నిబంధనను సవాల్ చేస్తూ సుప్రీంలో పిటిషన్ - అత్యవసర విచారణకు ఓకే

**న్యూఢిల్లీ, జనవరి 28:** యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యుజిసి) ఇటీవల నోటిఫై చేసిన నిబంధనను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. యుజిసి తీసుకొచ్చిన తాజా నిబంధన కుల ఆధారిత వివక్షతో కూడుకున్నదని, సంస్థాగత రక్షణ నుండి కొన్ని వర్గాలను మినహాయించిందని పిటిషనర్ పేర్కొన్నారు. పిటిషన్‌ను విచారించాలని కోరుతూ న్యాయవాది వాదనలను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. "ఏమి జరుగుతుందో మాకు తెలుసు. లోపాలు నయం అయ్యేలా చూసుకోండి. తాము దానిని జాబితా చేస్తాము" అని సిజెఐ అన్నారు. వివక్ష ఫిర్యాదులను పరిశీలించడానికి, సమానత్వాన్ని ప్రోత్సహిం చడానికి అన్ని ఉన్నత విద్యా సంస్థలు "ఈక్విటీ కమిటీలు" ఏర్పాటు చేయాలని తప్పనిసరి చేస్తూ జనవరి 13న కొత్త నిబంధనలు నోటిఫై చేయబడ్డాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఉన్నత విద్యా సంస్థలలో ఈక్విటీ ప్రమోషన్) నిబంధనలు, 2026, కమిటీలలో ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి), షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి), వికలాంగులు, మహిళలు సభ్యులుగా ఉండాలని ఆదేశించింది.

## సంక్షిప్తంగా..

### లష్కరే హమాస్‌ల మధ్య బలపడుతున్న బంధం



**దోహా,జనవరి 28:** ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఉగ్రవాద సంస్థలు లష్కరే తోయిబా, హమాస్ మధ్య కొత్త బంధం బలపడుతున్నట్టు తెలుస్తోంది. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే కమాండర్ ఫైసల్ నదీమ్, హమాస్ అగ్ర నాయకుడు ఖలీద్ మషల్‌తో సమావేశమైనట్టు స్వయంగా అంగీకరించడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పరిణామం అంతర్జాతీయ భద్రతా వర్గాల్లో కొత్త ఆందోళనలకు దారితీసింది. ఈ సమావేశానికి సంబంధించిన విషయాలను ఫైసల్ నదీమ్ స్వయంగా ఓ వీడియోలో అంగీకరించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఖతార్ రాజధాని దోహాలో 2024లో ఈ భేటీ జరిగినట్టు అతడు వెల్లడించాడు. ఈ సమావేశంలో ఫైసల్ నదీమ్‌తో పాటు పహల్గామ్ ఉగ్రదాడి సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సైఫుల్లా కసూరి కూడా పాల్గొన్నాడు.

### యుఎస్ చట్టసభ ప్రతినిధి ఇల్హాన్ ఒమర్‌పై దాడి!



**వాషింగ్టన్, జనవరి 28:** అమెరికాలో రాజకీయ ఉద్రిక్తతలు మరోసారి వేడెక్కాయి. సోమాలియా మూలాలున్న యూఎస్ చట్టసభ సభ్యురాలు ఇల్హాన్ ఒమర్‌పై దాడి జరిగింది. మినియాపోలిస్‌లో ఆమె నిర్వహిస్తున్న టౌన్ హాల్ సమావేశంలో ఓ వ్యక్తి ఆమె ముఖంపై గుర్తుతెలియని ద్రవాన్ని సిరంజితో స్ప్రే చేశాడు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో సమావేశంలో ఒక్కసారిగా కలకలం రేగింది. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఇల్హాన్ ఒమర్ వేదికపై ప్రసంగిస్తుండగా, ఓ వ్యక్తి ఆమె వద్దకు వచ్చి సిరంజితో ద్రవాన్ని స్ప్రే చేశాడు. అక్కడే ఉన్న మినియాపోలిస్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, థర్డ్‌డిగ్రీ అసాల్ట్ కింద కేసు నమోదు చేశారు. ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని ద్రవాన్ని పరీక్ష కోసం సేకరించారు.

## కుట్రకోణం లేదు.. ముమ్మాటికీ ప్రమాదమే.. శరద్‌పవార్!

### ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిందే.. విపక్ష నేతలు



**న్యూఢిల్లీ,జనవరి 28:** మహారాష్ట్ర డిప్యూటి ముఖ్యమంత్రి అజిత్‌పవార్‌తోపాటు మరో నలుగురు దుర్మరణం పాలయిన విమాన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్‌చేస్తుంటే అజిత్ బాబాయి ఎన్సీపీ అధినేత శరద్‌పవార్‌మాత్రం ఇది ఎంతమాత్రం కుట్రకాదని, కుట్రకోణంగా భావించలేమని, ప్రమాదవశాత్తూ జరిగిందేనని స్పష్టంచేసారు. అజిత్ అకాల మరణంతోమహారాష్ట్రకు ఎంతో నష్టంజరిగిందని ఒక సమర్థుడైన నాయకుడు మమ్మల్ని వీడి వెళ్లిపోయాడని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. ఒక గొప్ప వ్యక్తిని మహారాష్ట్ర కోల్పోయిందని, ఆయన మృతి ద్వారా ఏర్పడిన నష్టం ఎప్పటికీ భర్తీకాలేనిదని శరద్‌పవార్ అన్నారు. మనచేతుల్లో ఏమీ ఉండదని, ఏమీచేయలేమని, కేవలం విచారం మాత్రమే మిగిలిందన్నారు. అయితే రాజకీయాలకు అతీతంగా మాట్లాడాలని ఎంతమాత్రం కుట్రలేదని, ఖచ్చితంగా విమానప్రమాదమేనని అన్నారు. అయితే ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే మాత్రం సమగ్ర దర్యాప్తు జరిపించాలనిడిమాండ్‌చేసారు.

### పిన్నవయసులోనే వాణిజ్యవిమానాలు నడిపిన పైలట్ శాంభవిపాథక్



**ముంబయి,జనవరి 28:** మహారాష్ట్రలోని బారామతిలో కూలిపోయిన విమానంలో మృతి చెందిన పైలట్‌లలో కెప్టెన్ శాంభవీ పాఠక్ ఒకరు. కెప్టెన్ శాంభవి పాఠక్ ఆ విమానంలో ఫస్ట్ ఆఫీసర్ (కొన్ని సందర్భాల్లో కోపైలట్ అంటారు)గా పని చేస్తున్నారు. చిన్న వయస్సులోనే కమర్షియల్ విమానాలు నడిపే లైసెన్స్ పొందారు. ఢిల్లీలోని ఎయిర్ ఫోర్స్ బాలభారతి పాఠశాలలో విద్యార్థినిగా శాంభవి పాఠక్ తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 2016-18లో సెకండరీ స్కూల్ పూర్తయ్యాక ముంబై యూనివర్సిటీ నుంచి ఏరోనాటిక్స్, ఏవియేషన్, ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీని పొందారు. వాణిజ్య విమానాల శిక్షణ కోసం ఆమె న్యూజిలాండ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ పైలట్ అకాడమీలో చేరారు.

# సంజయ్ నుంచి అజిత్ దాకా..

## ఆకాశంలో ప్రమాదాలు - రాజకీయ విషాదాలు

## వైఎస్సార్, విజయ్‌రూపాని, బాలయోగి ప్రభృతుల దుర్మరణం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి28:** భారతదేశ చరిత్రలో చోటుచేసుకున్న పలు విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టాయి. ఈ దుర్ఘటనల్లో రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, సినీ ప్రముఖులు సహా అనేకమంది ప్రముఖులు తమ ప్రాణాలను కోల్పోయారు. తాజాగా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో ల్యాండింగ్ అవుతుండగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తోపాటు మరో ఐదుగురు మృతి చెందారు. ఈ నేపథ్యంలో, ఇప్పటివరకు విమాన ప్రమాదాల్లో మరణించిన ప్రముఖులపై ఒకసారి చూద్దాం. వారిని మరోసారి తలుచుకుందాం.

**విజయ్ రూపానీ-2025:**



గతేడాది అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం కూలిపోయిన ఘటనలో మరణించిన వారిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. 68 ఏళ్ల రూపానీ లండన్‌లో నివసిస్తున్న ఆయన కుమార్తె రాధికను కలిసేందుకు జూన్ 12న అహ్మదాబాద్ నుంచి బయలుదేరారు. దోర్జీ ఖండు -2011:-

అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి దోర్జీ ఖండు ఏప్రిల్ 30, 2011న హెలికాప్టర్ కూలిపోవడంతో మరణించారు. చైనా సరిహద్దుకు సమీపంలో తవాంగ్ నుంచి ఇటానగర్‌కు ప్రయాణిస్తున్న సమయంలో వెస్ట్ కామెంగ్ జిల్లాలో ఈ ప్రమాదం జరిగింది. ఐదు రోజుల తర్వాత శిథిలాలను గుర్తించారు.

**వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 2009:**



ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సెప్టెంబర్ 2, 2009న నల్లమల కొండలలో బెల్-430 హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. నల్లమల అటవీ ప్రాంతంలో ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ అదుపుతప్పి కూలిపోయింది. విస్తృతంగా గాలించడంతో ఒకరోజు తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది.

**ఓం ప్రకాశ్ జిందాల్, సురేందర్‌సింగ్-2005:**



పారిశ్రామికవేత్త ఓం ప్రకాశ్ జిందాల్ మరణం ప్రముఖ పారిశ్రామికవేత్త, హరియాణా మంత్రి ఓం ప్రకాశ్ జిందాల్ 2005 మార్చి 31న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. దిల్లీ నుంచి చండీగఢ్‌కు వెళ్తుండగా, ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్ సమీపంలో హెలికాప్టర్ కూలిపోయింది. మాజీ కేంద్ర మంత్రి సురేందర్ సింగ్ మార్చి 31, 2005న ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.

**సైప్రియన్ సంగ్మా-2004:** మేఘాలయ గ్రామీణాభివృద్ధి మంత్రి సిప్రియన్ సంగ్మా 2004లో జరిగిన పవన్ హాన్స్ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. 2004, సెప్టెంబర్ 22న గౌహతి నుంచి షిల్లాంగ్ వెళ్తున్న హెలికాప్టర్ బారపాణి సరస్సు సమీపంలో కూలిపోయింది. ఈ ప్రమాదంలో సంగ్మాతో పాటు మరో తొమ్మిది మంది మరణించారు.

**జిఎంసి బాలయోగి -2002:**



లోక్‌సభ స్పీకర్, టీడీపీ నాయకుడు జీఎంసీ బాలయోగి మార్చి 3, 2002న ఆంధ్ర ప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలో హెలికాప్టర్ కూలిపోవడంతో మరణించారు. యాంత్రిక లోపం కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు తేల్చారు. భీమవరం నుంచి బయలుదేరిన ప్రైవేట్ హెలికాప్టర్ కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని చెరువులో కూలిపోయింది.

**మాధవరావు సింధియా -2001:** గ్వాలియర్ రాజ కుటుంబ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి మాధవరావు సింధియా విమాన ప్రమాదంలో 2001 సెప్టెంబర్ 30న కన్నుమూశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు ఎన్నికల సభకు వెళ్తుండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన ప్రయాణిస్తున్న 10 సీట్ల ప్రైవేట్ విమానం మైన్‌పురి సమీపంలో కూలిపోయింది.

**సంజయ్ గాంధీ-1980:**



సంజయ్ గాంధీ ఏరోబాటిక్స్ చేస్తుండగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ 1980 జూన్ 23న విమాన ప్రమాదంలో మరణించారు. అనుభవజ్ఞుడైన పైలట్ అయిన ఆయన, దిల్లీ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన చిన్న విమానంలో సఫ్దర్‌జంగ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఏరోబాటిక్స్ చేస్తుండగా అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోయి కూలిపోయారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. 1977లో ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై జరిగిన హత్యాయత్నం నుంచి తప్పించుకున్నప్పటికీ, ఈ ప్రమాదం నుంచి మాత్రం బయటపడలేకపోయారు.

**గుర్నామ్ సింగ్-1973**

పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి గుర్నామ్ సింగ్ మే 31, 1973న ఢిల్లీలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించారు.

**బల్వంత్ రాయ్ మెహతా-1965:**

గుజరాత్ రెండో ముఖ్యమంత్రి అయిన బల్వంత్ రాయ్ మెహతా 1965 ఇండోపాకిస్థాన్ యుద్ధ సమయంలో మరణించారు. సరిహద్దు సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న పౌర విమానాన్ని పాక్ వైమానిక దళం పొరపాటున యుద్ధ విమానంగా భావించి పేల్చేసింది. పైలట్ల తప్పిదం హోమీ బాబా విమానం క్రాష్ భారత అణు కార్యక్రమానికి పునాది వేసిన



మహానుభావుడు డాక్టర్ హోమీ భాభా. 1966 జనవరి 24న ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా ఫ్లైట్-101 స్విట్జర్లాండ్‌లోని మోంట్ బ్లాంక్ పర్వత శ్రేణుల్లో కూలిపోయింది. పైలట్లు, జెనీవా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మధ్య సమన్వయ లోపమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని దర్యాప్తులో తేలింది. సినీ లోకాన్ని శోకసంద్రంలో ముంచిన ప్రమాదం

**సినీ నటి సౌందర్య**




2004 ఏప్రిల్ 17న విమాన ప్రమాదంలో మృతి చెందారు. బెంగళూరు జక్కూర్ ఎయిర్‌ఫీల్డ్ నుంచి కరీంనగర్‌కు బయలు దేరిన సెస్నా సింగిల్ ఇంజిన్ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. అప్పటికి ఏడు నెలల గర్భిణిగా ఉన్న ఆమెతో పాటు నలుగురు ఈ ప్రమాదంలో మరణించారు. **బిపిన్ రావత్:** భారత తొలి సీడీఎస్‌కు దేశం నివాళి భారతదేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ 2021 డిసెంబర్ 8న హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు.

సూలూర్ నుంచి వెల్లింగ్టన్‌కు వెళ్తుండగా, తమిళనాడులోని కూనూర్ సమీపంలో హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన భార్యతో పాటు మరో 11 మంది మరణించారు.

# మహారాష్ట్రలో ముగిసిన అజిత్‌పవార్ శకం!

## రాజకీయ వ్యూహాలకు పెట్టిందిపేరుగా అజిత్..

**ముంబయి, జనవరి 29:** మహారాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన అజిత్‌పవార్ అంచలంచెలుగా ఎదిగి డిప్యూటీ సీఎం పదవి అధిష్ఠించారు. సహకార చక్కెర కర్మాగారం పాలక మండలిలో సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టిన అజిత్ సవాళ్లు ఎదురైనా ఎదుర్కొని నిలిచారు. 2023 జులై 1 వరకు శరద్ పవార్ అడుగు జాడల్లోనే అజిత్ నడిచారు. కానీ 2023 జులై 2న బాబాయికి చెందిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) ఎమ్మెల్యేలను, పార్టీ గుర్తును హస్తగతం చేసుకున్నారు. 1982 నుంచి 2023 జులై 2 మధ్యకాలంలో మహారాష్ట్ర పాలిటిక్స్‌లో అజిత్ పవార్ మంచి పేరును సాధించారు. రాజకీయ విధేయతకు, రాజకీయ చతురతకు మారుపేరుగా నిలిచారు. అజిత్ పవార్ మహారాష్ట్రలోని అతిపెద్ద జిల్లా అహ్మద్‌నగర్‌లోని దేవ్‌లాలి ప్రవర గ్రామంలో 1959 జులై 22న జన్మించారు. అజిత్ పవార్ తండ్రి పేరు అనంతరావు పవార్. శరద్ పవార్ సొంత అన్నయ్యే ఈ అనంతరావు పవార్. అజిత్ పవార్ రాజకీయ గురువు శరద్ పవారే. శరద్ పవార్ రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీతో మొదలైంది. పవార్ కుటుంబానికి నేటికీ మహారాష్ట్రలోని పుణె, సతారా, సంగ్లి, కొల్హాపూర్, సోలాపూర్, అహ్మద్ నగర్ జిల్లాలపై మంచి పట్టు ఉంది. పుణె జిల్లాలోని బారామతిపై తొలుత అజిత్ పవార్ ఫోకస్ చేశారు. అక్కడి చక్కెర ఫ్యాక్టరీలు, పాల యూనియన్లు, స్థానిక సహకార బ్యాంకులలో పరిచయాలను పెంచుకున్నారు. వాటన్నింటిని వినియోగించుకొని 1982లో ఒక సహకార చక్కెర కర్మాగారం పాలక మండలి ఎన్నికల్లో పోటీ 1991లో పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ పాలకమండలి ఛైర్మన్‌గా అజిత్ ఎన్నికయ్యారు. ఆ పదవిలో ఏకంగా 16 ఏళ్లపాటు కొనసాగారు. 1991లో అజిత్ పవార్‌కు బాబాయి శరద్ పవార్ బంపర్ అవకాశాన్ని కల్పించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బారామతి లోక్‌సభ టికెట్ దొరికేలా ఏర్పాట్లు చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆ ఎన్నికల్లో గెలిచి అజిత్ ఎంపీ అయ్యారు. ఆ ఎన్నికల్లో కేంద్రంలో పీవీ నర్సింహారావు సారథ్యంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడింది. శరద్ పవార్‌కు కేంద్ర మంత్రి పదవిని ఆఫర్ చేశారు. ఈ కారణంగా బాబాయి కోసం తన ఎంపీ సభ్యత్వానికి అజిత్ పవార్ వెంటనే రాజీనామా చేశారు. బారామతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో శరద్ పవార్ పోటీ చేసి ఎంపీ అయ్యారు. ఆ వెంటనే పీవీ నర్సింహారావు సర్కారులో రక్షణ మంత్రి పదవిని శరద్ పవార్ దక్కించుకున్నారు. బారామతి



లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు బారామతి అసెంబ్లీ స్థానానికి శరద్ పవార్ రాజీనామా చేశారు. శరద్ పవార్ తనకెంతో ప్రియమైన ఈ అసెంబ్లీ సీటును అజిత్ చేతిలో పెట్టారు. ఎందుకంటే శరద్ పవార్ రాజకీయ ఎదుగుదలకు ఆ సీటే ప్రధాన కారణమైంది. బారామతి నుంచి అజిత్ వరుసగా 7 సార్లు ఎమ్మెల్యే అయ్యారు. తొలిసారి 1991 బారామతి అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఆయన గెలిచాక, నాటి మహారాష్ట్ర ప్రభుత్వంలో వ్యవసాయ, ఇంధన శాఖ సహాయ మంత్రి పదవి దక్కింది. 1992లో శరద్ పవార్ మహారాష్ట్ర సీఎం అయ్యారు. ఈ టర్మ్‌లో రాష్ట్ర ప్రణాళిక, ఇంధన, నేల సంరక్షణ శాఖ సహాయ మంత్రి పదవిని అజిత్ పొందారు. శరద్ పవార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికొచ్చి 1999 జూన్ 10న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)ని ఏర్పాటు చేసుకున్నారు. 1999లో మహారాష్ట్రలో ఏర్పడిన కాంగ్రెస్ ఎన్‌సీపీ సంకీర్ణ సర్కారులో సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఆయనకు ఛాన్స్ లభించింది. 2004లోనూ కాంగ్రెస్ ఎన్‌సీపీ సంకీర్ణ సర్కారే ఏర్పడింది. అందులోనూ అజిత్‌కు మంత్రి పదవి వచ్చింది. ప్రభుత్వ విధానాల రూపకల్పన, ఆర్థిక ప్రణాళికల రచన, సాగునీటి పారుదల వ్యవహారాల కసరత్తు, గ్రామీణ వికాసంపై కార్యాచరణ వంటి వాటిపై అజిత్‌కు మంచి పట్టు ఉంది. ఓ వైపుగా మంత్రి పదవులను పొందుతూనే, మరోవైపు పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతంలో ఎన్‌సీపీ బలోపేతానికి ఆయన పాటుపడ్డారు. ఆరుసార్లు డిప్యూటీ సీఎం మహారాష్ట్రలో అత్యధిక కాలం పాటు డిప్యూటీ సీఎంగా సేవలు అందించిన రికార్డు అజిత్ పవార్ పేరిటే ఉంది. ఇప్పటివరకు ఆయన 6సార్లు డిప్యూటీ సీఎంగా పనిచేశారు. ఏకంగా ఆరుసార్లు లభించింది అంటే అజిత్ పవార్ రాజకీయ వ్యూహాలు ఇట్టే అర్థం అవుతాయి. రాష్ట్ర రాజకీయ సమీకరణాలపై ఆయనకు ఉన్న లోతైన అవగాహనకు ఈ ఇదే ప్రతీక. దురదృష్టవశాత్తు ఇప్పుడు ఆరోసారి డిప్యూటీ సీఎంగా ఉండగా విమాన ప్రమాదంలో బుధవారం ఉదయం అజిత్ చనిపోయారు. డిప్యూటీ సీఎంగా అజిత్ పవార్ 2010 నవంబరు - 2012 సెప్టెంబరు, 2012 అక్టోబరు - 2014 సెప్టెంబరు, 2019 నవంబరు 23 - 2019 నవంబరు 26, 2019 డిసెంబరు - 2022 జూన్2023 జులై - 2024 డిసెంబరు, 2024 డిసెంబరు 5 - 2026 జనవరి 28 మొత్తం ఆరుసార్లు నిర్వహించిన ఘనత ఆయనదే అయితే ఆయనకు సీఎం కావాలన్న లక్ష్యం కలగానే మిగిలిపోయింది. అజిత్ పవార్‌కు భార్య సునేత్రా పవార్, ఇద్దరు కుమారులు పార్థ పవార్, జై పవార్ ఉన్నారు. ప్రస్తుతం సునేత్రా పవార్ రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. పెద్ద కుమారుడు పార్థ పవార్ 2019 లోక్‌సభ ఎన్నికల్లోనే రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. మావల్ లోక్‌సభ సీటు నుంచి పోటీచేసి ఆయన ఓడిపోయారు. చిన్న కుమారుడు జై పవార్ కుటుంబ వ్యాపారాలు చూసుకుంటున్నారు. 2024 నుంచి ఈయన కూడా రాజకీయాలపై ఫోకస్ పెడుతున్నారు.

## 'మీ విశ్వసనీయ ప్రభుత్వం' అజిత్ పవార్ చివరి ఎక్స్ పోస్ట్

**ముంబయి, జనవరి 28:** విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయిన వేళ చివరిసారిగా ఆయన చేసిన సోషల్ మీడియా పోస్ట్ వైరల్‌గా మారింది. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రమాదం జరగడానికి కొన్ని గంటల ముందు అజిత్ పవార్ మహారాష్ట్ర ప్రజలకు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో భాగంగా ' మీ విశ్వసనీయ ప్రభుత్వం' తీసుకున్న పలు ముఖ్యమైన నిర్ణయాలు అని పేర్కొంటూ రాష్ట్రంలో వృత్తి శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయడం, కాంట్రాక్టర్ల చెల్లింపు వ్యవస్థల్లో మార్పులు చేయడం, ప్రైవేట్ కంపెనీలకు కేటాయించిన ప్రభుత్వ భూమి లీజు కాలాల పొడిగింపు వంటి విషయాలను వెల్లడించారు. త్వరలో ముంబయి, పుణె సహా పలు నగరాల్లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను అజిత్ పవార్ వెల్లడించారు. తన సోదరుడు, మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్ అకాల మరణంతో తాను తీవ్ర షాక్‌కు గురయ్యానని ఎన్సీపి ఎంపి సుప్రియా సూలే పేర్కొన్నారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే అజిత్ సతీమణి సునేత్ర, కుమారుడు పార్థ్‌తో కలిసి మృతదేహాన్ని తరలించిన ఆసుపత్రికి వెళ్లారు.

## పెద్ద సాంకేతిక లోపం తలెత్తితేనే విమానం క్రాష్ ల్యాండింగ్: నిపుణులు

**న్యూఢిల్లీ, జనవరి 28:** మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన ఘోర విమాన ప్రమాదం విషాదాన్నినింపింది. ఈ ప్రమాదంలో ఆ రాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్, మరో నలుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విమానయాన రంగ నిపుణులు మాట్లాడుతూ అన్ని రకాల విమానాలకు ఫ్లైట్ సేఫ్టీ నిబంధనలు ఒకేలా ఉంటాయని చెప్పారు. ఇలాంటి ఘటనలకు ఎక్కువగా వాతావరణ, సాంకేతిక అంశాలే కారణమై ఉంటాయని తెలిపారు. బారామతిలో ప్రమాదానికి గురైన లియర్ జెట్ 45 చిన్న చార్టర్డ్ విమానం. దీనిలో గరిష్ఠంగా 9 మంది ప్రయాణించే వీలుంటుంది. దీనిలో భద్రతా ప్రమాణాలు ఉన్నతంగా ఉంటాయి. వాతావరణ సమస్యలతో పాటు పెద్ద సాంకేతిక లోపం తలెత్తితేనే క్రాష్ ల్యాండింగ్ చేస్తారు. అలా చేయడంతోనే విమానం రన్‌వే పక్కకు వెళ్లి కూలినట్లు తెలుస్తోంది. పైలట్లు, విమానాన్ని తప్పనిసరిగా చెక్ చేసిన తర్వాతే బయల్దేరేందుకు క్లియరెన్స్ ఇస్తారు. బ్లాక్ బాక్స్‌లోని కాక్‌పిట్ వాయిస్ రికార్డును విశ్లేషిస్తారు. మరికొద్దిరోజుల్లో కారణాలు వెల్లడయ్యే అవకాశముందంటూ విశ్రాంత ఐఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. విఐపిలు, వివిఐపిలు ప్రయాణించే విమానాలు బయల్దేరే ముందు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. విమానం గాల్లో ఉన్నప్పుడే రెడ్ రాడార్ వార్నింగ్ వస్తే వెనక్కి రావాలి. కొంతమంది విఐపిలు వాళ్ల షెడ్యూల్ కారణంగా ముందుకు వెళ్లేందుకు మొగ్గు చూపడంతో పైలట్లపై పొగమంచు, ఇతర వాతావరణ సమస్యలు తలెత్తినపుడు పైలట్ల దృష్టి, వినికిడి అంశాల్లో ఫోకస్ మారుతూ ఉంటుంది. అలాంటి సమయంలో నిర్ణయాన్ని వాళ్ల విచక్షణకే వదిలేయాలి అంటూ మరో అధికారి వివరించారు.

## రన్‌వేపై వెలుతురు సరిగా లేకపోవడమే కారణం..

### అజిత్ పవార్ విమాన ప్రమాదంపై స్పందించిన మంత్రి రామ్మోహన్‌నాయుడు



**న్యూఢిల్లీ, జనవరి 28:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం ప్రమాదానికి గురైన ఘటనపై పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందించారు. ప్రాథమిక సమాచారం మేరకు ప్రమాద సమయంలో బారామతి ఎయిర్‌పోర్టులో విజిబులిటీ చాలా తక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. రన్‌వే కనిపిస్తుందా? లేదా అని పైలట్లను బారామతి ఎటిసి అధికారులు అడిగారని, కనిపించడంలేదనే సమాధానం వచ్చిందన్నారు. దాంతో విమానం గాల్లో కొంతసేపు చక్కర్లు కొట్టినట్లు కేంద్ర మంత్రి వివరించారు. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో రన్‌వే కనిపిస్తుందా? అని ఎటిసి అడిగినప్పుడు పైలట్లు సానుకూలంగా స్పందించారని తెలిసిందన్నారు. దీంతో ల్యాండింగ్ కోసం ఎటిసి క్లియరెన్స్ ఇచ్చిందని ఆ వెంటనే విమానం కూలిపోయిందన్నారు. ఈ ఘటనపై మరింత సమాచారం కోసం చూస్తున్నామని, దీనిపై పారదర్శకంగా దర్యాప్తు చేపడతామన్నారు. ఇందుకోసం ఇప్పటికే డిజిసిఎ, ఎఎఐబి బృందాలు పుణె చేరుకున్నాయని కేంద్ర మంత్రి వెల్లడించారు. డిజిసిఎ వర్గాలు స్పందిస్తూ ల్యాండింగ్ సమయంలో రన్‌వేను గుర్తించడంలో పైలట్లకు ఇబ్బందులు ఎదురైనట్లు పేర్కొన్నాయి.

# మేడారం మహాజాతరకు ఇబ్బందులు లేకుండా చర్యలు

## భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండు గగా పేరున్న మేడారం మహాజాతరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మేడారం జాతరకు హాజరయ్యే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించినట్టు మంత్రి స్పష్టం చేశారు. బుధవారం నుంచి నిర్వహిస్తున్న సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా రాష్ట్ర ప్రజానీకానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దేవతలైన సమ్మక్క-సారలమ్మలు ధైర్యసాహసాలు, త్యాగస్ఫూర్తి, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందిన మేడారం మహాజాతర తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించే మహోత్సవమన్నారు. ఈ పవిత్ర మహోత్సవం సందర్భంగా సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరి కుటుంబాల్లో ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో మేడారం మహాజాతరకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టామన్నారు. రూ.250 కోట్ల నిధులు కేటాయించి మౌలిక వసతులు, త్రాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం, రవాణా, విద్యుత్, భద్రతను మరింత బలోపేతం చేశామన్నారు. జాతరకు భారీగా తరలివచ్చే భక్తుల దృష్ట్యా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు అమలు చేస్తున్నామని, పార్కింగ్ సదుపాయాలు విస్తరించినట్లు మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జాతర సందర్భంగా గిరిజన సంప్రదాయాలు, ఆచారాలు ఎక్కడా భంగం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, భక్తుల భద్రత దృష్ట్యా పోలీస్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. భక్తులు శాంతియుతంగా, క్రమశిక్షణతో జాతరలో పాల్గొని దైవ దర్శనం చేసుకోవాలని భక్తులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ర్యాగ అరుణ్‌కుమార్, నీల వెంకటేష్, గుజ్జ సత్యం తదితరులు

# కోర్టు తీర్పు వచ్చాకే ఎన్నికలు జరపాలి

## బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 28, ప్రభాతవార్త:** మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దగా, మోసం చేసి గొంతు కోసిందని రాజ్యసభ సభ్యుడు, బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య ధ్వజమెత్తారు. గతంలో 34 శాతం రిజర్వేషన్‌లు అమలు చేసి ప్రస్తుతం 28 శాతానికి తగ్గిస్తారా ! ఇది మోసం, దగా కాదా? అని ప్రశ్నించారు. ఒకవైపు కోర్టులో కేసు కొనసాగుతున్నదని, తీర్పు రాకముందే ఏమంతా తొందర వచ్చిందని హడావుడిగా ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడం అవసమా ?, ఇది దారుణమన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 15 బిసి సంఘాల సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రాజకీయంగా బిసిలను అణిచివేయాలనే కుట్రతో రిజర్వేషన్‌లను అమలు చేయకుండా తొక్కి పెడుతున్నదని ఆరోపించారు. రెండేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని, ఈ 42 శాతం రిజర్వేషన్‌లు అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర కోట్ల మంది బిసిలు ఆందోళనలు చేపట్టి, 'రాష్ట్ర బంద్' చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇక బిసిలు సహించేపరిస్థితి లేరని, తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని, మిలటెంట్ ఉద్యమాలకు సిద్ధమవుతున్నారని ఆయన హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తరువాతే మున్సిపల్, కార్పోరేషన్‌లకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ బిసి సంఘాల నాయకులు నీల వెంకటేష్, పగిళ్ల సతీష్, గుజ్జ సత్యం, అనంతయ్య, సి.రాజేందర్, అనురాధ, సుప్రజ, మోదీ రాందేవ్, రాజు నేత, చిక్కుడు బాలయ్యముదిరాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# వ్యవసాయ శాఖ అధికారులకు బిఐఎస్ సామర్థ్య నిర్మాణ శిక్షణ




**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** వ్యవసాయ శాఖ అధికారులకు సామర్థ్య నిర్మాణ శిక్షణా కార్యక్రమాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్), హైదరాబాద్ నిర్వహించింది. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలోని ప్రిన్సిపల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారుల కోసం సామర్థ్య నిర్మాణ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం విజయవంతంగా నిర్వహించింది. వ్యవసాయ రంగానికి సంబంధించిన భారతీయ ప్రమాణాలు, నాణ్యత హామీ పద్ధతులపై అవగాహన కల్పించడం, అవగాహన పెంచడం ఈ కార్యక్రమం లక్ష్యం. శిక్షణా కార్యక్రమంలో రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల నుండి దాదాపు 65 మంది అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ అభివృద్ధి, మార్కెటింగ్‌లో ప్రామాణీకరణ, నాణ్యతా వ్యవస్థల పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. బిఐఎస్ హైదరాబాద్ బ్రాంచ్ ఆఫీస్ డైరెక్టర్ పి.వి. శ్రీకాంత్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో నాణ్యత, భద్రత స్థిరత్వాన్ని నిర్ధారించడంలో బిఐఎస్ కీలక పాత్రను పోషిస్తుందన్నారు. ప్రమాణాలను స్వీకరించడం రైతులకు, వినియోగ దారులకు మొత్తం సరఫరా గొలుసుకు సహాయపడుతుందన్నారు. ఇండియన్ స్టాండర్డ్ సర్టిఫైడ్ ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పంట ఉత్పత్తి నుండి పంటకోత తర్వాత నిర్వహణ, నిల్వ, మార్కెటింగ్ వరకు ప్రతి దశలోనూ భారతీయ ప్రమాణాలను ఖచ్చితంగా పాటించడం సురక్షితమన్నారు. సమర్థవంతమైన, స్థిరమైన వ్యవసాయ పర్యావరణ వ్యవస్థను సాధించడానికి బిఐఎస్ అవసరమని తెలిపారు. ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ బి.వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో భారతీయ ప్రమాణాల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించారు, ప్రామాణీకరణ మెరుగైన ఉత్పాదకత, నాణ్యత హామీ, వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ ప్రాప్యతకు దోహదపడుతుందన్నారు. క్షేత్ర స్థాయి, పర్యవేక్షక అధికారులలో సామర్థ్యాన్ని పెంపొందించడానికి బిఐఎస్ ఇటువంటి చొరవ తీసుకున్నందుకు ఆయన అభినందించారు.

# బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలి

## విద్యాశాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సిఎస్ రామకృష్ణారావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 28:** ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలలో బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల స్థాయి వరకు ప్రతి విద్యా సంస్థలోను మెరుగైన బోధన సాగాలని, విద్యా బోధనలలో నాణ్యత ప్రమాణాలు పెంచే దిశగా కార్యాచరణ రూపొందిం చుకోవాలని సిఎస్ ఆదేశించారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విద్యాశాఖపై సంబంధిత ఉన్నతాధికారులతో బుధవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, డిజిటల్ విద్య, ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీల్లో పనితీరు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, తదితర అంశాలపై సమీక్ష చేశారు.

ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో బోధన చేసి రిటైర్డ్ అయిన మంచి అనుభవం కలిగిన ప్రొఫెసర్స్, లెక్చరర్స్, టీచర్స్‌తో విద్యార్థులకు తరుచుగా ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బోధన చేయిస్తే విద్యార్థులలో సృజానాత్మకత, మోటీవేషన్, మంచి ఆలోచనలు పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించి ప్రణాళికలు ఏర్పరచుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. అదే విధంగా కేజీబివి, వివిధ సంక్షేమ వసతి గృహాలలో ఒక వసతి గృహాన్ని ఎంపిక చేసుకొని అందులో సోలార్ మోడల్ తరహా కిచెన్, స్టోరేజ్ రూమ్స్, మౌలిక వసతులు, త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, ఇంటర్నెట్ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి దానిని ఒక మోడల్ హాస్టల్ గా రూపొందించాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దానిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌లో మిగితా వసతి గృహాలలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలల స్థాయిలో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని, బి.ఇడి కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం క్రింద ప్రభుత్వ పాఠశాలలో బోధన చేయించాలని, విద్యార్థులలో ఆసక్తి, నైపుణ్యాలు పెంచే విధంగా అనుభవం కలిగిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, మార్గదర్శకులతో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా, పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ వ్యవస్థలో వేగవంతమైన అభివృద్ధిని స్వాగతించిన అడ్వకేట్లు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సమక్షంలో పెద్దఎత్తున న్యాయవాదులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో పెద్దఎత్తున జూనియర్ న్యాయవాదులు, సీనియర్ న్యాయవాదులు, అదేవిధంగా వారి బంధుమిత్రులు బిజెపిలో చేరడం సంతోషకరమని అన్నారు. భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం సుపరిపాలన, సంక్షేమ పథకాలు, కార్యక్రమాల పట్ల ఆకర్షితులై బిజెపిలో పెద్దఎత్తున చేరికలు జరిగాయని పేర్కొన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం భారతదేశంపై పాలన చేయాలనుకున్న సమయంలో అనేక చట్టాలను తీసుకువచ్చింది. ఐపిసి, సిఆర్‌పిసి, వంటి చట్టాలు మనపై అమలు అయ్యాయని గుర్తు చేశారు. ఈ కోలోనియల్ మైండ్‌సెట్‌ను మార్చడానికి గతంలో ప్రభుత్వాలు ప్రయత్నించలేకపోయాయని గుర్తుచేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రిటీష్ కాలం నాటి చెల్లని చట్టాలను భారతీయ పద్ధతికి అనుగుణంగా మార్చడం జరిగిందని వెల్లడించారు. న్యాయ వ్యవస్థలో వేగవంతమైన అభివృద్ధిని చూసి అడ్వకేట్లు, సమాజం దీనిని స్వాగతించారని ఆయన గుర్తుచేశారు. పెండింగ్ కేసులు పరిష్కరించడం, ఖాళీగా ఉన్న జడ్జ్ పోస్టులను వేగవంతంగా భర్తీ చేయడం మోడీ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఖాళీగా ఉన్న జడ్జ్ పోస్టులను ఆలస్యం లేకుండా నింపడం జరుగుతున్నట్లు రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణలో దాదాపు 150 మంది యువ న్యాయవాదులు, ముఖ్యంగా సీనియర్ అడ్వకేట్లతో పాటు కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌లో అవకాశం పొందారని తెలిపారు. వెనుకబడిన, పేద వర్గాలకు పెద్దపీట వేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమయ్యా యని, బిజెపి అన్ని సీట్లలో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించడమే పార్టీ లక్ష్యమని రాంచందర్ రావు తెలిపారు. రాష్ట్రంలో గతంలో ప్రజలు బిఆర్ఎస్‌కు, తరువాత కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని, కానీ రెండు పార్టీలు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచాయని విమర్శించారు. మాటలకే పరిమితమైన పాలన చేశారని, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు - ఏ వర్గానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయలేదని పేర్కొన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ పాలనలో తీవ్రంగా విఫలమయ్యాయని విమర్శించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కారణంగా బీహార్, హర్యాన, మహారాష్ట్ర రాష్ట్రాల్లో బిజెపి విజయాలు సాధించిందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంతో మోడీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి పునాది వేస్తామని అన్నారు.

# కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్యం స్వల్ప మెరుగుదల

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 28, ప్రభాతవార్త:** నిజామాబాద్‌లో గంజాయి ముఠా దాడిలో గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితిలో స్వల్ప మెరుగుదల కనిపిస్తుందని నిమ్స్ వైద్యులు బుధవారం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో తెలిపారు. పరిస్థితి కొంత మెరుగుపడినప్పటికి సౌమ్య ఆరోగ్యం అత్యంత విషమంగానే ఉందన్నారు. అత్యవసర వైద్య విభాగం, నెఫ్రాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ, కార్డియోథోరాసిక్ సర్జరీ విభాగ నిపుణులు కలిసి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# 23 నుంచి ఎడ్‌సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

## 20న నోటిఫికేషన్ జారీ.. మే 12న పరీక్ష

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిఈడి కాలేజీల్లో చేరడానికి నిర్వహించే ఎడ్ సెట్-2026కి సంబంధించిన దర ఖాస్తులను ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 20న జారీ చేయనున్నట్లు ఎడ్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ బి వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. ఎడ్‌సెట్-2026 పరీక్షను కాకతీయ యూనివర్సిటీ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఎడ్‌సెట్ మొదటి కమిటీ సమావేశం బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె ప్రతాప్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, ఎడ్ సెట్-2026 కన్వీనర్ భైరు వెంకట్రామ్ రెడ్డి పాలొనగన్నారు. కమిటీ సమావేశం అనంతరం ఎడ్ సెట్-2026 షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 20న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఏప్రిల్ 18 దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు. మే 12న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 2 గంటల నుంచి 4గంటల వరకు పరీఓను నిర్వహించనున్నట్టు కన్వీనర్ వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు.

## విషాద ప్రయాణం

# ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు దుర్మరణం

## జంపన్నవాగులో ఒకరు మృతి



సునీత, అక్షిత (ఫైల్)

**ఆదిలాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** భక్తి, శ్రద్ధలతో మేడారంలోని సమ్మక్క సారలమ్మ దర్శనం కోసం వెళ్తూ ఉమ్మడి ఆదిలాబాద్ చెందిన ముగ్గురు ప్రమాద వశాత్తు మృతి చెందారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన కుటుంబం మేడారం దర్శనానికి వెళ్తూ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలం బోర్లగూడెం వద్ద మంగళవారం ట్రాక్టర్ బోల్తా పడడంతో కస్తూరి సునీత(45) కస్తూరి అక్షిత(21) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో కస్తూరి సునీత, కస్తూరి అక్షిత ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయారు. స్థానికుల సహాయంతో పోలీసులు ట్రాలీలేపి చూసేసరికి తల్లీకూతురు మృతి చెందిఉన్నారు. కస్తూరి రమేష్‌కు కాలు విర గడంతో పాటు గాయాలయ్యాయి. అతనితోపాటు మరో20మందికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే మంచిర్యాల జిల్లా భీమారం మండలానికి చెందిన కొమ్ము శ్రీని వాస్ మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి వెళ్లి జంపన్నవాగులో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకునిపోయి మృతి చెందాడు.

# మార్చిలో 74వ బిఎన్ మల్లిక్ స్మారక అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ టోర్నమెంట్

## హైదరాబాద్‌లో రెండు వారాలపాటు నిర్వహణ : డిజిపి



74వ బిఎన్ మల్లిక్ స్మారక అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహణపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి శివధర్ రెడ్డి. చిత్రంలో గ్రేహౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** వచ్చే మార్చి నెలలో 74వ బిఎన్ మల్లిక్ స్మారక అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ టోర్నమెంట్ హైదరాబా ద్‌లో నిర్వహిస్తున్నట్లు, తెలంగాణ పోలీసు విభాగం దీనికి ఆతిథ్యం ఇస్తున్నట్లు డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించి బుధవారం డిజిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంబంధిత అధికారులతో డిజిపి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 23వ తేదీ నుంచి ఏప్రిల్ ఐదవ తేదీ వరకు ఈ టోర్నమెంట్ జరుగుతుందని, ఇందులో తెలంగాణ పోలీసు జట్టుతో పాటు దేశ వ్యాప్తంగా 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర ప్రాంతాలు, 11 పారామిలటరీ విభాగాలు, ఆరు కేంద్ర పోలీసు సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. పురుషులతో పాటు మహిళలు కూడా ఇందులో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. 1060 మంది పురుషులు, 350 మంది మహిళా క్రీడాకారులు, కోచ్‌లు, సహాయకులు మొత్తం రెండు వేల మంది ఇందులో పాల్గొంటున్నారని, వీరందరికి పోలీసు అకాడమిలో విడిది ఏర్పాటు చేస్తు న్నామని ఆయన తెలిపారు. మొత్తం 125 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని ఇందుకోసం గచ్చిబౌలి స్టేడియంతో పాటు శివార్లలోని మరికొన్ని స్టేడియం లను ఎంపిక చేశామని డిజిపి తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు తాను ఛైర్మన్‌గా వ్యవహరిస్తుండగా కార్యనిర్వాహక కార్యదర్శిగా సైబరాబాద్ కొత్వాల్ ర మేష్, పరిపాలన కమిటీలో అబిలాష్ బిస్త్‌తో పాటు అనిల్ కుమార్, సంజయ్ జైన్, సజ్జనార్, అవినాష్ మొహంతి, గజారావు భూపాల్ తదితరు లున్నారని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు

# రూ.707.30 కోట్లు విడుదల

## నెలాఖరున ఉత్తర్వుల జారీ

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ బకాయిల్లో మరి కొంత సొమ్మును విడుదల చేసేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. పెండింగ్ బకాయిలపై ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు ఉద్యోగులు ఉద్యమించే ప్రయత్నాలు చేయడంతో కొన్ని డిమాండ్లు పరిష్కారమవుతున్న విషయం తెలిసిందే. వాటిలో ఒకటి పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రధానమైనది. వేల కోట్ల పెండింగ్ బిల్లులు ఉండగా ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెకు దిగేందుకు సిద్ధమవగా అప్పుడు చర్చలు చేసిన ప్రభుత్వం పెండింగ్ బిల్లుల చెల్లింపునకు అంగీకరించింది.

మొత్తం ఒకేసారి కాకుండా విడతల వారీగా చెల్లిస్తామని ప్రకటించగా, అందులో భాగంగా తాజాగా మరో విడత నిధులు ప్రభుత్వం విడుదలకు సిద్ధమైంది. తాజాగా మరో విడత బిల్లులు ప్రభుత్వం చెల్లింపు చేస్తోంది. దానికి సంబంధించి ఆర్థికశాఖ అధికారుల సమాచారం ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల్లో నవంబర్‌కు సంబంధించి రూ.707.30 కోట్లు తాజాగా విడుదలచేస్తూ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ నెలకు సంబంధించి రూ.713 కోట్లు నేటి వరకు ప్రభుత్వం చెల్లించింది. ఆ నిధులకు సంబంధించి ఉత్తర్వులు ఈనెలాఖరున జారీ చేకానున్నాయి. పెండింగ్ బిల్లులకు జనవరి 30వ తేదీన విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.

# నా గౌరవానికి భంగం కలిగించిన వారికి శిక్ష పడేదాకా పోరాటం

## కెటిఆర్, హరీశ్‌రావులపై పోలీసులకు ఎఐసిసి కార్యదర్శి సంపత్ ఫిర్యాదు

## అసత్యఆరోపణలు, నిరాధార కథనాలు ప్రచారం చేస్తున్నారు




మీడియా ముందు వివరాలు వెల్లడిస్తున్న ఎఐసిసి కార్యదర్శి సంపత్

**హైదరాబాద్ (నార్సింగి), జనవరి 28, ప్రభాతవార్త:** 'నాది 35 యేళ్ల నిష్కళంక రాజకీయ చరిత్ర అని, శాసనసభ్యుడిగా, ఎఐసిసి కార్యదర్శిగా పని చేస్తున్న నాపై తప్పుడు వార్తలు వండివార్చి, ప్రచారం చేస్తూ, వ్యక్తిత్వ హననానికి పాల్పడిన బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీశ్‌రావు, క్రిశాంక్, ఓ తెలుగు పత్రిక, తెలుగు స్క్రైబ్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల'ని కోరుతూ ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ బుధవారం నార్సింగి పోలీసుస్టేషన్‌లో ఎసిపి రమణాగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక నాయకులు తలారి మల్లేష్ ముదిరాజ్, క్యాతం అశోక్‌యాదవ్‌లతో కలిసి పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంపత్ మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులపై, వారి ప్రసార సాధనాలపై విరుచుకు పడ్డారు. ఆధారాలు లేకుండా, కాంగ్రెస్ నాయకులపై తప్పుడు వార్తలు రాయించి, ప్రచారం చేయించడం బిఆర్ఎస్ నాయకులు పనిగా పెట్టుకున్నారన్నారు. ఈ నెల 9న ఇద్దరు జెసిబి ఓనర్ల మధ్య గొడవ జరిగిందని, నా దృష్టికి వస్తే బాకీ ఉన్న రూ.8. లక్షలు ఇచ్చి గొడవలకు దూరంగా ఉండాలని సూచించానని తెలిపారు. దాన్ని పట్టుకొని ఇటులాగి, అటులాగి తాను రూ.8.కోట్లు ఇవ్వాలని అడిగినట్లు పూర్తి నిరాధారమైన, అసత్యవార్తను ఓ తెలుగు పత్రికలో రాయించారని, దాన్ని ఆధారంగా చేసుకొని హరీశ్‌రావు ప్రెస్‌మీట్ పెట్టడం, వారి యూటూబ్ ఛానళ్లలో వైరల్ చేయడం జరిగిందన్నారు.

'గొడవ పడ్డ జెసిబి ఓనర్లు అక్కడి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో నా పేరు ఎక్కడా రాయదని, నాపై అసత్యవార్తలు ప్రచారం చేయవద్ద'ని సూచించానన్నారు. అయినా వారు కాంగ్రెస్ నాయకులను బదనాం చేయడమే పనిగా గత పక్షం రోజుల నుంచి నిరాధారమైన కథనాలు ప్రచారం చేయిస్తున్నారన్నారు. తాను ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయలేదని, నాపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు.

రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ ఇలా వ్యక్తిగతంగా ఇబ్బందులపాలు చేసేలా, దూషణలు అసత్య ప్రచారాలు చేయడం ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు. తాను నివసిస్తున్నది నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోనని, ఇక్కడికి వచ్చి తన వ్యక్తిత్వ హననానికి పాల్పడిన, గౌరవానికి భంగం కలిగించేలా చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు, వారి పత్రికలు, యూటూబ్ ఛానళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తన ప్రతిష్టకు భంగం కలిగేలా చేసిన వారికి చట్ట పరిధిలో శిక్షలు పడేంత వరకు పోరాడుతానని సంపత్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లంకల పాపిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం సమ్మక్క-సారక్క జాతరకు అధికారిక సెలవు ప్రకటించాలి

## బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవినాయక్

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** మేడారం సమ్మక్క-సారక్క జాతరకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికీ అధికారిక సెలవు ప్రకటించకపోవడం గిరిజన సమాజంపై జరిగిన అవమానం, అన్యాయం అని బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్ నేనావత్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ఖ్యాతి గడించిన మేడారం సమ్మక్క-సారక్క జాతర గిరిజనుల ఆత్మ, ఆరాధన, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. కోట్లాది మంది గిరిజనుల ఆరాధ్యదైవాలు సమ్మక్క-సారక్క. అలాంటి పవిత్రమైన మహాజాతరకు సెలవు ఇవ్వకుండా ప్రభుత్వం కావాలనే నిరక్ష్యంగా వ్యవహరించడం గిరిజనుల ఆత్మగౌరవాన్ని తుంగలో తొక్కడమేనని ఆయన విమర్శించారు. ఇతర మతపరమైన ఉత్సవాలకు సెలవులు ప్రకటించే ప్రభుత్వం, దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే మేడారం జాతరకు మాత్రం సెలవు ఇవ్వకపోవడం తీవ్ర వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఇది గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల పట్ల తెలంగాణ ప్రభుత్వానికి గౌరవం లేదని స్పష్టంగా చాటిచెప్పుతోందన్నారు. మేడారం జాతరకు సెలవు ప్రకటించకపోవడం అంటే గిరిజన సమాజాన్ని రెండో తరగతి పౌరులుగా చూస్తున్నట్లేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం నిరక్ష్యం కాదు, గిరిజనులపై ప్రభుత్వానికి ఉన్న అసహనం, ద్వేషభావాన్ని ప్రతిబింబిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని, మేడారం సమ్మక్క-సారక్క మహాజాతరకు అధికారిక సెలవు ప్రకటించాలని, గిరిజనుల విశ్వాసం, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని డిమాండ్ చేశారు.




# ఆధార్ అప్‌డేట్ ఇక మీ చేతుల్లోనే

## సరికొత్త యాప్‌ను ఆవిష్కరించిన

## కేంద్రమంత్రి అశ్వినివైష్ణవ్

**న్యూఢిల్లీ, జనవరి 28:** ఆధార్ సేవలను మరింత సులభతరంగా చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆధార్ యాప్‌ను ఆవిష్కరించింది. న్యూఢిల్లీలో బుధవారం ఓ కార్యక్రమంలో కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్‌ను జాతికి అంకితం చేశారు. దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ఇది కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆధార్ సంబంధిత చిన్నచిన్న అవసరాలకే కేంద్రాలు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. మొబైల్ నంబర్ మార్చాలన్నా, చిరునామా అప్‌డేట్ చేయాలన్నా.. సమయం, సహనం రెండూ పరీక్షకు గురయ్యేవి. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకే యుఐడిఎఐ ఈ కొత్త ఆధార్ యాప్‌ను రూపొందించింది. రోజువారీ గుర్తింపు ధ్రువీకరణలను సరళంగా, భద్రంగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ యాప్‌లోని ముఖ్యమైన ఆకర్షణ ఆఫ్‌లైన్ ఆధార్ ధ్రువీకరణ. హోటల్ చెక్‌ఇన్, సిమ్ కార్డు వెరిఫికేషన్, ఆఫీస్ అవసరాల కోసం ఆధార్ ఫోటోకాపీలు ఇవ్వడం వల్ల డేటా దుర్వినియోగం జరుగుతోందని యుఐడిఎఐ గుర్తించింది. అందుకే ఆధార్ నంబర్, బయోమెట్రిక్ వివరాలు పంచుకోకుండానే గుర్తింపు నిర్ధారించే విధానాన్ని ఈ యాప్‌లో ప్రవేశపెట్టింది. ఇది వినియోగదారుడికి పూర్తిగా నియంత్రణలో ఉండే భద్రతను అందిస్తుంది. కొత్త ఆధార్ యాప్ ద్వారా అవసరమైన సమాచారాన్ని మాత్రమే ఎంపిక చేసుకుని షేర్ చేయొచ్చు. పేరు, వయసు వంటి పరిమిత వివరాలతో పాస్‌వర్డ్‌రక్షి త ఫైల్‌ను తయారు చేసి పంచుకునే అవకాశం ఉంది. అలాగే, ధ్రువీకరించే సంస్థ ఇచ్చే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా క్షణాల్లో గుర్తింపు నిర్ధారణ పూర్తవుతుంది. ఇక ఆధార్‌లో మొబైల్ నంబర్, చిరునామా అప్‌డేట్‌ల విషయానికి వస్తే, ఈ యాప్ పెద్ద ఊరటగా మారనుంది. ఆధార్‌లోకి లాగిన్ అయి, అవసరమైన వివరాలను నేరుగా యాప్‌లోనే అప్‌డేట్ చేసుకోవచ్చు.

### తెలంగాణ రైజింగ్ విజన్, క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై

# సిఎం రేవంత్‌రెడ్డి చర్చలు

## తరగతుల మధ్యలో హార్వర్డ్ యూనివర్సిటీ

## కెన్నెడీ స్కూల్ ప్రొఫెసర్లతో సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి28:**హార్వర్డ్ యూనివర్సిటీ, కెన్నడీ స్కూల్‌లో విద్యార్థిగా చేరిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తరగతుల మధ్యలో అక్కడి ప్రొఫెసర్లను కలిశారు. హార్వర్డ్ కెన్నడీ స్కూల్ హెడ్, వైస్ ప్రొవోస్ట్ డస్టిన్ టింగ్లీ, హార్వర్డ్ కెన్నడీ స్కూల్ డీన్ ప్రొఫెసర్ జెర్మీ వెయిన్‌స్టన్‌లతో కలిసి తెలంగాణ రైజింగ్ విజన్‌ను ప్రజెంటేషన్ చేశారు. తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కోసం కెన్నడీ స్కూల్ కొలాబరేషన్‌ను కోరారు. తర్వాత ఉన్నతమైన విద్యను అందించేందుకు విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులపై ఆ ప్రొఫెసర్లతో చర్చించారు. వినూత్న స్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రవేశపెట్టడం వల్ల మానవ వనరులు మరింతగా అభివృద్ధి చెంది ఆర్థిక అభివృద్ధికి దోహద పడుతుందని పేర్కొన్నారు.

## ఎరువులు, పురుగుమందుల నియంత్రణకు

## నేచురల్ ఫార్మింగ్ పథకానికి మహబూబ్‌నగర్ ఎంపిక

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త :** పంటల సాగులో ఎరువులు, పురుగుమందుల వినియోగం నానాటికి పెరిగిపోవడంతో పర్యావరణంతో పాటు, భూములు సారవంతం కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో మోతాదుకు మించి పురుగు మందులు, ఎరువులు వాడటంతో సహజత్వాన్ని కోల్పోయిన పంట పొలాలను యథాస్థితికి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం (నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ 2024) పేరుతో ప్రత్యేక పథకాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాలో 20 క్లస్టర్లను గుర్తించింది. ఇందుకు ఒక్కో క్లస్టర్‌లో 125 మంది రైతులను వ్యవసాయ శాఖ అధికారులు ఎంపిక చేశారు. అలాగే సహజ వ్యవసాయంపై ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఇచ్చేందుకు మండలానికి ఒకరు చొప్పున కృషి సఖి (మహిళా రైతులు)లను ఎంపిక చేశారు.



# ఘనంగా 'వింగ్ ఇండియా'

## వైమానిక విన్యాసాలతో సందడిగా బేగంపేట ఎయిర్‌పోర్టు

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 28,ప్రభాతవార్త:** జంట నగర వాసులు నిన్నటి వరకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన కైట్ ఫెస్టివల్ తో సరదాగా గడిపారు. తాజాగా బుధవారం బేగంపేట విమానాశ్రయంలో రయ్ రయ్ అంటూ ఒక వైపు గాల్లో విన్యాసాలు చేసిన సూర్యకిరణ్ టీమ్, మరో వైపు మార్క్ జాఫ్రీస్ టీం లతో బేగంపేట విమానాశ్రయం ఎంతో సందడిగా మారింది. దీంతో పాటు నగరవాసులను కనువిందు చేసేందుకు ప్రతి రెండేళ్లకొకసారి పౌరవిమానయానశాఖ, ఫిక్కీ సంయుక్త ఆధ్వర్యంలో వింగ్స్ ఇండియా 2026 ప్రదర్శన ప్రారంభమైంది. ఈ షో కు దేశ విదేశాల నుంచి వందలాది మంది ప్రతినిధులు బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన విమాన విడిభాగాల స్టాల్స్ ను సందర్శించి సందడి చేసారు. ఒక వైపు షో ప్రారంభం కోసం అధికారులు తాప్రత్రయ పడుతుండగా ఇంకో వైపు తమకు నచ్చిన వాటిని కొనుగోలు చేసేందుకు ఈ ప్రదర్శనకు వివిధ దేశాలకు చెందిన ప్రముఖ వ్యాపార, వాణిజ్య వేత్తలు తరలి వచ్చారు. ఈ ప్రదర్శనలో మొదటి రెండు రోజులు వ్యాపార, వాణిజ్య వేత్తలకు అవకాశం కల్పిస్తుండగా చివరి రెండు రోజులు సాధారణ పౌరులకు సందర్శనకు అవకాశం కల్పిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సూర్యకిరణ్, మార్క్‌జెఫ్రీస్ అద్భుత మైన విన్యాసాలను అందించారు. ఈ షో చూసేందుకు పెద్ద ఎత్తున జంట నగరాల ప్రజలు బేగంపేట విమానాశ్రయానికి తరలివచ్చారు.

వింగ్స్ ఇండియా 2026 ప్రదర్శనను ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ విమానయాన రంగంలో యువతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వారికి ఇష్టమైన రంగంలో వారు శిక్షణ పొందాలని, తమ పౌరవిమానయాన శాఖ తరుపున ఇప్పటికే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తూ సహకరిస్తున్నామన్నారు. ఇక్కడ ప్రారంభించిన వింగ్స్ ఇండియా 2026 సక్సెస్ అవుతుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేసారు. గతంలో కంటే ఈసారి ఇంకా ఎక్కువగా ఏర్పాట్లు చేసామని, సుమారు 20దేశాల నుంచి 3వేల మంది పాల్గొంటున్నారని, 4రోజుల ఈవెంట్ సక్సెస్ అవుతుందని, తెలంగాణా ప్రభుత్వం కూడా చాలా సహకారం అందిస్తుందన్నారు. వారికి ధన్యవాదాలు తెలియజేసారు. ఏవియేషన్ డిమాండ్ గత 10ఏళ్లలో ఎంతో పెరిగిందన్నారు. ప్రపంచంలో ఏ దేశం ఎదగని విధంగా మన దేశం ఎదిగిందన్నారు. ప్రధాని మోదీ తెచ్చిన మార్పుతో ఇది సాధ్యమైందన్నారు.

# దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజ్‌మెంట్

## రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలు

## రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి28:** ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని వీలైనంతవరకూ ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ (డిజాస్టర్ మేనేజిమెంట్) విభాగాన్ని బలోపేతం చేసి దేశానికి ఒక రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా వంద కోట్ల రూపాయిలతో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐసిసిసి విభాగాలతో సమావేశం నిర్వహించి ఎలాంటి పరికరాలను కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్‌టైమ్ మానిటరింగ్ సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక ఫైర్ అండ్ సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూ-విపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేలా ఆయా స్థానిక పరిస్థితులను బట్టి మండల స్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రి పొంగులేటి ఆరా**

మేడారం మహాజాతరకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోటి భక్తుల కొంగు బంగారం, తెలంగాణ కుంభమేళా సమ్మక్క సారలమ్మ మేడారం జాతరలో అత్యంత పవిత్రమైన మొదటి ఘట్టం బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో సచివాలయం నుండి హై ఫ్రీక్వెన్సీ వాకీటాకీతో మేడారంలో ట్రాఫిక్ విధులను పర్యవేక్షి స్తున్న సిబ్బందితో మంత్రి మాట్లాడారు.

# ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం తగదు

## వీబీజీరామ్‌జీ చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తాం

## కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

**మెదక్‌టౌన్, జనవరి 28, ప్రభాతవార్త:** యూపిఏ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడం కోసం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధిహామి చట్టాన్ని మార్చడమంటే పేదల పొట్టకొట్టడమే తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ విమర్శించారు. మహాత్మ గాంధీ ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం ప్రధాని మోడీ కి తగదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీని బొందపెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బుధవారం చిన్న శంకరంపేట మండలం కోర్వి పల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పేరు మార్చడం పట్ల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజ్, తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొనగా, ముఖ్య అతిధిగా హాజరైన ఆమె మాట్లా డుతూ 2005 సంవత్స రంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కేంద్రంలో ప్రవేశ పెట్టిందని తెలి పారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం ఉపాధి హామీని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ పథకాన్ని బిజెపి కేంద్ర ప్రభుత్వం మోడీ పేరును మార్చడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. వీబీజీరామ్ జీ చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మ, అమలు విధానాన్ని మార్చే లా కేంద్ర ప్రభుత్వం వ్యవహారి స్తున్నదని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం చట్టం తేవడం దుర్మార్గమన్నారు. ఈ చట్టం తేవడం మూలంగా పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నదన్నారు. పేదలు, రాష్ట్రాలను శిక్షి ంచేలా కేంద్రం విధానం ఉన్నదని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును ఖివికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గర్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)ఖి (వీబీజీరామ్ జీ)గా మార్చే బిల్లును ఆమె తప్పుబట్టారు.



మహిళలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

# వివాద సాగుభూముల పరిష్కారానికి సిద్ధం

## 9 లక్షల మంది రైతులకు ప్రయోజనం

## సాదాబైనామాలపై రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త :** తెలంగాణలోని రైతులకు రేవంత్ సర్కార్ త్వరలో తీపికబురు అందించేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం వివాదంలో ఉన్న భూముల దరఖాస్తులను పరిష్కరించేందుకు సిద్ధమవుతోంది. ఇందువల్ల రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మంది రైతులు ప్రయోజనం చేకూరనుంది. భూ భారతి చట్టం తీసుకొచ్చాక వ్యవసాయ భూముల దరఖాస్తు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలో సాదా బైనామా దరఖాస్తుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాదా బైనమా భూముల పరిష్కా చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న ఈ వ్యవసాయ భూముల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం పలు నిబంధనలను కూడా ప్రభుత్వం తొలగించనుంది. సాదా బైనమా భూముల పరిష్కారానికి అమ్మినవారి సంతకం, అఫిడవిట్ అవసరం లేకుండా ఇప్పటివరకు ఉన్న కఠిన నిబంధనలను తొలగించనుంది. దీనిపై త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. దీంతో ఇప్పటివరకు 9 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, త్వరలోనే వీటిన్నింటినీ క్లియర్ చేయనున్నారు. ఈ క్రమంలో 9 లక్షల మంది రైతులకు లబ్ధి జరగనుంది. ఇప్పటి వరకూ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి తెల్ల కాగితంపై వ్యవసాయ భూమిని అమ్మిన వ్యక్తి మళ్లీ వచ్చి సాక్ష్యం చెప్పాల్సి ఉంటుంది. లేదా నోటరీతో ఒక అఫిడవిట్ అందించాల్సి ఉంటుంది. కానీ భూముల ధరలు పెరగడంతో అప్పట్లో భూములు అమ్మిన వ్యక్తులు సంతకం చేయడం లేదు. సంతకానికి పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే సంతకం చేయడం లేదు. మరికొంతమంది అసలు సంతకమే చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో భూములు కొనుగోలు చేసిన రైతులకు ఈ నిబంధన పెద్ద కష్టతరంగా మారింది. =ప్రస్తుతం భూమి ఎవరి ఆధీనంలో ఉంది అనే విషయాన్ని నిర్ధారించి దరఖాస్తులను క్లియర్ చేయనున్నారు. ఎప్పుడో భూమి కొనుగోలు చేస్తే ఇప్పుడు వాళ్ల వచ్చి అఫిడవిట్ ఇవ్వడం సరికాదని అధికారులు భావించారు. దీంతో ఆ నిబంధనను ఎత్తివేయాలని నిర్ణయించారు. అటు భూభారతి చట్టంలో భాగంగా పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్దమవుతోంది. పారదర్శకత కోసం వివాదాలను పరిష్కరించే ప్రక్రియను సులభతరం చేయనుంది. ఇందులో భాగంగా సాదా బైనామా భూములకు సంబంధించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# అణచివేస్తే ఉద్యమం మరింత ఉధృతం

## విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

**హైదరాబాద్,జనవరి 28,ప్రభాతవార్త:** విద్యుత్ ఉద్యోగులను అణచివేయాలని చూస్తే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని.. ఉద్యోగులందరు తమహక్కుల కోసం పోరాటం చేస్తే యాజమాన్యం అణచివేయాలని ఆలోచించడం సమంజసం కాదని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ సాయిబాబా అన్నారు. చిన్న సమస్యను మరింత జటిలం చేస్తున్నారని, దీనికి యాజమాన్యమే బాధ్యవహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన ధర్నాకు సంస్థ పరిధిలో పని చేస్తున్న విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ పేరిట అమాయకులకు టోకరా

## పుణే సైబర్ నేరగాడు అరెస్టు

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అమాయకులను ఒక పథకం ప్రకారం ఆన్‌లైన్ బెట్టింగ్ పేరిట నిండా ముంచి కోట్లాది రూ పాయలు దండుకుంటున్న మహారాష్ట్రలోని పుణేకి చెందిన ఓ కేటుగాడిని సిటీ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసి 15 సెల్‌ఫోన్లతోపాటు ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. వివరాలను సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు బుధవారం మీడియాకు వెల్లడించారు. పుణేకు చెందిన విశాల్ అనిల్ నిర్మల్ (30) అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం దుబాయ్‌కు వెళ్లిన ఇతను అక్కడ నేపాల్‌కు చెందిన సూరజ్ బుసాల్ అనే వ్యక్తితో పరిచయం చేసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ప్రావీణ్యం పొందాడు. అనంతరం భారత్‌కు వచ్చాక వాట్సా ప్‌లలో ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ప్రకటనలు ఇస్తూ అమాయకులను ఒక పథకం ప్రకారం టోకరా వేస్తున్నాడు.

ఇతని మాటలు నమ్మిన హైదరా బాద్‌కు చెందిన ఓ యువకుడు మొదట పది లక్షల రూపాయలు, ఆ తరువాత 55 లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. నిర్మల్ పంపిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నమ్మిన బాధితుడు నిండా మునిగిన తరువాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీ నిపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు విచారణ చేసి నిర్మల్‌ను బుధవారం అరెస్టు చేయగా అతని వద్ద 15 సెల్‌పోన్లతో పాటు ఒక లాప్‌టాప్, 57 చెక్‌బుక్కులు, 79 సిం కా ర్డులు, 62 డెబిట్ కార్డులు. 15 షెల్ కంపెనీ రబ్బరు స్టాంపులు, ఎనిమిది క్యూ ఆర్ కోడ్‌లు పట్టుబడ్డాయి. ఈ కేసులో మిగతా ఇద్దరి కోసం గాలి స్తున్నారు. పట్టుబడ్డ నిం దితుడిని రిమాండుకు తరలించారు.

# మహిళల హక్కులను పోరాడి సాధించుకుంటాం

## హింసల్లో ప్రధాన బాధితులుగా మహిళలే సమిధలు

## 12న కార్మికుల సార్వత్రిక సమ్మెలో ఐద్వా

## ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి కనినిక ఘోష్

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** మహిళల హక్కులను పోరాడి సాధించుకుంటామని.. పోరాటాన్ని మధ్యలో వదిలేసే ప్రసక్తే లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి కనినిక ఘోష్ తెలిపారు. మహిళలకు రావల్సిన హక్కులిస్తే తీసుకుంటామని..లేదంటే లాక్కుంటాం తప్ప.. మధ్యలో వదిలే ప్రసక్తే లేదన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించిన 14వ జాతీయ మహాసభల్లో ఐద్వా నూతన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆమె ఎన్నికయ్యారు. ఐద్వా కేంద్ర కమిటీ ఎన్నిక అనంతరం సంఘం జాతీయ అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి, జాతీయ కోశాధికారి తపసి ప్రహరాజ్, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ఉపాధ్యక్షులు మరియం ధావ్ లే, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్షి ్మలతో కలిసి కనినిక మీడియాతో మాట్లాడారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, మనువాదాన్ని తిరస్కరిస్తూ, మహిళల హక్కుల కోసం ముందుకెళ్లే విషయంలో ఏడు అంశాలపై మహాసభలో క్షుణ్ణంగా చర్చించినట్టు తెలిపారు. కార్పొరేట్ శక్తులు, మతోన్మాదులు, బీజేపీ ప్రభుత్వం అదే పనిగా పేదలు, దళితులు, ఆదివాసీలు, అణగారిన వర్గాల హక్కులను హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రకాల హింసల్లో ప్రధాన బాధితులుగా మహిళలే సమిధలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 12న జరగనున్న కార్మికుల సార్వత్రిక సమ్మెలో ఐద్వా దేశవ్యాప్తంగా పాల్గొంటుందని తెలిపారు. బీజేపీ సర్కారు చట్టాల్లో మనువాద భావజాలంతో తీవ్రమైన మార్పులు చేస్తోందనీ, ఈ మార్పులతో మహిళలకు పెను ప్రమాదం పొంచి ఉందని సంఘం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే హెచ్చరించారు. మహిళలకు తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే హక్కును హరిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల సమస్యలపై ఐద్వా నిరంతరం పోరాడుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

# సిట్ తదుపరి నోటీసులు

# కవిత దంపతులతో పాటు కెసిఆర్‌కు?

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండవ సిట్ ఏర్పాటయా ్యక విచారణ వేగం పుంజుకోగా దీనిపై తదుపరి నోటీసులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దంపతులతో పాటు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కు ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారని సమాచారం. 2024 మార్చి నెలలో మొదలైన ఈ కేసు విచారణ మొన్నటి వరకు స్తబ్దుగా కొనసాగ గా దీనిపై సిటీ కొత్వాల్ సజ్జనార్ నేతృత్వంలో రెండవ సిట్ ఏర్పాటయ్యాక వేగం పెరగడం తెలిసిందే. ఇందులో భాగంగా మొదట బిఆర్ఎస్ ఎం ఎల్సి నవీన్ రావుకు, ఆ తరువాత మాజీ మంత్రులు హరీశ్‌రావు, కెటిఆర్‌లను వరుసగా సుధీర్ఘంగా విచారించి కీలక విషయాలను వెలుగులోకి తెచ్చారని తెలిసింది. దీని తరువాత బిఆర్ఎస్ మాజీ ఎంపి సంతోష్‌రావును మంగళవారం ఏడున్నర గంటలపాటు విచారించారు. పది రో జుల వ్యవధిలో వీరందరి విచారణ ముగిసింది. హరీష్ రావు, కెటిఆర్‌ల విచారణ అనంతరం సంతోష్ రావు విచారణ సాగింది. హరీష్ రావు, కెటిఆర్‌లు ఉదయం 11 గంటలకు వచ్చి రాత్రి ఏడు గంటల సమయంలో వెనుదిరగగా సంతోష్ రావును మ ధ్యాహ్నం మూడు గంటలకు పిలిచి రాత్రి పదిన్నర గంటల వరకు విచారించారు. విచారణ తరువాత సంతోష్ రావు మీడియాతో ఏమీ మాట్లాడకుండా వెనుదిరిగారు. సంతోష్ రావును మీడియాతో ఏమీ మాట్లాడకూడదని సిట్ అధికారులు ఆదేశించినట్లు సమాచారం. అవసరం అయితే మరోసారి విచారణకు రావాల్సి వుంటుందని కోరినట్లు తెలిసింది. సంతోష్ రావు వెల్లడించిన సమాచారం ఆధారంగా రెండు మూడు రోజుల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్‌ను, వీరి తరువాత మాజీ సిఎం కెసిఆర్‌ను విచారణకు పిలవాలని సిట్ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

# రూ.1,500 కోట్లు రుణం సేకరించిన సర్కార్

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త :** ఈ నెలాఖరు సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1,500 కోట్ల రూపాయల మేర రుణాన్ని సేకరించింది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ మొత్తాన్ని సమీకరించింది. ఇందులో భాగంగా 18 ఏళ్ల కాలపరిమితితో 7.64 శాతం వార్షిక వడ్డీ రేటుతో రూ.1,000 కోట్లు, 22 ఏళ్ల కాలపరిమితితో 7.58 శాతం వార్షిక వడ్డీతో రూ.500 కోట్ల రూపాయలు చొప్పున ఈ అప్పును తీసుకుంది. తెలంగాణతో సహా దేశంలోని 15 రాష్ట్రాలు మొత్తంగా రూ.38,300 కోట్ల రూపాయల మేర రుణాలు తీసుకున్నాయి.

# ఇబిసి కమిషన్ ఏర్పాటు చేయాలి

## జానారెడ్డితో ఇబిసి జాతీయ అధ్యక్షుడు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 28:** ఈబీసీ జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి నేతృత్వంలో 18 అగ్రకులాల నిరు ేపదల సంఘాల ప్రతినిధులు బుధవారం బంజారాహిల్స్ లోని మాజీమంత్రి కుందూరు జానారెడ్డి నివాసంలో కలిసి ఈబీసీ కమిషన్ ను ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఎస్సి, ఎస్టి, బీసీలకు అమలు చేస్తున్న అన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అగ్రకులాల నిరుపేదలకు అమలయ్యేలా చూడాలని కోరారు.

# దానంకు స్పీకర్ నోటీసులు

## 30న విచారణకు హాజరు కావాలని ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి28:**తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, 2024 మార్చిలో వ్యక్తిగత హోదాలో కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వెళ్లానని, దీంతో మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా నేను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పీకర్ ప్రసాద్ కుమార్ వద్ద అఫిడవిట్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఆయన ఈ అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టివేయాలని సభాపతిని కోరారు. 2023లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలిచానని, ఆ పార్టీకి తాను రాజీనామా చేయలేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసిన విషయం కూడా తనకు తెలియదని అన్నారు. ఓసారి కాంగ్రెస్ సమావేశానికి వెళ్లినప్పటికీ వ్యక్తి గత హోదాలో వెళ్లానని పేర్కొన్నారు. ఈ నెల 30న విచారణకు హాజరు కావాలని దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు.

# శివమ్ దుబే పోరాటం వృథా

## వైజాగ్‌లో టీమిండియా హీరోలు జీరో

## 50 పరుగుల తేడాతో

## న్యూజిలాండ్ జట్టు విజయం

**విశాఖపట్టణం, జనవరి 28:** నగరంలో జరిగిన టీ20లో టీమిండియా ఓటమిపాలయింది. భారత్ న్యూజిలాండ్ మధ్య జరిగిన నాలుగో టీ20లో టీమిండియా టాప్ ఆర్డర్ విఫలమవ్వడంతో కివీస్‌కు తొలి విజయం దక్కింది. ఇషాన్ కిషన్ జట్టులో లేని లోటు స్పష్టంగా కనిపించడంతో పాటు అభిషేక్ శర్మ గోల్డెన్ డకౌట్ కావడం, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా అలా వచ్చి ఇలా వెళ్లడంతో న్యూజిలాండ్ అందించిన 216 పరుగుల లక్ష్యం ముందు చతికిలపడింది. భారత్ 165 పరుగులకు ఆలౌట్ కావడంతో కివీస్ 50 పరుగుల తేడాతో విజయం సాధించింది. న్యూజిలాండ్ అందించిన భారీ లక్ష్య ఛేదనలో భారత్ 165 పరుగులకే ఆలౌట్ అయింది. దాంతో న్యూజిలాండ్ 50 పరుగుల తేడాతో విజయం సాధించి, సిరీస్‌లో తొలి గెలుపును అందుకుంది. మిడిలార్డర్ విఫలమైనా ఆఖర్లో పరుగులు రావడంతో న్యూజిలాండ్ 215/7 పరుగులు చేసింది. న్యూజిలాండ్ అందించిన 216 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. గువాహటి మ్యాచ్‌లో మొదటి బంతికే సంజూని అవుట్ చేసిన మ్యాట్ హెన్రీ ఈ మ్యాచ్‌లో అభిషేక్‌ను ఫస్ట్ బంతికే పెవిలియన్‌కు పంపాడు. ఇషాన్ కిషన్ లేకపోవడంతో ఫస్ట్ డౌన్‌లో వచ్చిన సూర్యకుమార్ యాదవ్ 8 బంతుల్లో 8 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. దాంతో భారత్ 9 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఇద్దరూ బాగా ఆడుతున్నారు అనుకున్న సమయంలో 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో 24 పరుగులు చేసిన సంజూ శాంసన్‌ను మిచెల్ శాన్‌ట్నర్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే హార్దిక్ పాండ్యా కూడా శాన్‌ట్నర్ బౌలింగ్‌నే వికెట్ కోల్పోయాడు. 30 బంతుల్లో 39 పరుగులు చేసిన రింకూ సింగ్ కూడా అవుటవ్వడంతో భారత్ 82 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. అదే సమయంలో క్రీజులోకి వచ్చిన శివమ్ దుబే ఒక్కసారిగా మ్యాచ్‌ని మార్చేశాడు.

మిగతా బ్యాటింగ్ లైనప్ మొత్తం బౌలర్లే ఉండటంతో హిట్టింగ్ మొదలుపెట్టిన దుబే కేవలం 15 బంతుల్లోనే 2 ఫోర్లు, 6 సిక్సర్లతో హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. హర్షిత్ రాణా స్ట్రయిట్ షాట్ ఆడగా అది నేరుగా బౌలర్ చేతిని తగిలి నాన్‌స్ట్రయిక్ వికెట్లను తాకింది. దాంతో 23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లు బాదిన దుబే 65 పరుగుల వద్ద అవుటయ్యాడు. హర్షిత్ రాణా 13 బంతుల్లో 9 పరుగులు చేయగా, అర్ష్‌దీప్ సింగ్ డకౌట్ అయ్యాడు. బుమ్రా రెండు బంతుల్లో నాలుగు పరుగులు చేశాడు. కుల్దీప్ యాదవ్ 1 పరుగుకే అవుటవ్వడంతో భారత్ 18.4 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు సాధించింది. కేవలం 8 ఓవర్లలోనే 100కు పైగా స్కోర్ చేసిన కివీస్ ఒక దశలో ఈజీగా 250 చేరుతుందని అనుకున్నారు.

ఓపెనర్లు డెవాన్ కాన్వే 44 (3 సిక్సులు, 4 ఫోర్లు), టిమ్ సీఫర్ట్ 62 (3 సిక్సులు, 7 ఫోర్లు) అద్భుత ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్ అందించారు. మొదటి వికెట్‌కు 8.2 ఓవర్లలోనే వంద పరుగులు జోడించారు. రచిన్ రవీంద్ర (2), గ్లెన్ ఫిలిప్స్ (24), మార్క్ చాప్‌మెన్ (9), సాంట్నర్ (11) ఇలా వరుసగా పెవిలియన్‌కు చేరుకున్నారు. చివర్లో డారెల్ మిచెల్ (39) వేగంగా పరుగులు చేశాడు. దీంతో స్కోర్ 215కు చేరింది. ఇక భారత బౌలర్లలో అర్షదీప్, కుల్దీప్ చెరో రెండు వికెట్లు తీయగా రవి బిష్ణోయ్, బుమ్రా చెరో వికెట్ తీసుకున్నారు. ప్లేయర్ ఆఫ్‌దిమ్యాచ్‌గా టిమ్ సీఫెర్ట్ ఎంపికయ్యాడు.

# అజిత్‌పవార్ మృతికి పలువురు ప్రముఖుల నివాళి

## ప్రగాఢ సంతాపం వెలిబుచ్చిన కేబినెట్



మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతికి ఎపి మంత్రి మండలి సంతాపం తెలుపుతున్న దృశ్యం

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:**మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్(66) విమాన ప్రమాదంలో దుర్మరణం చెందడం దేశ రాజకీయాల్లో తీవ్ర విషాదాన్ని నింపిందని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం బుధవారం ఉదయం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో అజిత్ పవార్ సహా మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా అజిత్ పవార్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈరోజు ఉదయం విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ హఠాత్తుగా మరణించడం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. తీవ్ర బాధకు గురిచేసింది. ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అనుచరులకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను అని సీఎం చంద్రబాబు అందులో పేర్కొన్నారు.

విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతిపై ఏపీ కేబినెట్ సంతాపం వ్యక్తం చేసింది. మంత్రి మండలి సమావేశం ప్రారంభ సమయంలో అజిత్ పవార్ విమాన ప్రమాద ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించారు. ప్రమాదంలో అజిత్ పవార్‌తో సహా ఐదుగురు చనిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. అజిత్ పవార్‌తో తనకు ఉన్న పరిచయాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. ముంబై నుంచి బారామతి వెళ్తుండగా జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణంతో దిగ్భ్రాంతికి లోనయ్యానని తెలిపారు. మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ పవార్ మృతి తీరని లోటని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.రాజకీయాల్లో కీలక నేత పవార్.. మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ పవార్ అత్యంత ప్రభావవంతమైన నేత. అనేక పర్యాయాలు ఉప ముఖ్యమంత్రిగా, మంత్రిగా పనిచేశారు. మహారాష్ట్ర రాష్ట్ర అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. ఈ విషాద వార్త నేపథ్యంలో మహారాష్ట్రలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.ముంబై నుంచి బారామతి వెళ్తుండగా జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణంతో దిగ్భ్రాంతికి లోనయినట్లు సీఎం చంద్రబాబు తన కేబినెట్ సహచరులతో వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ పవార్ మృతి తీరని లోటని వెల్లడించారు. అనంతరం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి మృతికి సంతాపం తెలుపుతూ ఏపీ క్యాబినెట్ తీర్మానం చేసింది. దీనికి సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మహారాష్ట్రలోనూ ఏపీ తరహాలోనే ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వం కొనసాగుతుండగా.. అందులో పవన్ కళ్యాణ్ తరహాలోనే అజిత్ పవార్ డిప్యూటీ సీఎంగా ఉన్నారు.

**అజిత్ పవార్ మృతిపై పవన్ కళ్యాణ్ సంతాపం..**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్‌సీపీ అధ్యక్షుడు, ఎన్డీఏ కూటమి నాయకులైన అజిత్ దాదా పవార్ ఈరోజు జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించారనే విషాద వార్త విని తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం సోషల్ మీడియా వేదికగా అజిత్ పవార్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన చేసిన అంకితభావంతో కూడిన ప్రజాసేవ, మహారాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అందించిన అపారమైన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ప్రజల పట్ల అజిత్ పవార్‌కున్న నిరంతర నిబద్ధతను గౌరవంతో స్మరించుకుంటారని తెలిపారు. ఆయన మరణం పట్ల నేను ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఈ తీవ్ర దు:ఖ సమయంలో అజిత్ పవార్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

**అజిత్ పవార్ మృతిపై ఎపి బిజెపి నేత పీవీఎన్ మాధవ్ విచారం..**

అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందడంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## కల్తీ నెయ్యిని సృష్టించి దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేయటం క్షమించరాని నేరం : మంత్రి నారా లోకేష్

**విజయవాడ.జనవరి 28,ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు లడ్డూ ప్రసాదం విషయంలో మహాపాపం చేసి కూడా బుకాయించుకోవటం జగన్ కే చెల్లిందంటూ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రులతో లోకేశ్ అల్పాహార విందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి అంశాన్ని ప్రస్తావించారు. పవిత్రమైన తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా నివేదికను వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని జగన్‌పై మండిపడ్డారు. పాలే లేని కల్తీ నెయ్యిని సృష్టించి దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేయటం క్షమించరాని నేరమన్నారు. రూ. వందలకోట్ల కుంభకోణానికి పాల్పడటమే కాకుండా అసత్యాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. వైసీపీ కుట్రలను ధీటుగా తిప్పికొట్టడంతో పాటు వారి భాగోతాన్ని ప్రజల్లోనే ఎండగడదామని మంత్రులతో జరిగిన సమావేశంలో నారా లోకేశ్ సూచించారు. అబద్దాలు చెబితే నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు.లెవన్ టీమ్ ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి మంత్రులు బలీయంగా తీసుకుని వెళ్ళాలని నారా లోకేశ్ కోరారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అద్భుత విజయాలను సాధిస్తోందన్నారు. ఖచ్చితంగా విద్య,వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందన్నారు.

## కారుణ్య నియామక దరఖాస్తు చేసుకోవడానికి వ్యవధి పరిమితం ఉండకూడదు : హైకోర్టు

**విజయవాడ,జనవరి28,ప్రభాతవార్తప్రతినిధి:** కారుణ్య నియామకం చేయాలన్నది హక్కు కాకపోయినప్పటికీ సదరు నియామకం కోసం చేసుకునే దరఖాస్తును చట్ట ప్రకారం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని హైకోర్టు తేల్చింది. విజయనగరం జిల్లా, కొత్తవలస గ్రామానికి చెందిన బి రాములు రైల్వేశాఖలో గ్యాంగ్‌మెన్‌గా చేస్తూ అనారోగ్య కారణాలతో స్వచ్ఛంధ ఉద్యోగ విరమణ తీసుకున్నారు. ఆ తర్వాత రాములు కుమార్తె నారాయణమ్మ కారుణ్య నియామం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఐదేళ్లలోపు దరఖాస్తు చేయలేదంటూ ఆమె దరఖాస్తును ఆఫీసర్లు తిరస్కరించడాన్ని క్యాట్ సమర్థించింది. దీనిపై అప్పీల్ చేయడంతో హైకోర్టు ఆమె దరఖాస్తును ఖచ్చితంగా పరిశీలించి.నిర్ణయం తీసుకోవాలని తీర్పు వెలువరించింది. వాస్తవ ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని కారుణ్య నియామకం ఉండాలంది. యాంత్రికంగా, ఏకపక్షంగా, సాంకేతికంగా నిర్ణయం తీసుకోరాదని, ఈ కారణాలతో తిరస్కరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. దరఖాస్తు చేయడంలో జాప్యం ఉందని చెప్పి కారుణ్య నియామకాన్ని తిరస్కరించడానికి వీల్లేదంది. తనకు, తన తండ్రికి రైల్వే శాఖలో కారుణ్య నియామక నిబంధన గురించి తెలియదని, ఈ కారణంగా ఐదేళ్ల ఆలస్యమైందని, ఇదేమీ తీవ్ర జాప్యం కాదని పిటిషనరు వాదనను సమర్థించింది. పిటిషనరు నారాయణమ్మ చేసుకున్న దరఖాస్తును 3 మాసాల్లో పరిగణనలోకి తీసుకోవాలని రైల్వే అధికారులను జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రారు,

జస్టిస్ గేదెల తుహిన్ కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. చావుకు ఎలాంటి వ్యత్యాసాలు ఉండవని, పుట్టినవాడు గిట్టక తప్పదని హైకోర్టు వ్యాఖ్యానించింది. అలాంటి వ్యక్తి ఉద్యోగం చేస్తూ కన్నుమూస్తే ఆ కుటుంబం ఆర్థికంగా అష్టకష్టాలు పడే దుస్థితి ఏర్పడకూడదని అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే కారుణ్య నియామకం వెసులుబాటు వచ్చిందని గుర్తు చేసింది. కారుణ్య నియామకం హక్కు కానప్పటికీ ఆ కుటుంబ ఆర్థిక ఇబ్బందులను మాత్రం కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలని తీర్పు చెప్పింది.

## నియోజకవర్గానికో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

### - వైద్యారోగ్య శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు..

### - ఏప్రిల్ 1 నుంచి యూనివర్సల్ హెల్త్ పాలసీ.. - మేల్ ఎంపిహెచ్‌ఎల నియామకానికి సిఎం గ్రీన్ సిగ్నల్..



:వైద్యారోగ్యశాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ జనవరి 28,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేసి పర్యవేక్షించేలా చేపట్టిన సంజీవని ప్రాజెక్టును త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చేలా క్షేత్ర స్థాయిలో వివిధ ప్రణాళికల్ని చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు విస్తరించిన సంజీవని ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు చేపడుతున్న క్రమంలో పైలెట్ ప్రాజెక్టు అమలు తీరును అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. వచ్చే ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ అమల్లోకి రానున్న క్రమంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే అంశంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..." సంజీవని ప్రాజెక్టు త్వరలో రాష్ట్రస్థాయిలో అమలు చేయబోతున్నాం. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు అమల్లో ఉంది. ఈ క్రమంలో దీనిపై పూర్తిస్థాయిలో శ్రద్ధ తీసుకోవాలి. టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చి... నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నాం. శిశువుల నుంచి వృద్ధుల వరకూ సంజీవని ప్రాజెక్టు ద్వారా వైద్య సేవలు అందాలి. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నాం. ప్రజలకు వైద్య సేవలు అందించడంతోపాటు... ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నాం. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి... పోషకాహారాల వల్ల ఉపయోగాలేంటి అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. మొబైల్ యాప్ ద్వారా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా చూస్తున్నాం. న్యూట్రిషన్ యాప్ కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి" అని సీఎం అన్నారు.

## బంగ్లాదేశ్‌లో అరెస్టైన విజయనగరం జిల్లా మత్స్యకారుల విడుదలకు తక్షణ చర్యలు..

### మంత్రి అచ్చెన్నాయుడు వినతితో స్పందించిన సిఎం చంద్రబాబు

### కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సిఎం లేఖ

**విజయవాడ జనవరి 27.ప్రభాతవార్తప్రతినిధి:** విజయనగరం జిల్లాకు చెందిన 9 మంది మత్స్యకారులను బంగ్లాదేశ్ నౌకాదళం అరెస్టు చేసిన ఘటనను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లగా, దీనిపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా లేఖ రాసి మత్స్యకారుల విడుదలకు అవసరమైన దౌత్య చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుంచి మాట్లాడుతూ, విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌కు చెందిన మెకానైజ్డ్ ఫిషింగ్ బోట్ అక్టోబర్ 13, 2025న ఉదయం 4 గంటలకు లోతు సముద్ర చేపల వేటకు బయలుదేరిన సమయంలో, అందులో ఉన్న 9 మంది మత్స్యకారులు వాతావరణ పరిస్థితులు, సముద్ర ప్రవాహాల కారణంగా అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దులు దాటారని తెలిపారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ నౌకాదళం వారిని అరెస్టు చేసినట్లు వివరించారు. అక్టోబర్ 22, 2025న సమీప ప్రాంతంలో వేట చేస్తున్న మరో పడవ సిబ్బంది ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చిందని, అప్పట్లో పడవ డ్రైవర్ బంగ్లాదేశ్ నౌకాదళం తమను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపినట్లు మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లగానే, మత్స్యకారుల కుటుంబాల పరిస్థితిని పరిగణలోకి తీసుకుని ముఖ్యమంత్రి వెంటనే స్పందించారని, కేంద్ర విదేశాంగ, హోంశాఖల ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో దౌత్య పరమైన చర్చలు జరిపి మత్స్యకారులు మరియు వారి పడవను సురక్షితంగా విడుదల చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారిని కోరుతూ లేఖ రాసినట్లు తెలిపారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అందిన సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 13 మంది, పశ్చిమ బెంగాల్‌లో 122 మంది బంగ్లాదేశ్ మత్స్యకారులు నిర్బంధంలో ఉన్నారని, పరస్పర విడుదల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఈ అంశాన్ని మానవతా దృక్పథంతో త్వరితగతిన పరిష్కరించాలని సీఎం చంద్రబాబు గారు కోరినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

## న్యాయస్థానం ప్రాంగణంలో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

**విజయవాడ.జనవరి28,ప్రభాతవార్తప్రతినిధి:** న్యాయస్థానంలో లొంగిపోవడానికి వచ్చిన నిందితుడిని అక్కడి హాల్లోనే అరెస్టు చేసిన పోలీసులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్నూలు జిల్లా, పత్తికొండ న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ యడ్లవల్లి లక్ష్మణరావు విచారించారు. కర్నూలు జిల్లాలోని చిప్పగిరి ఎస్ఐ సతీష్ కుమార్, పత్తికొండ ఎస్ఐ ఆర్ విజరు కుమార్ నాయక్, చిప్పగిరి కానిస్టేబుళ్లు షబ్బీర్, రామోజీలకు వ్యక్తిగత నోటీసులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని డిజిపి, కర్నూలు రేంజ్ డిఐజి, డిఎస్‌పిలకు కూడా నోటీసులు జారీ చేశారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

జడ్జి అనుమతి లేకుండా కోర్టు హాల్లోకి పోలీసులు చొరబడి నిందితుడిని బలవంతంగా అరెస్టు చేసిన ఘటనకు బాధ్యులైన వాళ్లపై చర్యలకు ఆదేశాలివ్వాలంటూ పత్తికొండ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి జి భాస్కర్ వేసిన వ్యాజ్యం తరపున న్యాయవాది కెవి రఘువీర్ వాదించారు.

## సిఐ కనకారావుకు ప్రశంసాపత్రం.. తెలుగు తమ్ముళ్ల ఆగ్రహావేశాలు

**గన్నవరం(కృష్ణా), జనవరి 28 ప్రభాతవార్త:** వైసిపి పాలనలో కృష్ణాజిల్లా గన్నవరంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేసిన అప్పటి సిఐ కనకారావుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందచేయటంపై తెలుగుతమ్ముళ్ళు మండి పడుతున్నారు. అక్రమ కేసులతో తమను మానసికంగా వేధించినందుకు ఈబహుమతి ఇచ్చారాఅని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే వైసిపి పాలనలో గన్నవరంలో టిడిపి కార్యాలయంపై వైసిపి మూకలు దాడిచేసి కార్యాలయాన్ని ధ్వంసం చేసారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు కార్యాలయం వద్దకు చేరుకుని వైసిపి దుండగులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈసందర్భంగా రెండుపార్టీల శ్రేణుల మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. ఈక్రమంలో వైసిపి కార్యకర్తలు తెలుగుదేశం కార్యకర్తలపై రాళ్ళదాడికి దిగటంతో టిడిపి కార్యకర్తలు, నాయకులతోపాటు అప్పటి సిఐ కనకారావుకు రాళ్ళదాడిలో గాయాలు అయ్యాయి. ఈఘటనలో దాడి చేసిన వారిని వదలివేసి బాధితులపైనే కనకారావు కేసులు పెట్టి అరెస్ట్ చేసారు. కనకరావుని వైసిపి నాయకులు రాయితో కొట్టినట్లు వీడియో సాక్ష్యం ఉన్నప్పటికీ తనపై టిడిపి శ్రేణులు దాడిచేసి గాయపరచినట్లు కనకరావు పోలీసులకు ఫిర్యాదు చేసారు. అంతేకాకుండా రెండడుగులు ముందుకు వేసి ఏకంగా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి టిడిపి శ్రేణులను తీవ్ర వేధింపులకు గురిచేసారు. అప్పట్లో ధ్వంసం అయిన కార్యాలయాన్ని పరిశీలించేందుకు గన్నవరం వచ్చిన చంద్రబాబునాయుడునూ కనకారావు అడ్డుకున్నారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కనకారావును విఆర్‌కు పంపించారు. తాజాగా విజయవాడ పోలీస్ కంట్రోల్ రూంలో సిఐగా నియమించారు. ఇదిలా ఉండగా విజయవాడలో తొలిసారి జరిగిన జిల్లాస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ లక్ష్మీశా, సిపి రాజశేఖర్‌బాబు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందించారు.



## 'కల్తీ'నెయ్యి సరఫరాలో మళ్లీ కీలక మలుపు!

**తిరుపతి,జనవరి 28ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి స్వచ్ఛమైన ఆవునెయ్యికి బదులు కల్తీజరిగిన నెయ్యి సరఫరా కేసులో మళ్ళీ కీలక మలుపుతిరుగనుందా అనేఅనుమానాలు వ్యక్తమవుతూన్నాయి. ఇప్పటికే తిరుమలకు కల్తీనెయ్యి సరఫరాకు సంబంధించి పక్కా ఆధారాలు,రికార్డులు సేకరించిన సిబిఐ సిట్ బృందంలోని సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురలీరాంభా నేతృత్వంలోని టీమ్ నిందితులను అరెస్ట్ చేసినెల్లూరు ఏసిబి కోర్టు జైలుకు తరలించింది. వారందరినీ పలు దఫాలుగా కస్టడీకి తీసుకుని విచారణ చేయడం, చివరకు మాజీ ఛైర్మన్ పిఏ చిన్నఅప్పన్న వ్యవహారంపై హైకోర్టులో సిబిఐ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. పాత్రధారులైన ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాలతో బాటు టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ళ కమిటీ అధికారులను నిందితులుగా చేర్చారు.

## వేసవిలో విద్యుత్ కోతలను నియంత్రించే దిశలో ప్రభుత్వం ముందస్తు చర్యలు

**విజయవాడ.జనవరి 28,ప్రభాత వార్తప్రతినిధి:** వేసవిలో విద్యుత్ కోతలను నియంత్రించే దిశలో ఏపీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది.తదనుగుణంగా ఇంధన శాఖా అధికారులు సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేశారు. దీనికోసం ఏపీలో అందుబాటులో ఉన్నటువంటి వనరుల నుంచి గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తి దిశగా పనుల కార్యాచరణను ప్రారంభించారు. రాష్ట్రంలో 21,153 మెగావాట్ల స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. అందులో పునరుత్పాదక విద్యుత్ 37 శాతంగా ఉంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారం నుంచే కరెంటు వాడకం క్రమంగా పెరిగి, వేసవిలో గ్రిడ్ గరిష్ఠ డిమాండ్ సుమారు 14,500 మెగావాట్లకు చేరవచ్చని ఓ అంచనా. గతేడాది 13,712 మెగావాట్లుగా నమోదు అయింది.

ఈ క్రమంలో స్వాపింగ్ ద్వారా హరియాణా, జమ్మూ నుంచి విద్యుత్ తీసుకోనున్నారు. ఈ లెక్కన చూస్తే కొన్ని టైం బ్లాక్ (ప్రతి 15 నిమిషాలు ఒక టైం బ్లాక్)లలో మాత్రమే స్వల్పంగా కొనాల్సి రావొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఉదయం, సాయంత్రం పీక్ డిమాండ్ వేళల్లో జెన్‌కో థర్మల్ కేంద్రాల నుంచి గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తి చేయాలని యోచిస్తున్నారు.

# తిరుమల సమాచారం

## పటిష్ట ఏర్పాట్లతో రామకృష్ణతీర్థ ముక్కోటి విజయవంతం చేద్దాం: టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,జనవరి 28ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలోని తీర్థాలలో జరిగే ముక్కోటి ఏకాదశులలో ఫిబ్రవరి 1న రామకృష్ణతీర్థ ముక్కోటికి విచ్చేసే భక్తులకు చక్కటి ఏర్పాట్లుచేయాలని టిటిడిఅదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశించారు. భక్తులకోసం సకల సౌకర్యాలు కల్పించాలని, అదనపు ఏర్పాట్లుచేసి అటవీ,విజిలెన్స్ విభాగాలు పాపవినాశనం వద్ద నుండి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రామకృష్ణతీర్థముక్కోటి ఉత్సవాలకు భక్తుల సౌకర్యాలపై తీసుకోవాల్సిన చర్యలు,ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో అధికారులతో సమీక్షించారు. అధిక బరువు, ఆస్తమా, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న యాత్రికులను, చిన్నపిల్లలను, అనుమతించబోమని తెలిపారు. భక్తులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలకు రెండు అంబులెన్స్‌లు, నాలుగు మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయాలని సూచించారు.

ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలను ఫిబ్రవరి 1న పాపవినాశననానికి అనుమతించడంలేదని, ఏపిఎస్‌ఆర్టీసి ద్వారా భక్తులు చేరుకోవాలని తెలిపారు.1వతేదీ ఉదయం 5గంటల నుండి మధ్యాహ్నం 12గంటలవరకు మాత్రమే ఈ తీర్థానికి అనుమతిఉంటుందన్నారు. ఈ సమావేశంలో డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిప్యూటీ ఇఒలు భాస్కర్, సోమన్నారాయాణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, రవాణ జిఎం శేషారెడ్డి, విఎస్ఒ అల్లంసురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవరప్రసాదినికి రూ.10లక్షలు విరాళం



**తిరుమల,జనవరి 28ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాల్లో బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి దాత 10లక్షలు రూపాయలు డిడి విరాళం అందించారు. గుంటూరుకు చెందిన ఏఎస్ఆర్ కన్వెన్షన్ సంస్థ ప్రతినిధులు ఈ విరాళాల డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## సరళమైన పద్ధతుల్లో విద్యార్థులకు శిక్షణ

### - తరగతి గదుల్లో ఆధునిక వసతులు - టిటిడి జెఇఒ శ్రవణంలో విస్తృత పరిశీలన



**తిరుమల,జనవరి 28ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న శ్రవణం శిక్షణ సంస్థలో విద్యార్థులకు సరళమైన పద్ధతుల్లో శిక్షణ ఇవ్వాలని, తరగతి గదుల్లో ఆధునిక వసతులు కల్పించాలని టిటిడి నూతన జెఇఒ డాక్టర్ ఎ.శరత్ సూచించారు. వినికిడి లోపం గల పిల్లలు శ్రవణంలో చేరగానే వీడియో రికార్డుచేసి తదుపరి శిక్షణ, అనంతరం వెలుపలకు వెళ్ళే అంశాలను వీడియో తీసి పిల్లల సంరక్షకులకు ఇస్తే వారిలో మరింత ఆనందం కలుగుతుందన్నారు. 0-5వయస్సు పిల్లలకు శిక్షణలో వివిధ దశల పురోగతి కనిపించేలా శ్రవణం ప్రాంగణంలో బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. శ్రవణంలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ ఆదేశాలతో చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జెఇఒగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శరత్ తొలిపర్యటనగా శ్రవణం శిక్షణ సంస్థను పరిశీలించారు. ఇక్కడ పిల్లలను పలకరించి వారితో ఆప్యాయంగా మాట్లాడారు. ఇక్కడే విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై సౌకర్యాలు, సదుపాయాలు, బోధన అంశాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. పిల్లలకు శిక్షణ చాలా బావుందని తల్లిదండ్రులు సంతృప్తి చెందారు. మెరుగైన బోధనాంశాలు, బోధనా పద్దతులు, మెటీరియల్, పాఠ్యాంశాలు అంశాలపై డిఇఒ వెంకటసునీలును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇలు వెంకటేశ్వర్లు, మనోహరం, అదనపు ఆరోగ్యఅధికారి డాక్టర్ సునీల్, శ్రవణం ప్రాజెక్టు ఎఇఒ అమ్ములు, డిఇ సరస్వతి ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 8నుండి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుమల,జనవరి 28ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 8వతేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 3న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 7వతేదీ శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరుగుతుంది. ఫిబ్రవరి 8వతేదీ ఉదయం ధ్వజారోహణంతో శ్రీకారం చుట్టే బ్రహ్మోత్సవాలు తొలిరోజు రాత్రి హంసవాహనం, 9న సూర్యప్రభవాహనం,చంద్రప్రభవాహనం, 10న భూతవాహనం, సింహవాహనం, 11న మకరవాహనం, శేషవాహనం, 12న తిరుచ్చిఉత్సవం, అధికార నందివాహనం, 13న వ్యాఘ్రవాహనం, గజవాహనం, 14న కల్పవృక్షవాహనం, అశ్వవాహనం, 15న మహాశివరాత్రి వేడుకలతోబాటు రథోత్సవం(భోగితేరు),అధికార నందివాహనం, 16న పురుషామృగవాహనం, శివపార్వతుల కల్యాణోత్సవం, తిరుచ్చివాహనం, 17న చివరగా త్రిశూల స్నానం, ధ్వజావరోహణం,రవాణాసురవాహనంతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చరణలు, శంఖనాదాలు, శివనామస్మరణ తో మారుమోగుతాయి. ప్రతిరోజూ ఉదయం,రాత్రి 7గంటలనుండి 9గంటల వరకు వాహనసేవలు ఊరేగుతాయి.

## తెలుగు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలి - శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,జనవరి 28ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం తిరుమల ఆలయంలోనికి సినీనటుడు ధనుష్ కుటుంబం, ధనుష్ తల్లిదండ్రులు, మాజీ ఎంపి అంబుమనిరాందాస్‌వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు . టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అనామకులు కొండదిగాల్సిందే : పోలీసులు



**తిరుమల,జనవరి 28ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రతను ,ప్రశాంతతను కాపాడటానికి అనధికార వ్యక్తులు,అనామకులు కొండ దిగాల్సిందేనని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు హెచ్చరించారు. పలు రకాలుగా తిరుమలలో కూలీలుగా, కార్మికులుగా, దుకాణాల్లో పనిమనుషులుగా ఉంటున్న వారందరూ తిరుమలలో ఉంటూ ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారు. ఇలాంటి వారిని కొండదించేలా ఎస్పీ ఆదేశాల మేరకు తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. బుధవారం వేకువజామున అనధికారికంగా కల్యాణకట్ట, డిఎంబి రోడ్డు మార్గాల్లో దీర్ఘకాలంగా ఉన్న వారిని 32మందిని తిరుమల నుండి ప్రత్యేక వాహనాల్లో తిరుపతికి తరలించారు. అనుమానాస్పదంగా కనిపించిన 15మందిపై వారి నేరచరిత్రను తెలుసుకున్నారు. తిరుమలలో భక్తులకు ప్రశాంతత కల్పించడం, శాంతిభద్రతను కాపాడటంలో ఈ చర్యలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

# ఆత్మ విశ్వాసమే కిరీటంగా..

స్కూల్ వెళ్తే తోటి పిల్లలంతా తనని చూసి భయపడే వారు. కాలేజీకి వెళ్లడానికి తనతో తను పెద్ద యుద్ధమే చేశా రామె. ఎంతో ధైర్యాన్ని తెచ్చుకుని... అందాల పోటీలకి వెళితే అంతటా హేళనలే. ఆ రికార్డు అధిగమించి... ఆత్మ విశ్వాసాన్నే కిరీటంగా ధరించారు మిథాలీ సోనవణే. అందగత్తెలకే శిక్షణనిస్తూ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్నారు. మిథాలీ. ఓ జ్యువెలరీ షూట్ ఉంది! మీ డేట్స్ కావాలి. మీరెప్పుడు ఫ్రీగా ఉంటే అప్పుడే పెట్టుకుందాం. 'మా రియాలిటీ షోకు జడ్జ్ మీరే వ్యవహరించాలి'. మిస్ ముంబయి. పోటీల్లోపాల్గొనాలి అనుకుంటున్నా శిక్షణ కోసం మీ దగ్గరకు వచ్చా... ఇదీ ఇప్పుడు మిథాలీకి ఫ్యాషన్ రంగంలో ఉన్న క్రేజ్. కానీ ఒకప్పుడు అవకాశాల కోసం ఆమె చేయని పోరాటం లేదు. వెళ్లిన ప్రతిచోటా ఛీత్కారాలే 'కాలినగాయాలతో అందాల పోటీల్లో పాల్గొంటావా? వికృత రూపం, విచిత్ర ఆలోచన అంటూ అన్నీ హేళనలే. 'రంగు, రూపం బాహ్య సౌందర్యానికి సంబంధించినవి. వీటన్నింటికన్నా ఆత్మ సౌందర్యం చాలా గొప్పది. అదే నన్ను వెనకడుగు వేయనీయకుండా అడ్డుకుంది' అంటారు మిథాలీ.



**ఐదేళ్లప్పుడు ప్రమాదం...** మిథాలీ పుట్టి పెరిగిందంతా ముంబయి. నాన్న విలాస్, అమ్మ వందన, మధ్యతరగతి కుటుంబం. ఈమెకు ఐదేళ్లు ఉన్నప్పుడు, నిచ్చెన నుంచి విడుదల వేడినీళ్ల పాత్రలో పడిపోయారు. దాంతో కుడిచేతివైపు పూర్తిభాగం కాలిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించి, వైద్యం చేయడంతో బతికి బయట పడ్డారు కానీ, వారం రోజుల తర్వాత ఒంటినిండా మచ్చలు, మంట మొదలయ్యాయట. వైద్యులకు చూపిస్తే ఇన్ఫెక్షన్ సోకి ఉంది. వైద్యం చేసినా బతికే అవకాశాలు తక్కువ అన్నారు. '

**దగ్గరికి రానిచ్చేవారు కాదు...** 'నాకింకా గుర్తే... అద్దంలో చూసుకుంటా అంటే వద్దనేది అమ్మ. పాఠశాలకు వెళ్లడం మొదలు పెట్టాక... పిల్లలంతా నన్ను చూసి భయపడేవారు. ఇంటికి వచ్చి ఏడ్చేదాన్ని. అప్పుడు అమ్మే నాకు ధైర్యం చెప్పేది. అలా పది పూర్తిచేశా' అనే మిథాలీ అక్కడితో చదువు ఆపేసి ఇంటికే పరిమితం కావాలను కున్నారట. కాలేజీకి వెళితే ఇంకెన్ని హేళనలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని. 'నువ్వు బతకాలని నేను ఇంటా బయటా ఓ యుద్ధమే చేశాను. నీ జీవితం కోసం నువ్వు పోరాడలేవా అంది అమ్మ' ఆ మాటలతో మొదలైన నా ప్రయాణ మోడల్, నటి, శిక్షకురాలిగా అందాల ప్రపంచంలో ఎదిగేలా చేసింది. ఫైనాన్స్‌లో మాస్టర్స్ని పూర్తి చేశా అని గుర్తుచేసుకుంటారు మిథాలీ.

**వ్యాయామంగా మొదలుపెట్టి...** మానసిక, శారీరక సమస్యలను అధిగమించడానికి నృత్యాన్ని ఆసరాగా మలచుకోమన్నారు వైద్యులు దాంతో పదేళ్లప్పుడే కథ ఆమె జీవితంలో భాగమైంది. "అదే నా జీవితాన్ని మలుపు తిప్పుతుందని" ఊహించలేదు. డిగ్రీ చదువుతున్న రోజుల్లో ఓ డ్యాన్స్ రియాలిటీ షోలో పాల్గొన్నారు. అక్కడ అందిన ప్రశంసలే నాలాంటి వాళ్లలో స్ఫూర్తి నింపాలన్న ఆలోచనను కలిగించాయి. బ్యూటీ ప్యాజెంట్లలో పాల్గొనాలన్న నిర్ణయం కూడా అప్పటిదే. పాజెంట్లలో ఫైనల్స్ వరకూ వెళ్లి ఓడిపోయేదాన్ని. అలా రెండు మూడు పోటీల తర్వాత మిస్ టీజీపీసీ (ద గ్రేట్ పాజంట్ కమ్యూనిటీ వెస్ట్ జోన్)తో మంచి గుర్తింపు లభించింది. తర్వాత మిస్ సుకన్య, మిస్ దివా. మిస్ ఇండియా వంటి పోటీల్లోనూ పాల్గొన్నారు. నా గొంతులో వినిపించగలిగాను, నేషనల్ యూత్ ఐకాన్‌గా ప్రశంసలూ పొందా. మోడలింగ్ ఏజెన్సీ ప్రారంభించి డైరెక్టర్గానూ వ్యవహరిస్తున్నా' అనే మిథాలీ టెలి విజన్, ఫ్యాషన్ రంగంలో చేస్తున్న కృషికిగానూ గత ఏడాది దాదా సాహెబ్ ఫాల్కే అవార్డునూ అందుకున్నారు. కాలిన, యాసిడ్ దాడి బాధితు ల్లో స్ఫూర్తి నింపడానికి అనేక సేవా కార్యక్రమాలూ చేస్తున్నారు. ◘

## వ్యథ

# వేధించే భర్తతో విడిపోతే తప్పు కాదు !



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న : నా వయస్సు 35 ఏళ్ళు. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. నేను ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాను.నా భర్తకు 37 సంవత్సరాలు. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తు న్నాడు. ఆయన పెళ్లయి పిల్లలున్న మరొక మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. అడిగినా, బ్రతిమిలాడినా మారడం లేదు. గట్టిగా నిలదీస్తే విడాకులు ఇచ్చేస్తానంటున్నాడు. ఇంటికి వచ్చినా నేను వండిన అన్నం తినడు. తానే వండుకుంటారు లేదా హోటల్లో తిని వస్తాడు. ఖర్చులకి పైసా ఇవ్వడు. ఈ నేపధ్యంలో ఆయనకు మార్చుకోవడం వీలవుతుందా లేక విడాకులు ఇచ్చేసి నా జీవితం నేను అనుభ వించడం మంచిదా తెపండి. –ఒక సోదరి, శ్రీకాళం



జవాబు – అమ్మా, మీ పరిస్థితి చాలా బాధాకరమైనది. ఇది సాధారణ కుటుంబ గొడవ కాదు. భావోద్వేగ నిరక్ష్యం, ద్రోహం, బాధ్యతల నుంచి తప్పించుకోవడం లాంటి అన్నీ కలిసి ఉన్న తీవ్రమైన సమస్య.ఇందులో మీ తప్పు ఏమీ లేదు.మీ భర్త పెళ్లయిన, పిల్లలున్న మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నారు. అడిగినా, బ్రతిమిలాడినా మారలేదు. విడాకులు ఇస్తామంటూ బెదిరిస్తున్నారు. మీరు వండిన భోజనం కూడా తినడం లేదు. కుటుంబ ఖర్చులకు డబ్బు ఇవ్వడంలేదు. ఇద్దరు చిన్న పిల్లల పట్ల నిరక్ష్యం వహిస్తున్నారు. ఇవి అన్నీ కలిపి చూస్తే ఇది తాత్కాలిక తప్పు కాదు. భావోద్వేగ గందరగోళంకాదు.. చిన్న మోహం కూడా కాదుపూర్తి స్థాయి విఫలం దిశగా వెళ్లిన వివాహ సంబంధం. నిజాయితీగా చెప్పాలి అంటే, ఇలాంటి పురుషులు సాధారణంగా మారరు. మారాలంటే తన తప్పు అని ఒప్పుకోవాలి. సంబంధాన్ని పూర్తిగా ముగించాలి. కుటుంబ బాధ్యత తీసుకోవాలి. మిమ్మల్ని గౌరవించాలి, ప్రేమగా చూసు కోవాలి.పిల్లల భవిష్యత్తును ముందుగా చూడాలి.ఇవేవీ లేక పోగా మిమ్మల్ని మానసిక హింసకు గురిచేస్తున్నారు. ఈ నేపద్యంలో ఆయనతో కలసి ఉండటం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. కాబట్టి వేధించే భర్తతో విడాకులు తీసుకోవడమే తప్పు కాదు. ఆయన మారుతాడనే ఆశతో మిగిలిన జీవితాన్ని నాశనం చేసుకోకండి. పిల్లల భవిష్యత్తును ఫణంగా పెట్టకండి.మీరు చదువుకున్నారు, ప్రభుత్వ ఉద్యోగం ఉంది. ఇద్దరు పిల్లలను సంరక్షించి, పెంచి ప్రయోజకు లను చేయండి. ఆయనే విడాకులు ఇస్తానంటున్నారు కాబట్టి మధ్యవర్తుల ద్వారా పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోండి. లేదా ఆధారాలు చూపు కోర్టులో కేసు వేసి విడాకులు పొందండి. చిన్న పిల్లల బాధ్యత కూడా కోర్టు మీకే ఇస్తుంది. అవసరం అయితే ఒక న్యాయవాది సలహా తీసుకోండి. ◘

# భీష్మ ఏకాదశి

ఉత్తరాయణ పుణ్యకాలం ఏకాదశి రోజున తనువు చాలించాలి అనుకున్న ధీరోదాత్తుడు,కృష్ణుడి భక్తిలో ఎటువంటి కల్మషం లేని వాడు, తన మరణ తిధిని పర్వదినంగా అనుగ్రహించమని కోరుకున్న భీష్ముడు గురించి ఎంత చెప్పినా తక్కువే.మహాభారత వీరుల్లో మణిపూస భీష్ముడు. ఎదురైన ప్రతి కష్టాన్ని ఓ మెట్టుగా మలచుకున్న ధీరో దాత్తుడు. ఉత్తరాయణ పుణ్యకాలంలో తనువు చాలిస్తూ, తన మరణ తేదీని పర్వదినంగా అనుగ్రహించమని శ్రీకృష్ణుని కోరాడు. రాజ్యాధి. కారాన్ని స్వచ్ఛందంగా వదులుకున్న వాడు భీష్ముడు. ఇచ్ఛా మరణాన్ని వరంగా పొందాడు. జగతికి విష్ణు సహస్రనామ స్తోత్రం అందించాడు. మాఘ శుక్ల ఏకాదశినే భీష్మ ఏకాదశి అంటారు. భారత సంగ్రామం పూర్తి అయిన తర్వాత భీష్మ పితామహుడు అంపశయ్యపై ఉండిపోయాడు. ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్లి పోయారు .భీష్ముడు సుమారు నెలన్నార రోజులు బాణాల పైన పడి ఉన్నాడు. దేహం నిండా బాణాలు శక్తి పూర్తిగా క్షీ ణించిపోయింది. అసలే మాఘమాసం .ఎండకు ఎండుతూ, మంచుకు తడుస్తూ, నీరు లేదు,ఆహారం లేదు. స్వచ్ఛంద మరణం తెచ్చుకో గలడు. కానీ ఆయన ఇన్ని బాధలు భరిస్తూ ఉండిపోయాడు. ఉత్తరాయణం వరకు ఉండాలి అని అనుకున్నాడు .ఒక ఏకాదశి నాడు దేహం నుండి నిష్క్రమించాలని భగవంతుడిని తలుచుకుంటున్నాడు. మనసులో శ్రీకృష్ణుడిని సాక్షాత్కరించి కోగలిగే వాడు ఆయన .తన హృదయ మందిరంలో శ్రీకృష్ణుడితో మాట్లాడగలిగే వాడు భీష్ముడు. భీష్ముడుకి సర్వం శ్రీకృష్ణుడే అని విశ్వసించేవాడు. భీష్ముని సత్యనిష్ఠ అమోఘమైనది ఎన్ని కష్టాలు ఎదురైనా ఆయన సత్యనిష్ఠ కు దూరం కాలేదు .సత్యం కంటే ఏది గొప్పది కాదని భీష్ముడు భావించాడు .అదే విషయాన్ని ధర్మరాజుకు బోధించాడు. సత్యానికి ధర్మానికి అవినాభావ సంబంధం ఉంది .అందువల్లా సత్యం లేకుండా ధర్మం లేదు. ఏది ధర్మం ఏది అధర్మం అని నిర్ణయించడంలో భీష్ముని మించినవారు లేరు అయినా రెండు సందర్భాల్లో మాత్రం భీష్ముడు అధర్మానికి తలవంచి మిన్నకుండి పోయాడు. మొదటి సందర్భం ద్రౌపదిని నిండు సభలోకి వచ్చి వస్త్రాపహరణం చేసూనత ఉంటే వారిని నిరోధించలేదు. ఇక రెండో సందర్భం యుద్ధాన్ని ఆపేందుకు చివరి ప్రయత్నంగా శ్రీ కృష్ణుడు రాయబారానికి వచ్చినప్పుడు ఆయనను దుర్యోదనాదులు బంధించి చంపడానికి ప్రయత్నిస్తే ఆపలేదు. భీష్మ పితామహుడు ధర్మరాజునకు తలెత్తిన సందేహాలను తీరుస్తూ ఉంటే పక్కనే ఉన్న ద్రౌపతి నవ్వుతూ తాత ఆనాడు నాకు అవమానం జరుగుతుంటే ఏమయ్యాయి ఈ ధర్మాలు అని అడిగిందట .అందుకు భీష్ముడు అవును ద్రౌపతి నా దేహం దుర్యోధనుడి ఉప్పు తిన్నది నా ఆధీనంలో లేదు. నాకు తెలుసు నీకు అవమానం జరుగుతుందని. కానీ నా దేహం నా మాట వినలేదు. కనుక ఆ పాప ప్రక్షాళన కోసం ఇన్నాళ్లు ఉన్నాను అని చెప్పాడు. హే ద్రౌపతి కృష్ణ భక్తిలో ఎటువంటి కల్మషం లేదు. కానీ శరీరం దుష్ట మైపోయింది దాన్ని పరిశుద్ధం చేసుకోవాలని అంపసయ్యపై పడి ఉన్నాను .అందుకు ఈనాడు నేను ధర్మాలను చెప్పవచ్చును.అని పాండవులకు ఎన్నో నీతులు బోధించాడు. శ్రీకృష్ణుడు భీష్మపితామహుడు కి దేహ బాధలు కలుగకుండా వరం ఇచ్చి మెప్పించాడు. భగవంతుడు సముద్రం లాంటి వాడు నీరు ఉంటుంది కానీ పాన యోగ్యం కాదు .అదే నీటిని మేఘం వర్షిస్తే పాన యోగం.అందుకే భగవత్ జ్ఞానం నేరుగా కాకుండా భగవత్ తత్వం తెలిసిన భీష్ముడి ద్వారా శ్రీకృష్ణుడు చెప్పించాడు.మాఘమాస ఏకాదశి రోజున భీష్ముడు తన దేహాన్ని వదిలి స్వర్గానికి చేరుకున్నాడు.అందుకే దీనిని భీష్మ ఏకాదశి,జయ ఏకాదశి అని కూడా అంటారు. ఈరోజు మొదలు పెట్టిన ఏ కార్యమైన విజయవంతం అవుతుందని నమ్మకము.భీష్మని తమ పూర్వజనుగా భావిస్తూ ఎవరైతే ఆయనకు తర్పణం విడుస్తారో వారి పాపాలన్నీ దహించుకుపోతాయట.ఈ రోజున బ్రాహ్మణులకు గొడుగులు, చెప్పులు,మంచినీళ్లు,వస్త్రదానం చేస్తే శుభం కలుగుతుంది అని పెద్దలు చెప్తారు.మాఘ శుద్ధ ఏకాదశి నాడు విష్ణువును తులసీదళాలతో పూజిస్తారు.

- పాలపర్తి సంధ్యారాణి

# పోషకాల నిమ్మ



వంటింట్లో అందుబాటులో ఉండే నిమ్మ కాయంటే చాలామందికి చిన్న చూపే. కానీ, ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా దీనిలోని విటమిన్ సి వ్యాధి నిరోధకశక్తిని పెంచు తుంది. జలుబు, దగ్గు వంటి వాటిని రాకుండా అడ్డుకుంటుంది. ఇందులోని పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. నరాల ఆరోగ్యానికి అవసరమైన పొటాషియం పుష్కలంగా వీటి నుంచి లభిస్తుంది. శరీరం ఇనుముని గ్రహించుకోవడానికి సాయపడు తుంది. ◘

# మౌత్‌వాష్ ఆరోగ్యకరంగా..



మన నోట్లో మంచి చూపనే కాదు.. చెడు చూపు కూడా ఉంటుంది. ఈ చెడు చూపును తొలగించ దానికి చాలామంది మోత్వాష్లు ఉపయోగిస్తుం టారు. అయితే మార్కెట్లో లభించే మోత్వాష్లలో రసాయనాలు నిండి ఉంటాయి. కాబట్టి, వీలైతే ఇంట్లోనే దీన్ని సహజసిద్ధంగా తయారు చేసుకోవడం మేలంటున్నారు నిపుణులు.

**కావాల్సిన పదార్థాలు:** మరిగించిన నీళ్లు రెండు కప్పులు పెద్ద దాల్చిన చెక్క ముక్క ఒకటి .. లవంగాలు ఒక టేబుల్ స్పూన్ అనాస పువ్వులు మూడు.

**తయారీ:** మరిగించిన నీటిలో దాల్చిన చెక్క, లవంగాలు, అనాస పువ్వులు వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని గాలి చొరబడని సీసాలో నింపి.. రెండు రోజుల పాటు గది ఉష్ణోగ్రత వద్ద ఉంచాలి. ఆ తర్వాత వడకట్టుకుని మరో గాలి చొరబడని సీసాలో నిల్వ చేసుకోవాలి. ఇలా తయారుచేసుకున్న మోత్వాష్ రోజుకోసారి 30 నుంచి 40 సెకన్ల పాటు పుక్కిలిస్తే ప్రయోజనం ఉంటుందం టున్నారు నిపుణులు, సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన ఈ మోత్వాష్ పంటి నొప్పిని, నోటి దుర్వాసనను దూరం చేసి.. నోటిని శుభ్రపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇతర దంత, చిగుళ్ల సమస్యలతో దీర్ఘకాలం పాటు బాధపడే వారు మాత్రం దంత వైద్యులను సంప్రదించి తగిన చికిత్స

# షూటింగ్ పూర్తి చేసుకున్న హ్రీం...



షూటింగ్ పూర్తి చేసుకున్న హ్రీం... తెలుగు భీజాక్షరాల్లో 'హ్రీం' అనే అక్షరానికి ఎంతో ఉన్నతమైన విలువలతో కూడిన అర్థం ఉంది.'హ్రీం అనే ఒక్క భీజాక్షరంలో 'హ', 'ర', 'ఈ' 'మ' అనే అక్షరాలున్నాయి. హ అంటే ధర్మం, ర అంటే అర్థం, ఈ అంటే కామం, మ అంటే మోక్షం..'హ్రీం' అంటే దర్మార్ధ కామ మోక్షాలు కలగలిసిన భీజాక్షరం. ఇప్పటివరకు ఎక్కడా చెప్పని ఒక యదార్ధ గాధను ఆధారంగా తీసుకుని ఈ చిత్రానిన తెరకెక్కించారు. శివమ్‌మీడియా పతాకంపై 'హ్రీం' అనే భీజాక్షరంతో తయారైన ఈ సినిమాలో నూతన నటీనటులు పవన్ తాత, డాక్టర్ చమిందా వర్మ జంటగా నటించారు. హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం వరంగల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకుంది.' హ్రీం చిత్రానికి రాజేష్ రావూరి దర్శకుడు. శ్రీమతి సుజాత మల్లాల సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివమల్లాల నిర్మాత. వరంగల్ దగ్గరలోని పెద్ద పెండ్యాల గ్రామంలో తొలి షెడ్యూల్, హైదరాబాద్ హెచ్‌యంటీ కాలనీలోని ఫారెస్ట్ లొకేషన్స్‌లో సెకండ్ షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది చిత్రం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కీలక పాత్రల్లో ప్రముఖ నటులు తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, బెనర్జీ, భద్రం, అనింగి రాజశేఖర్ (శుభోదయం సుబ్బా రావు), త్రిపురనేని శ్రీవాణి, పూజారెడ్డి, వనితా రెడ్డి తదితరులు నటించారు.

## తెర

# 'కపుల్ ఫ్రెండ్లీ' ' లిరికల్ సాంగ్ రిలీజ్,



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తు న్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ రోజు 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా నుంచి 'గాబరా గాబరా' లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ పాటకు రాకేందు మోళి లిరిక్స్ రాయగా, ఆదిత్య రవీంద్రన్ కంపోజ్ చేశారు. సంతోష్ నారాయణన్ పాడారు. 'గాబరా గాబరా' పాట ఎలా ఉందో చూస్తే 'గాబరా గాబరా' సోదరా లైఫ్ మొత్తం, కాలమే తన్నేరా లక్ ని ఆమడ దూరం, బంతి భోజనంలో బంతిని వడ్డిస్తారా, చేపను వేపాక చెరువులో వేస్తారా, సంబంధం లేని పనులనే, చేస్తున్నాం సిగ్గే పడకనే, చెత్త చేరింది లోనే, 'గాబరా గాబరా' సోదరా లైఫ్ మొత్తం, కాలమే తన్నేరా లక్ ని ఆమడ దూరం, జానెడుగా పైనకి ఎక్కుదమంటే, బారెడుగా జీవితం కిందకు జారిపోతుందే... అంటూ కలిసి రాని లైఫ్ కు ఫేట్ ఇచ్చే ట్విస్ట్ లు, ఎంత ప్రయత్నించినా ఎదురయ్యే రెడ్ లక్ లు ఎలా ఉంటాయో చూపిస్తూ ఈ పాట సాగుతుంది.

# 'హే భగవాన్' టీజర్ విడుదల



ఫిబ్రవరి 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానున్న 'హే భగవాన్' ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే భగవాన్' అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరానున్నారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. వైవిధ్యమైన చిత్రాల కథానాయకుడు సుహాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో 'లిటిల్‌హార్ట్స్' ఫేమ్ శివానీ నగరం నాయిక. సీనియర్ నటుడు నరేష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో యాంకర్ స్రవంతి చొక్కారపు ఓ ప్రముఖ పాత్రలో కనిపించనుంది. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశూల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం గ్లింప్స్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా బుధవారం ఈచిత్రం టీజర్‌ను విడుదల చేయడంతో పాటు ఫిబ్రవరి 20న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా జరిగిన ఈ చిత్ర వేడుకలో చిత్ర నిర్మాత బి.నరేంద్ర రెడ్డి. దర్శకుడు గోపీ అచ్చర, ప్రొడక్షన్ డిజైనర్ రామ్‌కుమార్, ఎడిటర్ విప్లవ్, డీవోపీ మహిరెడ్డి, వంశీ నందిపాటి, స్రవంతి చొక్కారపు, హీరో అఖిల్‌రాజ్, హీరోయిన్ తేజస్వీరావు, హీరో సుహాస్, హీరోయిన్ శివానీ నగరం, దర్శ కుడు సాయి మార్తండ్, నటుడు సుదర్శన్, నిర్మాత రమణా రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ టీజర్ లాంచ్ అనగానే నాకు మేసేజ్‌లు వచ్చాయి. ఈ సినిమాలో నాది గత సినిమాలతో పోలీస్తే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమాలో ఎంటర్‌టైన్‌మెంట్ పాత్రను చేశాను. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్ విత్ కంటెంట్. ఇక నుంచి నా సినిమాలు అందర్ని అలరిస్తాయి.


# సుడిగాలి సుధీర్ (గోట్) సాంగ్ విడుదల



ప్రముఖ హాస్యనటుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం G.O.A.T (గోట్) Greatest Of AllTimes అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తం గా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపు కుంటోన్న ఈ చిత్రం ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ఈ చిత్రం నుంచి వచ్చిన టీజర్‌కు, సాంగ్స్‌కు అనూహ్య రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం నుంచి రైజ్ ఆఫ్ గణ అనే లిరికల్ వీడియోను సోమవారం విడుదల చేసింది చిత్రయూనిట్. ఇటీవల సీఎమ్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఓ ఈవెంట్‌లో ఈ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సంగీతం అందించారు. చిత్రంలో హీరో క్యారెక్టరైజేషన్‌ను తెలిపే విధంగా ఎంతో పవర్‌ఫుల్ మాస్‌గా ఈ సాంగ్‌గా ఉండబోతుంది. పాటలో ఉన్న విజువల్స్, సాహిత్యం కూడా అందర్ని ఆకట్టుకుంటుంది. నిర్మాత మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. ఈరోజు విడుదల చేసిన ఈ పాట కూడా ఎంతో రిచ్‌గా ఉంటుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది.

# 'మర్దానీ 3'తో రాణీ ముఖర్జీ' 30 ఏళ్ల ఐకాగినిక్ :

## -రణ్‌భీర్ కపూర్



బాలీవుడ్ సూపర్‌స్టార్ రణ్‌భీర్ కపూర్ తన ఇష్టమైన నటి రాణీముఖర్జీ 30 వసంతాల సినిమాతో సెలబ్రేట్ చేయటానికి భారతీయ సినీ పరిశ్రమ కలిసి ముందుకు రావటం చూసి చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.రణ్‌భీర్ కపూర్ డెబ్యూ మూవీ సావరియాలో రాణీ ముఖర్జీతో కలిసి నటించారు. ఈ సినీ ప్రయాణంలో క్లిష్ట సమయాల్లో ఆమె అతనికి తోడుగా నిలిచింది. అందుకనే రాణి ప్రయాణంలో, ప్రతి సినిమా సక్సెస్ కావాలని రణ్‌భీర్ కోరుకుంటుంటాడు. ఈ సందర్భంగా రణ్‌భీర్ కపూర్ మాట్లాడుతూ 'రాణీ ముఖర్జీ సావరియా చిత్రంలో నాతో కలిసి నటించారు. నేనెంతో కష్టపడి నటించానని నాకు చెప్పి ప్రోత్సహించిన మొదటి వ్యక్తి తనే. నాకు, ఆమె జరిగిన సంభాషణను నేను మరచిపోలేను. నాకు అవసరమైన సమయంలో ఆమె మాటలు నాలో ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. నేను ఆమెను దగ్గరగా గమనించాను. నేను ఆమె వర్క్‌ను చాలా దగ్గరగా గమనించాను. .రాణీ ముఖర్జీ మర్దానీ 3 ఇప్పుడు సోషల్ మీడియాలో, నెట్టింట తెగ వైరల్ అవుతోన్న సినిమా, అందరి నోట ఆ సినిమా గురించే. మర్దానీ ఫ్రాంఛైజీ విషయానికి వీటిలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను చూపించారు.





'ఓం శాంతి శాంతి శాంతిః' ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేసే సినిమా. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో తరుణ్ భాస్కర్ మల్టీ ట్యాలెంటెడ్ తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్ టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః' ఈషా రెబ్బా హీరోయిన్‌గా నటిస్తు

# 'ఓం శాంతి శాంతి శాంతిః' ప్రీరిలీజ్ ఈవెంట్

న్నారు. AR సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ. అందరికీ నమస్కారం. అందరికంటే చివర్లో హీరోనే మాట్లాడాలి. ఇందులో మా హీరో ఈషా. తనే చివర్లో మాట్లాడుతుంది (నవ్వుతూ) డైరెక్టర్ సజీవ్ చాలా మంచి మనిషి. తనకు కావాల్సింది వచ్చేంతవరకు హార్డ్ వర్క్ చేస్తూనే ఉంటాడు. డైరెక్టర్ సజీవ్ మాట్లాడుతూ.. అందరికీ థాంక్యూ సో మచ్. సృజన్ గారు కథలు ఎంపిక చాలా జాయితీగా ఉంటుంది. నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన ఆయనకి థాంక్యూ. హీరో విశ్వక్సేన్ మాట్లాడుతూ.. అందరికీ గుడ్ ఈవెనింగ్. గత ఏడాదిగా పబ్లిక్ అపీరియన్స్ డిటాక్స్ అని అండర్ గ్రౌండ్‌లో తిరుగుతుండే(నవ్వుతూ) కానీ ఇది ఫ్యామిలీ ఫంక్షన్. డిటాక్స్ కుదరదు. ఫలక్ నామదాస్‌లో సైదులు క్యారెక్టర్‌ని తరుణ్ తో చేయించడానికి చాలా కష్టపడ్డాను. ఏదో రకంగా ఒప్పించి చేయించాను. అయితే తర్వాత చాలా బాధపడ్డాను. ఎందుకంటే తన యాక్టర్‌గా చాలా బిజీ అయిపోయాడు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. తరుణ్‌ని యాక్టర్‌గా చూస్తుంటే చాలా ముచ్చటగా ఉంది. తన ఒక నదిలా ఫ్లోలో ఉంటాడు.

# టి 20లో దక్షిణాఫ్రికా విజయం

## 9 వికెట్ల తేడాతో వెస్టిండీస్ చిత్తు



**న్యూఢిల్లీ:** టీ20లో దక్షిణాఫ్రికా వెస్టిండీస్‌పై ఘన విజయం సాధించింది. వచ్చే నెలలో జరిగే టీ20 ప్రపంచ కప్‌కు ఇరు జట్లు సిద్ధమవుతుండగా, దక్షిణాఫ్రికా విండీస్ సాధించిన 173 -7 స్కోరును ఛేదించింది. ఇంకా 13 బంతులు మిగిలి ఉండగానే సునాయాస విజయాన్ని సాధించింది. బోలాండ్ పార్క్‌లో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోని మొదటి టీ20లో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్ అజేయంగా 86 పరుగులు చేసి తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించడంలో సహాయపడ్డాడు. మార్క్రమ్ 47 బంతుల్లో పరుగులు సాధించగా, అతనికి ర్యాన్ రికెల్టన్ సహాయపడ్డాడు. అతను 40 పరుగులు చేసి రెండవ వికెట్‌కు 93 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పాడు. విండీస్ తరఫున టాప్ స్కోరర్‌గా షిమ్రాన్ హెట్మెయర్ నిలిచాడు. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 32 బంతుల్లో 48 పరుగులు చేశాడు. రోవ్‌మన్ పావెల్‌తో కలిసి 74 పరుగుల భాగస్వామ్యంలో నిలిచాడు. కాగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండవ మ్యాచ్ ఈ నెల 29వ తేదీన ప్రిటోరియాలో జరుగుతుంది. ఆ తర్వాత 31వ తేదీన జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్‌లో చివరి మ్యాచ్ జరుగుతుంది. తదుపరి రెండు దేశాలు ప్రపంచ కప్‌కు వెళ్తాయి. అక్కడ వెస్టిండీస్ ఫిబ్రవరి 7న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో స్కాట్లాండ్‌తో తలపడనుండగా, దక్షిణాఫ్రికా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 9న అహ్మదాబాద్‌లో కెనడాతో జరుగుతుంది.



# టాటా స్టీల్ చెస్‌లో ప్రజ్ఞానంద తొలి విజయం



**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ విజ్క్ ఆన్ జీ-2026లో ప్రజ్ఞానంద తన మొదటి విజయాన్ని నమోదు చేసుకున్నాడు. నెదర్లాండ్స్‌లో జరిగిన 9వ రౌండ్ విజయంతో భరత్ గ్రాండ్ మాస్టర్ రమేష్‌బాబు ప్రజ్ఞానంద విజయం కోసం తన దీర్ఘకాల నిరీక్షణకు ముగింపు పలికాడు. వరుసగా ఆరు డ్రాల తర్వాత, ప్రాగ్ అద్భుతమైన ఆట ఆడి, ఆల్ ఇండియా మ్యాచ్‌లో అరవింద్ చిదంబరంపై 84-మూవ్‌ల పోరాట విజయాన్ని సాధించాడు. ఈ విజయంతో, అతను 9 ఆటల్లో కేవలం 4 పాయింట్లతో 9వ స్థానంలో తన స్వదేశీయులైన ఎరిగైసి అర్జున్, దొమ్మరాజు గుకేష్‌తో కలిసి నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్తాన్) కంటే 2 పాయింట్ల వెనుకబడి ఉన్నాడు. ఈ ఓటమితో, అరవింద్ తన 9 ఆటలలో కేవలం 2.5 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచాడు. దీంతో ఇప్పుడు అధికారికంగా అరవింద్ టైటిల్ రేసు నుండి నిష్క్రమించాడు. మరోవైపు ప్రపంచ ఛాంపియన్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ తన అప్రతిహత ప్రదర్శనను కొనసాగించాడు, అతను 9వ రౌండ్‌లో జర్మనీకి చెందిన మథియాస్ బ్లూబామ్‌తో జరిగిన మ్యాచ్‌లో మరో ఓటమిని ఎదుర్కొన్నాడు. గత 5 ఆటల్లో ఇది అతని మూడవ ఓటమి. మిగిలిన రెండింటిలో వరుసగా 5, 8 రౌండ్లలో చెక్ రిపబ్లిక్‌కు చెందిన థాయ్ డై వాన్ న్గుయెన్, స్లోవేనియాకు చెందిన వ్లాదిమిర్ ఫెడోసెవ్‌లపై విజయం సాధించాడు. గ్రాండ్ మాస్టర్ అర్జున్ తెల్లటి పావులతో అమెరికన్ గ్రాండ్ మాస్టర్ హాన్స్ నీమాన్ పై చాలా తక్కువ 22మూవ్ ల డ్రా ఆడాడు.

# ప్రో రెజ్లింగ్ లీగ్: ఓటమితో సీజన్ ముగించిన ముంబై

## ఢిల్లీ 6-3తో కీలక విజయం

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్-2026 మ్యాచ్‌లో ఢిల్లీ దంగల్ వారియర్స్ జట్టు ముంబై దంగల్స్‌పై 6-3 తేడాతో కీలక విజయం సాధించి, సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. దీంతో ఢిల్లీ స్టాండింగ్స్‌లో ఐదవ స్థానంలో నిలవగా, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్ ఒక్క విజయం లేకుండా ముగించింది. పురుషుల 74 కిలోల తొలి టైలో ఢిల్లీ సత్తా చాటింది. దీపక్‌తో తురాన్ బయ్‌రామోవ్ గట్టి పోటీని ఎదుర్కొన్నాడు. పీరియడ్ 1 లో యాక్టివిటీ పాయింట్ ఇచ్చిన తర్వాత, బేరామోవ్ రెండవ పీరియడ్‌లో పుష్‌అవుట్‌తో టైను ముగించాడు. మహిళల పోటీలో (62కిలోలు) అంజ్లి దూకుడు ప్రదర్శించి పవర్ మినిట్‌లో ఓల్హా పదోషిక్‌ను 19-10తో ఓడించి ఢిల్లీ తొలి ఆధిక్యాన్ని పెంచింది. మహిళల విభాగంలో (76) అనస్తాసియా




అల్పీవా జ్యోతి బెర్వాల్‌పై విజయం సాధించి ఆధిక్యం పెంచింది. బెర్వాల్ పాయింట్‌ను సాధించిన తర్వాత అల్పీవా ప్రతిస్పందించడంతో ఢిల్లీ 3-0తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత కార్లా గొడినెజ్ గొంజాలెజ్ (57) మహిళల పోటీలో ప్రత్యర్థి పుష్పపై నాలుగు పాయింట్ల టేక్‌డౌన్‌తో 9-1 విజయాన్ని సాధించింది. పురుషుల బౌట్‌లో (65) ఢిల్లీ కెప్టెన్ సుజీత్ కల్కల్ అలీ రహీమ్‌జాదేపై 9-2 తేడాతో గెలుపొందాడు. కల్కల్ రెండవ వ్యవధిలో మరిన్ని పాయింట్లను జోడించి వారియర్స్‌కు 2 పాయింట్లు సాధించి 5-0 ఆధిక్యాన్ని సంపాదించాడు. మహిళల బౌట్‌లో (53) జ్యోతి సిహాగ్ సారికపై 12-9తో గెలిచింది.




## టి20 ప్రపంచ కప్‌కు ముందు..

# భారత్ వార్మప్ మ్యాచ్

## ఆటగాళ్ల ఫిట్‌నెస్‌కు టెస్ట్

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్‌కు ముందు భారత జట్టు ఫిబ్రవరి 4న ముంబైలో వార్మప్ మ్యాచ్ ఆడనుంది. ఫిబ్రవరి 7న ప్రారంభమయ్యే టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టు ఎటువంటి అధికారిక ప్రాక్టీస్ మ్యాచ్‌లు లేకుండానే మైదానంలోకి దిగాల్సి ఉంది. కానీ ఇప్పుడు, ఫిబ్రవరి 4న ముంబైలోని బ్రబోర్న్ స్టేడియంలో వార్మప్ మ్యాచ్ నిర్వహించాలని బిసిసిఐ సెలక్టర్లు పరిశీలిస్తున్నారు. ఈ మ్యాచ్ దక్షి ణాఫ్రికాతో లేదా ఇండియా ఎ ఆటగాళ్లతో ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్ కావచ్చు. పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు జట్టు పూర్తిగా సిద్ధంగా ఉండాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. ఈ మ్యాచ్ జట్టు యాజమాన్యానికి ఒక అగ్ని పరీక్షగా ఉపయోగపడుతుంది. ఇది గాయపడిన ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను అంచనా వేయడమే కాకుండా, రియాన్ పరాగ్ వంటి ఆటగాళ్లకు వారి సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి అవకాశాన్ని కూడా అందిస్తుంది. పాకిస్తాన్‌తో జరిగే బిగ్ మ్యాచ్‌కు ముందు కోచ్ మరియు కెప్టెన్ తమ అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవెన్‌ను ఖరారు చేయడానికి ఈ మ్యాచ్‌ను ఉపయోగించుకుంటారు.

ఇక టీమిండియాలో ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్, బ్యాట్స్‌మన్ తిలక్ వర్మ ఫిట్‌నెస్ జట్టుకు అతిపెద్ద ఆందోళనగా తయారైంది. సుందర్‌కు సైడ్ స్ట్రెయిన్ (పక్కటెముకలు మరియు వీపు దగ్గర కండరం) నుండి నెమ్మదిగా కోలుకుంటున్నాడు. దీని వలన అతను ప్రపంచ కప్ ప్రారంభ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది. అలాగే తిలక్ త్వరిత గతిన కోలుకుంటున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 12న జరిగే రెండవ మ్యాచ్‌కు అతను ఫిట్‌గా ఉంటాడని భావిస్తున్నారు. అయితే, ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో జరిగే బిగ్ మ్యాచ్ నాటికి జట్టు పూర్తిగా స్థిరపడాలని సెలెక్టర్లు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే రియాన్ పరాగ్‌ను సిద్ధంగా ఉండమని ఆదేశించారు. ఇక వాషింగ్టన్ సుందర్ స్థానంలో రియాన్ పరాగ్ ఒక ప్రముఖ పేరు. పరాగ్ భుజం గాయం నుండి కోలుకుంటున్నాడు. అతన్ని సిద్ధం చేయమని బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని కోరారు. పరాగ్ ఈ నెల 28, 30 తేదీలలో రెండు సిమ్యులేషన్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అతను ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణుడైతే, ఫిబ్రవరి 2న ముంబైలో జట్టులో చేరమని అడగవచ్చు. ?ప్పటికే అతడు యోయో పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ఇటీవలే న్యూజిలాండ్ సిరీస్ కోసం సుందర్ స్థానంలో రవి బిష్ణోయ్, తిలక్ స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌లను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఈ నెల 30 నాటికి జట్టులో అధికారిక మార్పులు చేసే అవకాశం ఉంది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో స్వియాటెక్ సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఐదవ సీడ్ ఎలెనా రైబాకినా తన ప్రత్యర్థి ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్‌ను ఓడించింది. దీంతో సెమీఫైనల్లో పెగులాతో రైబాకినా తలపడనుంది. మెల్‌బోర్న్ పార్క్‌లో బుధవారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్లో రైబాకినా తన స్థానాన్ని రెండో సెట్‌లో ఆధిపత్య ప్రదర్శనతో బుక్ చేసుకుంది. స్వియా టెక్‌ను 7-5, 6-1 తేడాతో ఓడించింది. స్వియాటెక్ త్వరగా ఆరంభించి తొలి గేమ్‌లో రైబాకినాను బ్రేక్ చేసింది. ఆమె కజకిస్తాన్ రెండవ సర్వ్‌ను అధికమించి కానీ



నంబర్ టూ సీడ్ ఏకీకృతం చేయడంలో విఫలమై తన ఆధిక్యాన్ని వదులుకుంది. చివరి గేమ్ వరకు ఇద్దరు ఆటగాళ్లు సర్వీస్‌ను నిలబెట్టుకున్నారు. దాదాపు గంటసేపు ఆట తర్వాత చివరకు స్వియాటెక్ రైబాకినాకు తొలి సెట్‌ను అందించింది. ఆ తర్వాత రైబాకినా తన సర్వీస్‌తో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వియాటెక్‌ను దెబ్బతీసి ఆధిక్యాన్ని సంపాదించింది. అంతేకాకుండా పోల్ స్థానంలో పాతుకుపోయిన ఫోర్‌హ్యాండ్‌ను కార్నర్‌లోకి క్రాష్ చేయడం ద్వారా రెండవ సెట్‌లోని రెండవ గేమ్‌ను కైవసం చేసుకుంది.

# ఇండో ఇయు ట్రేడ్ డీల్ మద్దతు

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, జనవరి 28:** ఇండోయూరోప్ ట్రేడ్‌డీల్ ఖరారు కావడం ద్వైపాక్షిక వాణిజ్యం పెరగడం, ఎగుమతుల్లో భారీ ప్రయోజనాలు కనిపిస్తుండటంతో ఈక్విటీ మార్కెట్లు బుధవారం లాభాల్లోనే ముగిసాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 487.20 పాయింట్లు లాభపడి 82,344.68 పాయింట్లవద్ద ట్రేడింగ్‌ముగిస్తే నిఫ్టీ 50సూచీ 167.35 పాయింట్లు లాభపడి 25,342.75 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగించింది. గడచిన రెండు సెషన్లలో సెన్సెక్స్ 0.99శాతం, నిఫ్టీ 1.17శాతం లాభపడ్డాయి. భెల్ 9.21శాతం, బజాజ్‌ఫైనాన్స్ 2.33శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.30శాతం చొప్పున నిఫ్టీలో వృద్ధినినమోదుచేసాయి. మిడ్‌క్యాప్ బిఎస్‌ఇ సూచీ 1.69శాతం, స్మాల్ క్యాప్‌సూచీ 1.81శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 2920 కంపెనీలు ర్యాలీతీసాయి. 1315 కంపెనీలు క్షీణత నమోదుచేస్తే 145 షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 91.78గా కొనసాగాయి. అంతకు ముందు 91.68తో పోలిస్తే కొంత దిగువన ముగిసింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూ చర్లు ఫిబ్రవరి ఐదునాటి సెటిల్‌మెంట్లు 4.09 శాతం పెరిగి రూ.1,64,150గా ఉంది. అమెరికా డాలర్ ఆరు కరెన్సీలతోపోలిస్తే 0.43శాతం పెరిగింది. పదేళ్ల అమెరికా బాండ్లు 0.62శాతం పెరిగి 4.249గా ఉన్నాయి. కమోడిటీ మార్కెట్‌లోబ్రెంట్ ముడిచమురు మార్చినెల సెటిల్‌మెంట్లు 41సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు రూ.67.16 డాలర్లుగా కొనసాగింది. టివిఎస్ మోటార్స్ 4.72శాతంపెరిగింది. వొడాఫోన్ ఐడియా కూడా 1.02శాతం ర్యాలీ తీసింది. భెల్ 8.90శాతం పెరిగితే మారుతిసుజుకి మాత్రం 2.39శాతం క్షీణించింది. సన్‌టెక్ రియాల్టీ 1.62శాతం పెరిగితే విశాల్‌మెగా మార్ట్ 4.12 శాతం క్షీణించింది. మహీంద్ర లాజిస్టిక్స్ మాత్రం 15.82శాతం పెరిగింది. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 7.69 శాతం పెరిగింది. బొండాడ ఇంజినీరింగ్ 3.58శాతం క్షీణించింది.

# మారుతిసుజుకి నికరలాభం రూ.3879.1 కోట్లు




**ముంబయి, జనవరి 28:** మారుతిసుజుకి ఇండియా బుధవారం తన త్రైమాసిక ఫలితాలుప్రకటించింది. డిసెంబరుత్రైమాసికంలో రూ.3879.1 కోట్ల నికరలాభం ఆర్జించామని, గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన 3,726.9 కోట్లకంటే 4.1శాతం వృద్ధినమోదుచేసినట్లు తెలిపింది. క్రమానుగతంగా వచ్చినపద్ధతిలో అయితే నికర లాభం 15.8శాతం పెరిగి 3349 కోట్లుగా ఉందని కంపెనీ తెలిపింది. కంపెనీ కొత్త లేబర్‌కోడ్‌లు అమలు చేయడంవల్ల వన్‌టైమ్ వ్యయం రూ.593.9 కోట్లు అదనపు వ్యయం చేయాల్సి వచ్చిందని తెలిపింది. సేల్స్ రాబడులు 29.2శాతం పెరిగి 47,537.2కోట్లుగా ఉన్నాయి. అదే గత ఏడాది ఇదేకాలంలో 36,805.1 కోట్లు మాత్రమే ఉన్నాయి. భారత కార్లమార్కెట్‌లో స్థిరమైన వృద్ధి రికవరీకారణంగాను, జీఎస్టీ హేతుబద్ధీకరణ ద్వారాను అమ్మకాలు పెరిగాయని వివరించింది. దేశీయ విక్రయాలు ఈ త్రైమాసికంలో 5,64,669 వరకూ ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. చిన్న కార్లు 18శాతం ఉన్నాయి. 68,328విక్రయించామని మొత్తం అమ్మకాలు 6,67,769 యూనిట్లుగా ఉందని 18శాతం వార్షికవృద్ధిని సాధించినట్లు కంపెనీ చెపుతూ ఎగుమతులు కూడా 3.9శాతంపెరిగి 1,03,100కు చేరినట్లు తెలిపింది. మారుతి షేర్లు 2.3శాతం దిగువన అంటే 14,886.5 రూపాయలుగా బిఎస్‌ఇలో ట్రేడ్ అయ్యాయి.

# ఎల్ అండ్ టి నికరలాభం రూ.3215కోట్లు





**ముంబయి,జనవరి 28:** ఇంజినీరింగ్ నిర్మాణరంగ దిగ్గజం లార్సెన్ అండ్ టూబ్రో మూడో త్రైమాసికంలో 3215 కోట్లు నికరలాభం అర్జించినట్లు ప్రకటించింది. అంతకుముందు ఏడాది 3358.84 కోట్లతోపోలిస్తే 4.3శాతం తగ్గింది. కొత్త లేబర్‌కోడ్‌లు అమలుచేయడంవల్ల వన్‌టైమ్ ఆర్థికభారం పెరిగింది. రూ.1191 కోట్లు కేటాయింపు జరపడంతో ఈ ప్రభావం నికరలాభంపై చూపించినట్లు కంపెనీ వెల్లడించింది. బిఎస్‌ఇలో ఎల్‌అండ్‌టి షేర్లు 3793.65గాను, ఎన్‌ఎస్‌ఇలో 3794 రూపాయలుగాను ట్రేడ్ అయ్యాయి. కొత్త ఆర్డర్లు రూ.61,876 కోట్లమేర సాధించినట్లుకంపెనీ తెలిపింది. కస్టమర్ రెవెన్యూ కూడా రూ.33,700 కోట్లుగా ఉంది. ఐదుశాతంపెరిగింది. ఇంధన ప్రాజెక్టుల విభాగంలోరూ.46,049 కోట్లు ఆర్డర్లువచ్చాయి. కస్టమర్ రాబడులు ఈవిభాగంలో 12,726 కోట్లుగా ఉంది. 15శాతంపెరిగాయి. హైటెక్ ఉత్పత్తి విభాగంలో ఆర్డర్లు 2168 కోట్లవరకూ ఉన్నాయి. కానీ 74శాతం క్షీణించాయి. కస్టమర్ రాబడులు కేవలం రూ.3267 కోట్లుగా ఉన్నాయి. ఐటి టెక్నాలజీ సేవల్లో ఐటి అండ్ టిఎస్ విభాగం రూ.13,526 కోట్లు రాబడులుసాధించి 12శాతం వృద్ధిని నమోదుచేసింది. ఎబిడిటా 19.7శాతంగా ఉంది. ఆర్థికసేవల విభాగంలో రూప.4477 కోట్లుగా ఉన్నాయి. 15శాతంపెరిగినట్లు కంపెనీ తెలిపింది. ఏడాది మొత్తంగా ఎల్‌అండ్‌టికి రూ.7.33 లక్షలకోట్ల ఆర్డర్లు వచ్చాయి. 2024 డిసెంబరుతో పోలిస్తే ఏడాదిలో 30శాతం వృద్ధి కనిపించింది. అంతర్జాతీయ ఆర్డర్లే మొత్తం ఆర్డర్లలో 49శాతం వాటా తో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది.

# పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 7.8%



**న్యూఢిల్లీ,జనవరి 28:** భారత పారిశ్రామిక ఉత్పత్తి సూచీ డిసెంబరు నెలకు గాను 7.8శాతంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. అంతకు ముందు నెల నవంబరులో 7.2శాతం నుంచి కొంతమేర పెరిగిందని కేంద్ర అర్థగణాంక, పథక అమలు శాఖ వివరించింది. గత ఏడాది డిసెంబరులు కీలకంగా ఉన్న మూడు రంగాలు సానుకూల వృద్ధిని సాధించాయి. మైనింగ్ ఉత్పత్తి 6.8 శాతంగా ఉంది. ఉత్పత్తిరంగంలో 8.1శాతం, విద్యుత్ ఉత్పత్తిలో 6.3శాతంగా ఉన్నట్లు మంత్రిత్వశాఖప్రకటించింది. ఉత్పత్తిరంగం వృద్ధి జిడిపికి అత్యంత కీలకంగా ఉంటుంది. మొత్తం 23 పారిశ్రామిక గ్రూపుల్లో 16 గ్రూపుల్లో సానుకూల వృద్ధి కనిపించిందని గత ఏడాది డిసెంబరులో ఈ వృద్ధి స్థిరంగా ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. అమెరికా ప్రభుత్వం భారీ సుంకాలు విధించినప్పటికీ భారత్ ఆర్థికవృద్ధి కొంత మందగమనంతోకనిపించినా తయారీ రంగం మాత్రం స్థిరంగానే ఉంది. అయితే ఇంధనరంగం మాత్రం అత్యంత ఖరీదైనదిగానిలిచింది. రష్యాచమురు ఉత్పత్తిదారులు, పంపిణీదారులపై అమెరికా సుంకాలు విధించడంతోనే ఇలా ప్రతికూలత ఎదురయింది. బేసిక్ మెటల్స్ 12.7 శాతం, మోటార్ వాహనాలు, ట్రైలర్లు, సెమి ట్రైలర్లు 33.5శాతం, ఫార్మారంగం 10.2 శాతం వృద్ధిని నమోదు చేసాయి. స్టీల్‌పైపులు, ట్యూబులు, ఎంఎస్‌శ్లాబులు, అల్లాయ్‌స్టీల్ రేకులు వంటి వాటి ఉత్పత్తి భారీగాపెరిగింది. ఆటో మొబైల్‌రంగంలో యాక్సిల్స్, ఆటో విడిభాగాలు, స్పేరుపార్టులు వాణిజ్యవాహనాల విడి భాగాలు వంటివి ఎక్కువ ఉత్పత్తిని నమోదు చేసాయి. ఫార్మారంగంలో పటిష్టమైన వృద్ధికనిపించింది. జీర్ణవ్యవస్థకు సంబంధించిన ఎంజైమ్ లు, యాంటసిడ్‌లు, విటమిన్ యాక్టివ్ ఫార్మా మూల ఉత్పత్తులు ఫార్ములేషన్లు ఎక్కువ వృద్ధి కనిపించింది. ఇన్‌ఫ్రా, వినియోగరంగ డిమాండ్ వృద్ధికారకంగా ఉంది. ఇన్‌ఫ్రాలో నిర్మాణరంగ ఉత్పత్తులు 12.1శాతం పెరిగితే కన్స్యూమర్ ఉత్పత్తులు 12.3శాతం, భారీ యంత్ర సామగ్రి తయారీ 8.1శాతంఅంతర్ ఉత్పత్తుల తయారీ 7.5శాతం, కన్స్యూమర్ నాన్‌డ్యూరబుల్స్ 8.3శాతం, ప్రాథమిక ఉత్పత్తులు 4.4శాతం చొప్పున పెరిగాయి. డిసెంబరు ఐఐపికి ఇన్‌ఫ్రా, నిర్మాణరంగం, ప్రైమరీగూడ్స్, అంతర్ ఉత్పత్తులే అత్యధిక వృద్ధితో ఐఐపిని పైపైకి తీసుకెళ్లాయి.

# అమెజాన్‌లో 16వేలమంది కార్పొరేట్ ఉద్యోగులపై వేటు




**న్యూఢిల్లీ,జనవరి 28:** అమెజాన్‌లో 16 వేలమంది కార్పొరేట్ ఉద్యోగులపై వేటు పడుతోంది. మేనేజ్‌మెంట్ లేయర్లను తగ్గించడంతోపాటు వనరులను రీడైరెక్ట్‌చేసుకుని ఎఐ వ్యవస్థను మరింత పటిష్ఠంచేసుకునేందుకు కోత పడుతుందని చెపుతున్నారు. అమెరికా కేంద్రంగా ఉన్న ఉద్యోగులకే ఎక్కువ వేటు పడుతుందని, నిర్ణయం తీసుకోడానికి 90రోజులు వ్యవధి ఇచ్చింది. అంతర్గతంగానే ప్రత్యామ్నాయ కొలువుల్లోకి వెళ్లాలంటే తమ నిర్ణయం చెప్పాలని కంపెనీ తెలిపింది. కంపెనీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ బెత్ గాలెట్టి ఈ వివరాలుప్రకటించారు. అధికారతత్వాన్ని తగ్గించి వనరులను మరింత పటిష్టం చేసుకోవడంతోపాటు యాజమాన్య లేయర్లను తగ్గించేపనిలో ఈ లేఆఫ్‌లు తప్పవని అన్నారు. కొన్ని నెలల క్రితం అమెజాన్ 14 వేలమందిని తగ్గిస్తామని ప్రకటించింది. 2022, 2023 సంవత్సరాల్లో ఈ తగ్గింపులు కొన్ని జరిగాయి. మొత్తం 27వేలమందికిపైగా కంపెనీ ఉద్వాసన పలికింది. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆండీ జస్సీ మాట్లాడుతూ గతంలో అనేక సందర్భాల్లోకూడా మేనేజ్‌మెంట్‌వ్యవస్థను సరళీకృతంచేసిందని, మహమ్మారికాలంలో భారీ వృద్ధి కనిపించడంతో ఆన్‌లైన్ వ్యవస్థలకు డిమాండ్‌కు అనుగుణంగా కొలువులు పెరిగాయని, తదనంతరం గత ఏడాదినుంచి ఎఐ రాక పెరడడంతో కార్పొరేట్ వర్క్‌ఫోర్స్‌ను తగ్గించక తప్పదని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అమెజాన్ 15.70 లక్షలమందిని నియమించుకుంది. వేర్‌హౌస్, లాజిస్టిక్స్ రంగంలోనే ఎక్కువమంది ఉన్నారు. కార్పొరేట్ వర్క్‌ఫోర్స్ 3.50 లక్షలమందివరకూ ఉన్నారు. ఈపుడు కోతలతో సుమారుగా 4.6 శాతం తగ్గుతుందని అంచనావేసింది. కంపెనీ రాబడులు కూడా డిసెంబరు త్రైమాసికంలో రూ.211 బిలియన్ డాలర్లకు పెరగవచ్చని అంచనాలున్నాయి. ఇప్పటికే త్రైమాసికం వారీగా 21 బిలియన్ డాలర్లు పెరుగుతూ వస్తోందని కొన్ని బిజినెస్ అనలిటిక్స్ అంచనావేసాయి.

## హెరిటేజ్, ఎంఅండ్‌ఎం ఫైనాన్షియల్స్ ఆర్థిక ఫలితాలు

### క్షీణించిన హెరిటేజ్, ఎం అండ్ ఎం లాభాలు

**ముంబయి,జనవరి 28:** హెరిటేజ్ ఫుడ్స్ మూడోత్రైమాసికంలో నికరలాభం 20శాతం తగ్గింది. 43 కోట్లనుంచి 34.6 కోట్లకు క్షీణించింది. ఈ మేరకు కంపెనీ ఫలితాలు విడుదల చేసింది. కంపెనీరాబడులుమాత్రం 8శాతం పెరిగి రూ.1119 కోట్లుగా ఉన్నాయి. అదే గత ఏడాది ఇదేకాలంలో రూ.1034 కోట్లనుంచి కొంతమేర వృద్ధిని నమోదుచేసాయి. ఎబిడిటా కూడా 43శాతం తగ్గి 110 కోట్ల నుంచి రూ.62.9 కోట్లకు చేరింది. మార్జిన్‌కూడా 10.6శాతంనుంచి 5.6శాతానికి చేరుకోగా నికరలాభాలు క్షీణతపై కంపెనీ ఫలితాలను విశ్లేషిస్తోంది. మరోకంపెనీ ఎంఅండ్‌ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ కూడా ఫలితాలు ప్రకటించింది. నికరలాభం 10శాతం క్షీణించి రూ. 824కోట్లుగా ఉందని తెలిపింది. రూ.918 కోట్లునుంచి పదిశాతం క్షీణించింది. రాబడులు మాత్రం 14శాతంపెరిగి రూ.5464 కోట్లుగా ఉన్నాయి. అదేవిధంగా థైరోకేర్ టెక్ నికరలాభం 52శాతంపెరిగి 19.1కోట్లనుంచి రూ.29 కోట్లకు పెరిగాయి. రాబడులు 18శాతం పెరిగి 166 కోట్లనుంచి రూ.196 కోట్లకు చేరాయి. ఎబిడిటా కూడా 41.7 కోట్లనుంచి 39శాతంపెరిగి 57.8శాతానికి చేరినట్లు కంపెనీ ప్రకటించింది.

M&M
Messere & Messere

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.